ప్రజాపక్షం 8th ANNIVERSARY 22nd October, 2026

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


ఎసిపిపై ఎఫ్ఐఆర్‌కు డిమాండ్
మహిళా జర్నలిస్టు అరెస్టు

అరెస్టులు ఉద్యమాన్ని అడ్డుకోలేవు: సిజెపి

ఆర్‌ఎస్ఎస్-బజరంగ్ దళ్ గూండాల దాడి హేయం

07


సంపుటి 09, సంచిక: 306 | మంగళవారం | 06-10-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## వైద్యరంగంలో ముగ్గురికి నోబెల్

ఈ ఏడాది కార్ల్ డిసెరోత్, పీటర్ హేగ్‌మాన్, జార్జ్ నగేల్‌ను వరించిన బహుమతి

**స్టాక్‌హోమ్:** వైద్యశాస్త్రంలో విశేష కృషి చేసినందుకు గానూ ఈ ఏడాది ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి వరించింది. కార్ల్ డిసెరోత్, పీటర్ హేగ్‌మాన్, జార్జ్ నగేల్ మెడిసిన్‌లో నోబెల్ బహుమతి గెలుచుకున్నారు. ఐయాన్ ఛానల్స్‌తో పాటు ఆప్టో జెనటిక్స్‌లో ఆ ముగ్గురు శాస్త్రవేత్తలు కొత్త ఆవిష్కరణలు చేశారని నోబెల్ కమిటీ తన ప్రకటనలో పేర్కొన్నది. మెదడులో కలిగే ఆలోచనలు, జ్ఞాపకాలు, భావోద్వేగాలు, ప్రవర్తనల గురించి పరిశోధకులు అధ్యయనం చేస్తున్నారు. అయితే తాజాగా ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు ఆప్టోజెనటిక్స్‌లో కొత్త విషయాన్ని కొనుగొన్నారు. మెదడులో ఉన్న నాడీ కణాల స్విచ్ ఆన్, స్విచ్ ఆఫ్ యాక్టివిటీ గురించి తరువాయి 8లో

## ఫారం-6లో మార్పులకు
# సుప్రీం ఆమోదం లేదు

- సిజెఐ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టీకరణ
- మార్పులు చేసిందెవరు? రికార్డులు చూస్తాం తీసుకురండి
- ప్రజావ్యాజ్యంపై జవాబు చెప్పాలని ఇసికి నోటీసు
- జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ విచారణకు పిటిషనర్ డిమాండ్

**న్యూఢిల్లీ:** ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి సమర్పించే ఫారం-6లో ఎన్నికల సంఘం చేసిన మార్పులు,చేర్పులకు సుప్రీంకోర్టు ఎలాంటి ఆమోదం తెలియజేయలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నాయకత్వాన గల ధర్మాసనం సోమవారం స్పష్టం చేసింది.ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై తన స్పందన ఏమిటో తెలియజేయాలని కూడా కేంద్ర ఎన్నికల సంఘానికి సంజాయిషీ నోటీ సు జారీ చేసింది.ఈ రికార్డులను తాము పరిశీలించాలనుకుంటున్నామని,ఫారమ్-6లో మార్పులు చేర్పులు ఎవరు సవరించారో తెలుసుకోవాలని ధర్మాసనం కోరుకుంటున్నదని జస్టిస్ సూర్యకాంత్ తెలియజేశారు. ఈ ధర్మాసనంలో ఆయనతోపాటు జస్టిస్ జోమాల్యబాగ్చి, జస్టిస్ వి.మోహన కూడా ఉన్నారు.భారత ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌తోపాటు ఉండే మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు గడచిన పది నెలల కాలంలో 14 సార్లు సిఇసి జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలతో విభేదించారని పేర్కొంటూ గతనెలలో ''ఇండియన్ ఎక్స్‌ప్రెస్'' ఆంగ్ల దినపత్రికల్లో ప్రచురితమైన పరిశోధనాత్మక వ్యాసం ఆధారంగా పిటిషనర్ శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం(పి.ఐ.ఎల్) పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం పైవిధంగా స్పందించింది.పాట్నా నివాసి రాకేశ్ కుమార్ సింగ్ దాఖలు చేసిన మరో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని కూడా కలిపి ధర్మాసనం విచారణ చేస్తోంది. దేశంలో అర్హులైన ప్రజలు ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవడంకోసం పూర్తిచేసే దరఖాస్తు పత్రాన్నే తరువాయి 8లో



## ఏకపక్ష నిర్ణయాలు
# రద్దుచేస్తాం

- కేంద్రం- ఇసిలకు సుప్రీంకోర్టు హెచ్చరిక నోటీసులు

సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం కేంద్ర ప్రభుత్వానికి,కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సంఘంలో మెజార్టీ అభిప్రాయం,ఏకగ్రీవ అభిప్రాయాలకు విరుద్ధంగా ఏకపక్షంగా తీసుకున్న చట్టవిరుద్ధ నిర్ణయాలను రద్దు చేస్తామని కూడా ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నాయకత్వానగల ధర్మాసనం స్పష్టం చేసింది.కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలకు ఎన్నికలసంఘంలో ఉన్న మిగిలిన ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేదని,వారి ఆమోదం లేకుండా ఏకపక్షంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ అనేక నిర్ణయాలు తీసుకున్నారని,అమలు చేశారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం పైవిధంగా స్పందించింది.సుప్రీంకోర్టులో తరువాయి 8లో

## హైకోర్టు యాక్టింగ్ సిజెగా శ్యామ్ కోశి

- సుప్రీం జడ్జిగా సిజె అపరేశ్ కుమార్ సింగ్
- రాష్ట్రపతి ఆమోదం

కేంద్ర న్యాయ శాఖ ఉత్తర్వులు

హైదరాబాద్/న్యూఢిల్లీ



తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ పి.శ్యామ్ కోశి నియమితులయ్యారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 223 ప్రకారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆ యన నియామకానికి ఆమోదం తెలపగా, కేంద్ర న్యాయశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే సమయంలో చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సుప్రీంకోర్టు నియామక ఉత్తర్వులు అ త్యవసరంగా వెలువడటంతో ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అయన కు తెలంగాణ అడ్వకేట్ తరువాయి 8లో

## మార్పులు చేయలేదు : ఇసి

అర్హులైన ప్రజలు ఓటర్లుగా చేరడానికి భర్తీచేసే ఫారమ్-6లో తాము ఎలాంటి మార్పులు,చేర్పులూ చేయలేదని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఫారమ్-6లో ఎన్నికల సంఘం చేసిన మార్పులు చేర్పులకు తాము ఎలాంటి ఆమోదం తెలియజేయలేదని,ఈ విషయంలో చట్టవిరుద్ధమైన నిర్ణయాలు ఉంటే రద్దుచేస్తామని తొలుత ప్రజాప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసిన కొద్ది గంటలకే సోమవారం రాత్రి కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది. పది రోజుల క్రితం అంటే సెప్టెంబరు 26వ తేదీన ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రకటన ప్రకారం,2025 జూన్ 24వ తేదీన బీహార్‌లో సర్ ప్రక్రియ సందర్భంగా ఫారమ్-6కు అనుసంధానంగా తాము జారీ చేసిన ఒక డిక్లరేషన్‌ను ఈ ఏడాది మే నెల 27వ తేదీన సుప్రీంకోర్టు సమర్థించింది.దీనికి అనుగుణంగా ఓటర్లుగా చేరేవారు గత సర్ ప్రక్రియకు అనుగుణంగా తమ తల్లి తండ్రుల వివరాలు తెలియజేయాలని జారీ చేసిన ఉత్తర్వును ఆ తర్వాత ఎన్నికల సంఘం ఉపసంహరించుకుంది.

## జ్ఞానేశ్ అబద్ధాల కోరు

తక్షణం రాజీనామా చేయాలి

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా డిమాండ్



సవరించిన ఫామ్6ను సుప్రీంకోర్టు ఆమోదించలేదని కోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర విమర్శలు చేశారు. సవరించిన ఫామ్6ను కోర్టు ఆమోదించిందంటూ సెప్టెంబర్ 26న ఎన్నికల సంఘం (ఈసీ) విడుదల చేసిన ప్రకటనను ఇప్పుడు వెబ్‌సైట్ నుంచి తొలగించారన్నారు. 'జ్ఞానేశ్ కుమార్ ఎన్నిసార్లు అబద్ధాలు చెబుతారు? సవరించిన ఫామ్6ను సుప్రీంకోర్టు ఆమోదించలేదని ఇప్పుడు కోర్టు స్పష్టంగా తేల్చింది. అయినప్పటికీ సెప్టెంబర్ 26న ఈసీ విడుదల చేసిన ప్రకటనలో మార్పులను సుప్రీంకోర్టు ఆమోదించిందని స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పుడు ఆ ప్రకటనను ఈసీ వెబ్‌సైట్ నుంచి తొలగించారు. ఎందుకు?' అని రాజా ప్రశ్నించారు. రాజకీయ పెద్దల ఆదేశాల మేరకు జ్ఞానేశ్ కుమార్ మొదట మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లను, వారి అభ్యంతరాలను పక్కనపెట్టారని... ఆ తర్వాత తన నిర్ణయాన్ని సమర్థించుకునేందుకు సుప్రీంకోర్టు తరువాయి 8లో

## మార్పులు చట్టవిరుద్ధం

- సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో నిస్సందేహంగా రుజువైంది
- ఈ నేరపూరిత దాడిలో సిఇసితో పాటు ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ జవాబుదారీగా చేస్తాం
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు ప్రధాన ఎన్నిక ల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజ్యాంగాన్ని అక్షరరూపంలో, స్ఫూర్తితో ఉల్లంఘించారని కాంగ్రెస్ ఆరోపించింది. ఎన్నికల సంఘం నిర్ణయాలు తీసుకున్న తీరును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై స్పందన కోరుతూ సుప్రీంకోర్టు ఎన్నికల సంఘానికి, కేంద్రానికి నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో పై విధంగా వ్యాఖ్యానించింది. ఎన్నికల సంఘం పనితీరుకు సంబంధించి వెలుగులోకి వచ్చిన తీవ్రమైన సంచలనాల నేపథ్యంలో, దానిపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి సుప్రీంకోర్టుకు ఒక అద్భుతమైన అవకాశం లభించిందని కూడా ఆ ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఫారం -6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారన్నది ఇప్పుడు నిస్సందేహంగా రుజువైందని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంపై జరిగిన ఈ నేరపూరిత దాడిలో సిఇసితో పాటు ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ జవాబుదారీగా చేస్తామని ఆయన ఉద్ఘాటించారు. వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) సమయంలో ఎన్నికల సంఘం ఉపయోగిస్తున్న ఫారం-6లో ఎలాంటి మార్పులను తాము ఆమోదించలేదని సుప్రీంకోర్టు చెప్పిన నేపథ్యంలో రాహుల్ గాంధీ ఎక్స్‌లో ఈవ్యాఖ్యలు చేశారు. సెప్టెంబర్ 26న ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రకటన స్క్రీన్‌షాట్‌ను కూడా షేర్ చేశారు. జ్ఞానేశ్ కుమార్ ఫారం-6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారన్నది ఇప్పుడు తరువాయి 8లో

## బోగస్ ఫారం-7 సమర్పిస్తే
# క్రిమినల్ చర్యలు తీసుకోండి

ఎన్నికల అధికారులు, ఇఆర్‌ఒలకు సిఇఒ సుదర్శన్ రెడ్డి ఆదేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్ 2026) ప్రక్రియలో ఓట్లను తొలగించేందుకు భారీ సంఖ్యలో బోగస్ ఫారం-6, 6ఏ, 7,8 సమర్పిస్తే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) సి.సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులకు (ఇఆర్‌ఒలు) ఆదేశాలు జారీ చేశారు. అనర్హులకు ఓటు ఉంటే అభ్యంతరాలు వ్యక్తం చేస్తు వారిని తొలిగించాలని ఫారం -7 దరఖాస్తులు వస్తున్నాయని, వాటిలో కొన్ని అవాస్తవమైనవని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సిఇఒ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిహెచ్‌ఎంసి కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లు వెంటనే ఇఆర్‌ఒలకు తగిన సూచనలు ఇవ్వాలని సూచించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం1950లోని సెక్షన్31 ప్రకారం తెలిసి తప్పుడు వివరాలు లేదా అసత్య ప్రకటనలతో దరఖాస్తులు సమర్పించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని సిఇఒ స్పష్టం చేశారు. అయితే, నేరుగా చర్యలకు దిగకుండా ఎన్నికల నమోదు నియమాలు 1960 లోని రూల్20 ప్రకారం ముందుగా విచారణ నిర్వహించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మెమో ప్రతులను రాష్ట్రంలోని అన్ని ఎన్నికల నమోదు అధికారులతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు కూడా పంపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పలు చోట్ల ఫారం-7 పత్రాలు పెద్ద ఎత్తున వెలుగులోకి వస్తుండటం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ముషీరాబాద్, బహదూర్ పుర, తరువాయి 12లో

# ఓటు తొలగింపు దేహం నుండి ఆత్మ తొలగింపులాంటిది

**హైదరాబాద్ :** ఓటు వేసేందుకు భారత పౌరునికి గల హక్కు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి కేంద్రకం. పౌరుల ఓటు హక్కును టోకుగా తొలగించే క్రమం ఏదైనా స్వాభావికంగా నిరంకుశత్వమవుతుంది-అన్నారు. సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఉజ్జల్ భుయాన్. ఇక్కడ నల్సార్ వి శ్వవిద్యాలయంలో ఆదివారం నాడు ఆయన 19వ నల్సార్-జస్టిస్ బి.ఆర్.సాహ్నీ స్మారక మూట్ కోర్టు పోటీ 2026 ముగింపు ప్రసంగం చేశారు. జస్టిస్ భుయాన్ నల్సార్ పూర్వ ఛాన్సలర్. ఏ క్రమం కూడా పదుల లక్షల మంది ఓ టింగ్ హక్కు తొలగించి వారిని ''రెండవ తరగ తి'' పౌరులుగా మార్చజాలదన్నారు. ''పదుల లక్షల మంది భారత పౌరుల ఓటు హక్కును రద్దుచేసి, వారిని తమ సొంత దేశంలోనే ఓటు హక్కులు లేకుండా రెండవ తరగతి పౌరులుగా దిగజార్చే ఏ క్రమమైన (ఇప్పుడు దేశంలో జరుగుతున్న సర్ ప్రక్రియను ప్రస్తావించలేదు) స్వభావంరీత్యా నిరంకుశమవుతుంది. ఎంత దొంకతిరుగుడు వాదన అయినా దాన్ని సమర్థించలేదని'' అన్నారు. ఓటు వేసే హక్కు భారత పౌరుని ప్రతిపత్తి నుంచి వేరు చేయ వీలులేదని జస్టిస్ భుయాన్ అన్నారు. ''భారత పౌరుని వ్యక్తిత్వం నుంచి, ఓటు వేసే హక్కు లేదా ఓటరు జాబితాలో చేర్చే హక్కు వేరుచేయవీలులేనిది. అది దేశం నుంచి ఆత్మను వేరు చేయడం లాంటిది'' అని అన్నారు. రాజ్యాంగం రెండు రకాల పౌరులను-ఓటు హక్కు కలిగి ఉన్నవారు, ఓటు హక్కు లేనివారు-ఊహించలేదు. టోకుగా ఓటు హక్కు రద్దు చేయడానికి దారి తీసే క్రమం ఏదైనా అది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14;326కు విరుద్ధమని జస్టిస్ భూయాన్ స్పష్టంగా చెప్పారు. ''ఆర్టికల్ 326ను ఏవిధంగానూ ఉల్లంఘించడానికి వీల్లేదు. ఏ అధికారిక సంస్థ ఆ పని చేయలేదు; ఏ కోర్టు ఆ నేరాన్ని క్షమించలేదు. ఏ ఒక్కరూ రాజ్యాంగానికి అతీతం కాదు'' అని అన్నారు. ఓటు హక్కు దానికదిగా ప్రాథమిక హక్కు కాదు, ఆర్టికల్ 326 నుంచి ఉద్భవించిన రాజ్యాంగ హక్కు అని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని జస్టిస్ భుయాన్ గుర్తు చేశారు. వయోజన ఓటుహక్కు ప్రాతిపదికగా (రాజ్యాంగం అనుమతించిన అనర్హతలకు లోబడి) లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలను ఆ ఆర్టికల్ ఆదేశిస్తున్నది. ఓటుహక్కును పౌరసత్వ మూల సారాంశంగా జస్టిస్ భుయాన్ పేర్కొన్నారు. సామాన్య పౌరుడు దేశ పరిపాలనలో పాల్గొనే ముఖ్య సాధనం అదేనన్నారు.''అందువల్ల, తన ఓటు వేయడానికి భారత పౌరునికి గల హక్కు రాజ్యాంగ మౌలిక స్వరూపం సిద్ధాంతానికే కేంద్రకం'' అని ఆయన అభిప్రాయం పడ్డారు.జస్టిస్ భుయాన్, ఓటుహక్కును భారత స్వాతంత్రం పోరాటంతో సంధానించారు. ఓటుహక్కును అనేక సంవత్సరాల పాటు పోరాటం, త్యాగాల అనంతరం సంపాదించుకున్న స్వేచ్ఛను వక్రీకరిస్తుందన్నారు. ఓటరు జాబితాలకు సంబంధించి, చనిపోయిన ఓటరు విషయంలో తప్ప, ఓటరు జాబితాలో ఒకసారి చేరిన పేరును- నోటీసు జారీ చేసి, ఓటరు వాదన వినే అవకాశం కల్పించకుండా తొలగించే వీలు లేదన్నారు. లోగడ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ప్రస్తావిస్తూ, ఓటరు జాబితాలో పేర్ల చేర్పు, తొలగింపుల్లో అనుసరించవలసిన పద్ధతులకుగల రక్షణలను జస్టిస్ భుయాన్ నొక్కి చెప్పారు. సార్వజనీన వయోజన ఓటు హక్కుకున్న సరిసమానత్వ స్వభావాన్ని వక్కాణించారు. భారతదేశంలో వయోజన ఓటు హక్కు పరిణామ క్రమాన్ని ఆయన వివరించారు.

జస్టిస్ ఉజ్జల్ భుయాన్





## సింగరేణి మైనింగ్‌తో 'రామప్ప'కు ముప్పు లేదు

సమగ్ర శాస్త్రీయ అధ్యయనం తర్వాతే మైనింగ్‌పై నిర్ణయం.. సింగరేణి యాజమాన్యం స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి సింగరేణి మైనింగ్‌తో ముప్పు పొంచి ఉందంటూ వస్తున్న వార్తలను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ ఖండించింది. రామప్పకు మైనింగ్ వల్ల ముప్పు ఏర్పడుతుందన్న ప్రచారం అపోహలు, అవాస్తవాలేనని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో యాజమాన్యం స్పష్టం చేసింది. ములుగు జిల్లా వెంకటాపూర్‌లో తరువాయి 12లో

03

## తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక భేటీ

హైదరాబాద్-శ్రీశైలం ఎన్‌హెచ్-765పై ఎలివేటెడ్ కారిడర్‌కు విజ్ఞప్తి

# గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇళ్లు



- 73 వేల మంది పేదలకు అందించేందుకు ప్రణాళిక రూపొందించాం
- సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- మంత్రులు పొంగులేటి, జూపల్లి

ప్రజాపక్షం/నిర్మల్

రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించి, తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ,సమాచార,గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నివసిస్తున్న అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల్లో నివసిస్తున్న సుమారు 72 వేల నుంచి 73 వేల మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రణాళిక రూపొందించామని తరువాయి 12లో

## బ్రెజిల్‌లో 25న తుది ఎన్నికలు

తొలి విడత ఎన్నికల ఫలితాల్లో ప్రతిష్టంభన

**బ్రసిలియా:** దక్షిణ అమెరికాలో అతిపెద్ద దేశం బ్రెజిల్ అధ్యక్ష-ఉపాధ్య పదవులకు ఆదివారం జరిగిన మొదటి రౌండ్ పోలింగ్ ఓట్ల లెక్కింపులో ఎవరికీ పూర్తి మెజారిటీ రాలేదు. దీంతో తుది విడత రన్ ఆఫ్ ఎన్నికలకు ఈనెల 25వ తేదీన పోలింగ్ నిర్వహిస్తామని ఎన్నికల సంఘం ప్రకటించింది.ప్రస్తుత దేశాధ్యక్షుడు,వామపక్ష వర్కర్స్‌పార్టీ నాయకుడు లూయిజ్ ఇనాసియో లులా డసిల్వా కుగానీ,ఆయన ప్రధాన ప్రత్యర్థి ఫ్లావియా బొల్సెనారో(45)కుగానీ 50 శాతం మెజార్టీ ఓట్లు లభించలేదు.లులా డసిల్వాకు మొదటి రౌండ్ ఎన్నికల్లో 45.2 శాతం ఓట్లు లభించగా ఫ్లావియా బోల్సెనారో 47 శాతం ఓట్లతో స్వల్ప ఆధిక్యంలో ఉన్నారు. తుది విడత రన్ ఆఫ్ ఎన్నికలో తాము విజయం సాధిస్తామని దేశాధ్యక్షుడు లులా తరువాయి 12లో

## నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు
# 35 మంది జూనియర్ లెక్చరర్‌ల తొలగింపు

- ఇంటర్మీడియట్ విద్యా మండలి ఉత్తర్వులు జారీ
- మరికొంత మందిపైనా అనుమానాలు?



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్ జూనియర్ లెక్చరర్‌ల నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం కలకలం రేపుతోంది. బోగస్ విద్యార్హత ధృవపత్రాలతో ఉద్యోగాలు పొందిన సుమారు 35 మంది జూనియర్ లెక్చరర్‌లను తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి తొలగించింది. ఈ మధ్యకాలంలోనే వారికి షోకాజు నోటీసులు జారీ చేశారు. బోగస్ విద్యార్హతల అంశంలో వారి నుంచి సరైన సమాధానాలు రాకపోవడం 'జూనియర్ లెక్చరర్‌ల' పోస్టు నుంచి తొలగిస్తూ ఇంటర్మీడియట్ విద్యా మండలి సంచాలకుల పేరుతో ఉత్తర్వులు వెలువడ్డాయి. ఒకరి పేరు మాత్రమే వెలుగులోనికి వచ్చినప్పటికీ మొత్తం 35 మందిని తొలగించినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. జూనియర్ లెక్చరర్‌ల నియామకాల స మయంలో సర్టిఫికెట్ల పరిశీలన అంశంపైన కూడా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న రెగ్యులర్ పోస్టుల భర్తీ కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిఒ నంబర్. 143 ద్వారా 2000 అక్టోబర్ 9న కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ తరువాయి 8లో

# ఓట్ల తొలగింపుకు ఎన్నో కుతంత్రాలు

అధికారంలో ఉన్నవారు ఓటర్ల అభిమానాన్ని చూరగొని కాకుండా తమకు ఓటు చేయరని అనుమానమున్న వేల ఓట్లను ఓటరు జాబితానుంచి తొలగించి ఎన్నికలలో విజయం, తద్వారా అధికారం సంపాదించే దుర్మార్గ మైన, దేశ ద్రోహ కళను అభివృద్ధి చేసినట్లున్నారు. బిజెపి వారు ఇందులో ఆరి తేరినట్లు ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధి సంవత్సరం పైబడి నెత్తీనోరు బాదుకుంటున్నాడు. అంతకన్నా పెద్ద నోర్లుగల బిజెపి నాయకులు, అధికార ప్రతినిధులు ప్రత్యారోపణలు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి కూడా రాజకీయ నాయకునిలా రాహుల్ వాదనలను త్రోసిపుచ్చటం మినహా ఏ ఒక్క నిర్దిష్ట ఆరోపణపైనా విచారణకు ఆదేశించకపోవడం గమనార్హం. క్రితం ఎన్నికల్లో 5వేల లోపు ఓట్ల తేడాతో ఓడిపోయిన సీట్లను గుర్తించి, కొన్ని వేల ఓట్ల తొలగింపునకై ఫారం–7 గుండుగుత్తగా సమర్పించటం, మరికొన్ని వేల ఓటర్లను పక్క జిల్లాలు, రాష్ట్రాలనుంచి చేర్చుతూ ఫారం–6 సమర్పించటం, ఎన్నికల అధికారులు విచారణ లేకుండా ఆ మార్పులను జాబితాల కెక్కించటం – తద్వారా మైనారిటీని మెజారిటీగా మార్చుకుని సీటు గెలుచుకోవటం బిజెపి వారు అనుసరించిన తంత్రం. సోషల్ మీడియా నిర్వహణకే కాదు, ఎన్నికలో 'ఓటు చోరీ'కి కూడా ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించారని అర్థమవుతున్నది. మహారాష్ట్ర ఇందుకు తిరుగులేని ఉదాహరణ. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆరునెలలకు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 16లక్షలకు పైగా ఓటర్లు పెరిగారు. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకున్న ప్రతిపక్షం అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడింది – అధికారం బిజెపి కూటమి చేతికి అందింది. ఇటీవల ఎన్నికల కమిషన్ నిర్వహించిన 'సర్'లో అన్ని రాష్ట్రాల కన్న మిన్నగా 2కోట్లకు పైగా ఓట్లు తగ్గిపోయాయి.

తాజాగా 30రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ముగిసిన, ముగింపు దశలో ఉన్న ఓటర్ల జాబితాల ప్రక్షాళన (సర్)లో 13 కోట్లకు పైగా ఓటర్ల తొలగింపు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలపై ఆరోపణలు, సుప్రీంకోర్టులో కేసులు, రెండోవైపున ఆయన రాజీనామా చేయాలని లేదా బర్తరఫ్ కోరుతూ ఇండియా కూటమిలోని ప్రతిపక్షాలు, వెలుపల ఉన్న ప్రతిపక్షాలు, విద్యార్థి సంఘాలు, స్వతంత్ర ప్రజా, పౌర సంఘాలు, సిజెపి సాగిస్తున్న ఆందోళన నేపథ్యంలో బిజెపి ఎన్నికల కమిషన్‌ను వెనకేసుకు రావటం సిఇసితో దాని బంధాన్ని బహిర్గతం చేస్తున్నది. సర్ ముగిసిన రాష్ట్రాల్లో ప్రతిపక్షాల అభ్యంతరాలు, ఆక్షేపణలు ఏలాగూ ఉండగా, ఆ ప్రక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లో 'అభ్యంతరాలు – ఫిర్యాదుల' సమయాన్ని ఉపయోగించుకుని బిజెపి వారు పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపునకు ఫారం–7 పత్రాలు గుండుగుత్తగా సమర్పించిన, సిద్ధం చేసిన ఉదంతాలు కర్నాటక, హైదరాబాద్‌లలో వెలుగులోకి వచ్చాయి.

కర్నాటకలోని బళ్లారి సిటీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఏకంగా 7,561ఓట్ల తొలగింపునకు బిజెపికి చెందిన బిఎల్‌ఎ–1 టి.శ్రీనివాస మోత్కూర్ తీవ్ర ప్రయత్నం చేసినట్లు బయటపడింది. ఆ ఓటర్లు మునుపటిదా ఓటర్ల జాబితాలో ఉన్నారు. కాగా వారు "వారి చిరునామాల్లో లేరు, వేరే చోటకు నివాసం మార్చారు" అని ఆరోపణ చేస్తూ, వారు పేర్లు తొలగించాలని ఫారం–7 దరఖాస్తులు దాఖలు చేయగా ఎన్నికల అధికారి త్రోసిపుచ్చారు. మళ్లీ అభ్యంతరాలు దాఖలు చేస్తూ 'రివిజన్' కోరాడు. కాంగ్రెస్ బిఎల్‌ఎ ఫిర్యాదుపై అక్టోబర్ 1న బ్రూస్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదైంది. అంతకుముందు నమోదైన ఐదు ఎఫ్‌ఐఆర్‌లలో బెళగావిలో 2, మైసూర్‌లో ఒకటిలో బిజెపి సభ్యులు నిందితులు. ఇదిలావుండగా, విజయపురలో కొందరు అభ్యంతరపరులు తప్పుడు మరణ సర్టిఫికేట్‌లు సంపాదించి ఓటర్ల తొలగింపును కోరారు. వాటిపై సంబంధిత అధికారి సంతకం లేదు. ఆ విషయం తెలిసి కనీసం 8మంది తాము బతికే ఉన్నామని, తప్పుడు మరణ సర్టిఫికేట్‌లు సృష్టించిన వారిని శిక్షించాలని జిల్లా ఎన్నికల అధికారిని శనివారంనాడు స్వయంగా హాజరై కోరారు. ఇది బహిష్కరించబడిన బిజెపి ఎంఎల్‌ఎ బసన్‌గౌడ పాటిల్ యత్‌నాల్ అనుయాయుల పనిగా కాంగ్రెస్ వారు కనుగొన్నారు. వారు తొలగింపు కోరిన వారంతా ముస్లిం ఓటర్లు. బిజాపూర్ సిటీ నియోజకవర్గంలో సుమారు 1046 మంది మైనారిటీల ఓట్లను తప్పుడు మరణ ధృవీకరణ పత్రాలతో తొలగించేందుకు ప్రయత్నించారని కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్ హమీద్ ముష్రిఫ్ చెప్పారు.

మైనారిటీల ఓట్ల తొలగింపు ప్రయత్నాల కలకలం మన హైదరాబాద్‌నూ తాకింది. బహదుర్‌పుర, ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ ప్రయత్నం జరిగినట్లు బయటపడిన ప్రీ–ప్రింటెడ్ ఫారం–7 పత్రాలు తెలియజేస్తున్నాయి. దీంతో మైనారిటీల ఓట్లను పెద్ద ఎత్తున తొలగించే ప్రయత్నం జరుగుతున్నట్లు ఆందోళన వ్యక్తమైంది. ఈ ఘటన తొలుత అక్టోబర్ 1న ముషీరాబాద్ నియోజకవర్గంలో బహిర్గతమైంది. మొత్తం 31 ఓటర్ల పేర్లు తొలగింపును కోరుతూ బిజెపికి చెందిన బూత్‌స్థాయి ఏజంట్ ప్రి–ప్రింటెడ్ దరఖాస్తులు దాఖలు చేశాడు. వారిలో కాంగ్రెస్ పార్టీ బిఎల్‌ఎ, ఆయన కుటుంబ సభ్యులు ఉండటం ఆసక్తిదాయకం. దీంతో టిపిసిసి ఎలక్షన్ సెల్ అన్ని నియోజకవర్గాల్లో దర్యాప్తు మొదలుపెట్టింది. ఈ ప్రయత్నంపై ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ అగ్గిమీద గుగ్గిలమైనారు. మైనారిటీల ఓట్లు తొలగించటం జరిగితే జంతర్‌మంతర్‌ను మించిన ఆందోళన హైదరాబాద్ లో జరుగుతుందని హెచ్చరించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు 'సర్'ను సమర్థిస్తూ తప్పులు జరిగితే కోర్టుకు వెళ్లమని ఒవైసీకి సలహా ఇచ్చారు.

ఇటువంటివి చెదురుమదురు ఘటనలుగా, ఆకతాయి చేష్టలుగా భావించకూడదు. సర్ ప్రక్రియ ముగిసి తుది ఓటర్ల జాబితాల ప్రచురణ తదుపరి అన్ని రాష్ట్రాల్లో అన్ని నియోజకవర్గాల్లో ఓటర్లు తమ పేర్లను తనిఖీ చేసుకుని, తప్పులు జరిగినచోట దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే తరువాత చింతించి లాభం ఉండదు. మీ ఓటును మీరు కాపాడుకోవలసిందే! ●



## ఇండియా కూటమి ఐక్యంగా వీధుల్లోకి వస్తుంది

**బిహార్‌లోనే ఇండియా కూటమి ఏర్పడింది. ఇక్కడే 'సర్' ప్రక్రియ ప్రారంభమైంది. బిహార్ ప్రజాస్వామ్యానికి తల్లి లాంటిది. కానీ వారు ఇక్కడి నుంచే ప్రజాస్వామ్యాన్ని అంతం చేసే ప్రక్రియను ప్రారంభించారు. బిహార్ పౌరులుగా, మేము ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని విశ్వసించే ప్రజలం. ఏ పరిస్థితుల్లోనూ ప్రజాస్వామ్యాన్ని అంతం కానివ్వం. అందుకే, ఇండియా కూటమి ఐక్యంగా వీధుల్లోకి వస్తుంది. జ్ఞానేశ్ కుమార్, నరేంద్ర మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా ఇండియా కూటమి సభ్యులు అక్టోబర్ 7న 'ఆక్రోశ్ మార్చ్' నిర్వహిస్తారు.**

– బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్



# సింగీతం: ప్రయోగమే ఊపిరిగా సాగిన సినీ ప్రయాణం

సింగీతం శ్రీనివాసరావు (21 సెప్టెంబర్ 1931 – 3 అక్టోబర్ 2026) భారతీయ సినీ ప్రపంచంలో అరుదైన సృజనశీలి. ఆయనకు సినిమా ఒక ఫార్ములా కాదు— ఒక ఆటస్థలం, ఒక ప్రయోగశాల, అంతులేని అవకాశాలున్న ఒక భాష.

ఐదు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రయాణంలో తెలుగు, కన్నడ, తమిళ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో దాదాపు 60 చిత్రాలకు దర్శకత్వం వహించారు. సామాజిక కథల నుంచి హాస్యం వరకు, జానపదం నుంచి ఫాంటసీ వరకు, సైన్స్ ఫిక్షన్ నుంచి యానిమేషన్ వరకు— ఏ ప్రక్రియనైనా తనదైన ముద్రతో ఆవిష్కరించారు. దర్శకుడిగానే కాదు, కథారచయితగా, స్క్రీన్‌ప్లే రచయితగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగా, గేయ రచయితగా, నటుడిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. ఆయన ప్రత్యేకత ఒక్క మాటలో చెప్పాలంటే— ఒకసారి చేసినదాన్ని మళ్లీ చేయని దర్శకుడు.

1931లో గూడూరులో జన్మించిన సింగీతం చిన్ననాటి నుంచే విద్య, సంగీతం, నాటకాలకు దగ్గరయ్యారు. తండ్రి రామచంద్రరావు ప్రధానోపాధ్యాయుడు కాగా, తల్లి శకుంతలా బాయి వయోలిన్ విద్వాంసురాలు. చెన్నై ప్రెసిడెన్సీ కళాశాలలో భౌతిక శాస్త్రంలో పట్టా పొందిన ఆయన, ఆ తర్వాత నాటకం, సాహిత్యం, రచనల వైపు అడుగులు వేశారు. ఆయన సినీ విద్యకు అసలైన పాఠశాల కె.వి.రెడ్డి వద్దే.

తన అభిమాన దర్శకుడిని కలవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసిన తర్వాత 1954లో సింగీతానికి ఆ అవకాశం వచ్చింది. కె.వి.రెడ్డి ఆయనకు ది మంకీ పా కథను ఇచ్చి, దాని ఆధారంగా స్క్రీన్‌ప్లే రాయమన్నారు. మూడు నెలల్లో సింగీతం స్క్రిప్ట్ సిద్ధం చేశారు. ఆయన ప్రతిభను గుర్తించిన కె.వి.రెడ్డి శిష్యుడిగా చేర్చుకున్నారు.

దొంగ రాముడు (1955) నుంచి ఉమాచండి గౌరీశంకరుల కథ (1968) వరకు కె.వి.రెడ్డితో కలిసి పనిచేశారు. మాయాబజార్, జగదేకవీరుని కథ, శ్రీకృష్ణార్జున యుద్ధం వంటి క్లాసిక్ చిత్రాల నిర్మాణ ప్రక్రియను దగ్గరగా చూశారు. ఆ అనుభవమే తరువాత ఆయనలోని ప్రయోగాత్మక దర్శకుడికి బలమైన పునాది అయింది.

1972లో నీతి నిజాయితీతో దర్శకుడిగా తొలి అడుగు వేశారు. ఆ తర్వాత దిక్కట్ర పార్వతి, తరం మారింది వంటి సామాజిక చిత్రాలతో తన ప్రత్యేకతను చాటుకున్నారు. దిక్కట్ర పార్వతి జాతీయ ఉత్తమ తమిళ చిత్రంగా జాతీయ అవార్డును అందుకుంది.

అయితే సింగీతాన్ని ఒకే రకమైన సినిమాకు పరిమితం చేయడం సాధ్యం కాదు.

మయూరిలో నర్తకి సుధా చంద్రన్ జీవితాన్ని హృద్యంగా తెరపై ఆవిష్కరించారు. ఆ చిత్రం ఏకంగా 14 నంది అవార్డులను గెలుచుకుంది.

తర్వాత వచ్చింది పుష్పక విమానం. దాదాపు సంభాషణలే లేని ఈ చిత్రం, మాటలకతీతంగా సినిమా ఎంత శక్తివంతమైన భాషో నిరూపించింది. కమల్ హాసన్ నటించిన ఈ చిత్రం జాతీయ ఉత్తమ ప్రజాదరణ పొందిన వినోదాత్మక చిత్రంగా అవార్డు అందుకుంది. భారతీయ సినిమా ప్రయోగాత్మక చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

ఆ తర్వాత ఆదిత్య 369 (1991) కాల ప్రయాణాన్ని కథగా మలిచిన తెలుగు సైన్స్ ఫిక్షన్ మైలురాయి. దాని వెంట భైరవ ద్వీపం (1994)— జానపదం, ఫాంటసీ, సాహసాన్ని అద్భుతంగా మేళవించిన చిత్రం. తెలుగు సినిమాకు సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ ప్రక్రియల్లో ఈ రెండు చిత్రాలు చిరస్మరణీయ ముద్ర వేశాయి.

సింగీతం ఊహాశక్తికి ఆయన హాస్యబుద్ధి కూడా తోడైంది.

కమల్ హాసన్‌తో ఆయన కలయిక భారతీయ సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం. సొమ్మొకడిది సోకొకడిది, రాజా పార్వై, పుష్పక విమానం, అపూర్వ సహోదరులు, మైఖేల్ మదన కామరాజన్ వంటి చిత్రాలు నటుడుదర్శకుడి సృజనాత్మక అనుబంధానికి అద్భుత ఉదాహరణలు. వినోదంతో పాటు ప్రయోగాన్ని కూడా సమర్థవంతంగా మేళవించారు.

మరోవైపు డా.రాజ్‌కుమార్‌తో ఆయన అనుబంధం కన్నడ చిత్రసీమలో ఒక స్వర్ణాధ్యాయం. రాజ్‌కుమార్‌తో కలిసి హాలుజేను, చలిసువ మోడగళు, ఎరడు నక్షత్రగళు, భాగ్యద లక్ష్మి బారమ్మ, దేవతా మనుష్య తదితర ఏడు చిత్రాలకు దర్శకత్వం వహించారు. దేవతా మనుష్య రాజ్‌కుమార్ 200వ చిత్రం కావడం విశేషం.

దర్శకత్వంతో పాటు సింగీతం సంగీతంలోనూ, రచనలోనూ తన ప్రతిభను చాటారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్. రాజేశ్వరరావు శిష్యుడైన ఆయన కొన్ని కన్నడ చిత్రాలకు సంగీతం అందించారు. పాటలు రాశారు. నాటకాలు రచించారు. పత్రికలను సంపాదించారు. యానిమేషన్ రంగంలోకి వెళ్లి సన్ ఆఫ్ అల్లాదీన్, ఘటోత్కచ వంటి చిత్రాలను రూపొందించారు. దశాబ్దాలు గడిచినా ఆయనలోని ప్రయోగశీలి మాత్రం ఎప్పుడూ విశ్రాంతి తీసుకోలేదు. రెండు జాతీయ అవార్డులు, ఐదు నంది అవార్డులు, మూడు కర్ణాటక రాష్ట్ర చలనచిత్ర అవార్డులు, మూడు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు దక్కాయి. 2011లో ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జీవిత సాఫల్య పురస్కారం, అనంతరం బి.ఎన్.రెడ్డి జాతీయ జీవిత సాఫల్య పురస్కారం కూడా అందుకున్నారు. 2026లో, తొంభై దాటిన వయసులోనూ సింగీతం మళ్లీ దర్శకత్వం వహించారు. సింగ్ గీతం అనే మ్యూజికల్ ఫాంటసీతో మరోసారి తన ప్రయోగాత్మక మనస్తత్వాన్ని చాటుకున్నారు. అదే ఆయన చివరి చిత్రం అయింది. 3 అక్టోబర్ 2026న చెన్నైలో 95 ఏళ్ల వయసులో ఆయన కన్నుమూశారు. సింగీతం శ్రీనివాసరావు మనకు వదిలింది కేవలం ఒక గొప్ప ఫిల్మోగ్రఫీ కాదు. ఒక సినీ తత్వం. ఆసక్తిని కోల్పోవద్దు. ప్రేక్షకుడిని తక్కువ అంచనా వేయవద్దు. ఒకసారి విజయవంతమైన దాన్నే మళ్లీ మళ్లీ చేయవద్దు. ఆయన సినిమాలు ముగిశాయి. కానీ ఆయన చూపించిన కొత్త ప్రపంచాలు ఇంకా మన ముందే ఉన్నాయి. సింగీతం గారికి ఘన నివాళి. సినిమాను కొత్తగా కలలు కనడం నేర్పిన మహా సృజనశీలికి శతకోటి వందనాలు.

**డా.ముచ్చుకోట సురేష్ బాబు**

## తగ్గిపోతున్న పొదుపు

# కుటుంబాలలో సంక్షోభానికి సంకేతాలు

**సంజయ్ రాయ్**

దాదాపు 81.3 కోట్ల మంది భారతీయులు ఆహార సహాయం పొందుతున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందించే వస్తు లేదా నగదు రూపంలోని వివిధ బదిలీ పథకాల ద్వారా చాలామంది లబ్ధి పొందుతున్నారు. అయినప్పటికీ ప్రధానంగా ఇంటి ఖర్చుల కోసం తీసుకునే కుటుంబ (హౌజ్ హోల్డ్) అప్పులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. భారతదేశంలో దశాబ్ద కాలంగా వాస్తవ వేతనాలు దాదాపు స్తంభించిపోవడం, స్వయం ఉపాధి పొందుతున్న వారి సగటు వాస్తవ ఆదాయాలు తక్కువగా ఉండటంతో కుటుంబ అవసరాల ఖర్చులపై ఒత్తిడి పెరుగుతోంది. గత దశాబ్దాలతో పోలిస్తే నిరుద్యోగ రేటు అధికంగానే కొనసాగుతోంది. నిత్యావసర ఖర్చుల కోసం కుటుంబాలు బ్యాంకులు, బ్యాంకింగ్ యేతర ఆర్థిక సంస్థలు అందించే రుణాలను ఎక్కువగా ఆశ్రయిస్తున్నాయి.

నయా ఉదారవాద పాలనలో, అసమానతలు మునుపెన్నడూ లేని స్థాయికి చేరుకోవడంతో మొత్తం డిమాండ్‌లో పరిమితులు ఏర్పడతాయి. ఆర్థిక వ్యవస్థలో ఆర్థికీకరణ (ద్రవ్యీకరణ) పెరగడంతో, రుణ ఆధారిత వినియోగం ద్వారా డిమాండ్‌లోని ఈ పరిమితిని తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారు. పారిశ్రామిక లేదా వ్యవసా య కార్యకలాపాల వంటి ఉత్పాదక రంగాల వైపు ప్రవహించే రుణాలతో పోలిస్తే, వినియోగదారుల రుణాల నిష్పత్తి పెరగడంతో బ్యాంకు రుణాల తీరు కూడా మార్పునకు లోనవుతోంది. పెరుగుతున్న అనిశ్చితి, సగటు కుటుంబాల దుర్బలత్వం కారణంగా స్థూల పొదుపు పెరిగినప్పటికీ, రుణాలతో కూడిన వినియోగం పై ఆధారపడటం కూడా పెరుగుతోందనేది గమనార్హం. ముఖ్యంగా ఆరోగ్యం, విద్య వంటి నిత్యావసర సేవల ప్రైవేటీకరణ పెరగడం, ఆహారం, ఇంధన ధరల పెరుగుదలతో పాటు గృహ వినియోగ వ్యయం పెరిగింది. వివిధ ఏజెన్సీల ద్వారా వినియోగదారుల రుణాల లభ్యత, ప్రారంభ దశలో అధిక వినియోగ స్వభావం కలిగిన ప్రజలకు రుణ లభ్యతను పెంచి, డిమాండ్‌ను పెంచడం లో సహాయపడుతుంది. కానీ, తిరిగి చెల్లించాల్సిన బాధ్యతలు పెరిగే కొద్దీ, ఇది సాధారణంగా తక్కువ వినియోగ ప్రవృత్తిని కలిగి ఉండే రుణదాతల వైపు కొనుగోలు శక్తి తిరోగమన ప్రవాహానికి దారితీస్తుంది. ఫలితంగా, చౌక రుణాల ద్వారా డిమాండ్‌ను పెంచడం, చివరికి కొనుగో లు శక్తి సంకోచానికి దారితీస్తుంది, తద్వారా రుణ భారం పెరగవచ్చు.

స్థూల గృహ పొదుపుల వృద్ధికి, స్థూల బాధ్యతల వృద్ధికి మధ్య వ్యత్యాసం తగ్గుతోందని, ఇది ఆర్థిక వ్యవస్థలో నికర గృహ పొదుపుల వృద్ధిలో క్షీణతకు కారణమవుతోందని ఆర్‌బిఐ తాజా ఆర్థిక స్థిరత్వ నివేదిక సూచిస్తుంది. జిడిపిలో కుటుంబ (హౌజ్‌హోల్డ్) రుణాల శాతం క్రమంగా పెరుగుతూ, 2025 సెప్టెంబర్ చివరి నాటికి 45.5 శాతానికి చేరుకుంది. ఇది గత 5 ఏళ్ల సగటు అయిన 42.9 శాతం కంటే చాలా ఎక్కువ. ముఖ్యంగా, 2022 జూన్ నుండి 2026 మార్చి మధ్య గృహ రంగ ఆస్తులు జిడిపిలో 7.4 శాతం పాయింట్ల మేర పెరగగా, అదే కాలంలో వారి అప్పులు 9.4 శాతం పాయింట్ల వేగంతో పెరిగాయి. దీనిని బట్టి, కుటుంబాల ఆస్తులు, అప్పుల మధ్య ఉన్న వ్యత్యాసం ఇటీవలి కాలంలో తగ్గుతోందని అర్థమవుతోంది.

అలాగే, కుటుంబ రుణాల వినియోగంలో కూడా మార్పు కనిపిస్తోంది. ఇందులో 58.4 శాతం రుణాలు ఆస్తుల సృష్టి లేదా ఉత్పాదక అవసరాల కోసం కాకుం డా, వినియోగ అవసరాల కోసం తీసుకున్న 'గృహేతర రిటైల్ రుణాలు'గా ఉన్నాయి. గృహ రుణాలు, వ్యవసా య లేదా వ్యాపార రుణాలతో పోలిస్తే గృహేతర రిటైల్ రుణాలు చాలా వేగంగా పెరిగాయి. వినియోగదారుల రుణాలలో గృహ రుణాలు, వాహన రుణాల వాటా తగ్గుముఖం పట్టగా, ఇదే కాలంలో బంగారు రుణాలు భారీ గా పెరిగాయి. 2024 మార్చి నుండి బంగారు రుణాలు 23 శాతం వార్షిక వృద్ధి రేటుతో (సిఎజిఆర్) వేగంగా పెరుగుతున్నాయి. తద్వారా గృహేతర రిటైల్ విభాగం లో అత్యధిక వృద్ధిని నమోదు చేస్తున్నాయి. బంగారు రుణాల ఈ పెరుగుదలకు ప్రధాన కారణం ఇప్పటికే రుణాలు కలిగి ఉన్నవారే. వీరు బంగారం ధరలు పెరగడాన్ని ఉపయోగించుకుని, తమ పాత అప్పులను తీర్చడానికి లేదా కొనసాగించడానికి అదనపు రుణాలు తీసుకుంటున్నారు. అంటే, ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న వర్గం నుండే ఈ బంగారు రుణాల ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బిఎఫ్‌సి) రుణాలలో ఈ ధోరణి మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

కుటుంబ రుణాల విభాగంలో, ఇటీవలి కాలంలో అధిక విలువ కలిగిన కుటుంబ రుణాల వాటా పెరగడం గమనార్హం. 2014 మార్చిలో రూ. 25లక్షల లోపు ఉన్న గృహ రుణాల వాటా 60.6 శాతంగా ఉండేది. ప్రస్తుతం, రూ. 50లక్షల కంటే ఎక్కువ విలువైన రుణాలు మొత్తం బకాయి రుణాలలో 44.7 శాతంగా ఉన్నాయి. తక్కువ ధరలో లభించే గృహాల కోసం తీసుకునే రుణాల స్థానంలో, అధిక విలువ కలిగిన ఆస్తుల కొనుగోలు కోసం రుణాలు తీసుకోవడం ప్రధాన ధోరణిగా మారుతోందని ఇది సూచిస్తోంది. కుటుంబ అప్పుల విషయంలోనూ మార్పు కనిపిస్తోంది. ఇవి క్రమంగా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల(ఎన్‌బిఎఫ్‌సి) వైపు మళ్లుతున్నాయి. కుటుంబ ఆర్థిక అప్పులలో నాలుగింట మూడు వంతులు బ్యాంక్ రుణాలే అయినప్పటికీ, మొత్తం అప్పులలో ఎన్‌బిఎఫ్‌సిల వాటా పెరుగుతోంది.

మొత్తం బకాయి రుణాలలో కుటుంబ రుణాల వాటా మార్చి 2019 నాటి 34 శాతం నుండి మార్చి 2026 నాటికి 26.3 శాతానికి తగ్గిందని, అదే కాలంలో వ్యవసాయ రుణాల వాటా 18 శాతం నుండి 15.3 శాతానికి తగ్గిందని ఈ నివేదిక పేర్కొంది. మార్చి 2026 నాటికి, కుటుంబ రుణాలలో దాదాపు సగం (49.7 శాతం) వినియోగ అవసరాలకు, 33.5 శాతం ఆస్తుల సృష్టికి, 16.8 శాతం ఉత్పాదక కార్యకలాపాలకు వినియోగించబడ్డాయి. దీనినిబట్టి చూస్తే, భారతీయ కుటుంబాలు అధికంగా ఆస్తుల సృష్టి లేదా ఉత్పాదక కార్యకలాపాల కోసం కాకుండా, కేవలం వినియోగ అవసరాల కోసమే రుణాలు తీసుకుంటున్నాయని స్పష్టమవుతోంది. 1970ల ప్రారంభంలో దేశీయ పొదుపులో కుటుంబ పొదుపు వాటా సుమారు 20 శాతంగా ఉండేది. ఇది 1990ల మధ్యకాలానికి దాదాపు 50 శాతానికి పెరిగి, ఆ తర్వాత తగ్గింది. ఆ తర్వాత కొంత కోలుకున్నప్పటికీ, 2024–25 నాటికి మళ్లీ 20 శాతానికి పడిపోయింది. అంటే ఐదు దశాబ్దాల క్రితం ఉన్న స్థాయికి చేరింది. నికర కుటుంబ పొదుపు తగ్గడం వల్ల సహజంగానే పెట్టుబడులకు అందుబాటులో ఉండే వనరులు తగ్గుతాయి. కార్పొరేట్ రంగంలో ఉత్పాదక సామర్థ్యాల కోసం చేసే పెట్టుబడుల వృద్ధి దీర్ఘకాలికంగా క్షీణింపు ధోరణిని ప్రదర్శిస్తోంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే, ఉపాధి కల్పన, సమర్థవంతమైన డిమాండ్ దెబ్బతింటాయి. తద్వారా అత్యవసర వినియోగ అవసరాలకు ఆదాయం తగ్గి, కుటుంబ అవసరాల కోసం మరింతగా అప్పులపై ఆధారపడాల్సి వస్తుంది.



నికర కుటుంబ పొదుపు తగ్గడం వల్ల సహజంగానే పెట్టుబడులకు అందుబాటులో ఉండే వనరులు తగ్గుతాయి. కార్పొరేట్ రంగంలో ఉత్పాదక సామర్థ్యాల కోసం చేసే పెట్టుబడుల వృద్ధి దీర్ఘకాలికంగా క్షీణింపు ధోరణిని ప్రదర్శిస్తోంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే, ఉపాధి కల్పన, సమర్థవంతమైన డిమాండ్ దెబ్బతింటాయి.

# కుల, సామాజిక అసమానతలకు అంతం లేదా?

దేవుడి పట్ల మనకున్న నమ్మకాన్ని ఆరాధనను అడ్డం పెట్టుకొని, సమాజంలో అమానుషమైన అసమాన పరిస్థితులు కల్పించింది బ్రాహ్మణిజం! చాతుర్వర్ణ వ్యవస్థను, మతాన్ని, తద్వారా కులాన్ని సృష్టించారు! నిజం గా దేవుడే ఈ కుల వ్యవస్థను పెడితే.. అందరికీ సమాన హక్కులు, సమాన సంప ద, సమాన గౌరవం ఉండేది కదా! దేవుని దృష్టిలో అందరం సమానమే కదా! మరి అట్లా లేదు అంటే, ఈ పరిస్థితికి దేవుడు కారణం కాదు! ఎందుకంటే మనిషే దేవుడ్ని, తన అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్నాడు కాబట్టి! ఒక వైపు దేవుడి పేరు చెప్పుతూ, మరోవైపు దేవుడి పేరుతో ఆధ్యాత్మిక వ్యాపారాలు చేస్తున్నారు! చివరికి దేవుడి పేరును చెప్పుకొని రాజ్యాధికారాన్ని కూడా చేపడుతున్నారు! అందుకే దేవుడు ఈ కుల వ్యవస్థను నిర్మించలేదు!

దేవుడి తలలో నుండి బ్రాహ్మణులుపుట్టారు. భుజాల్లో నుండి క్షత్రియులు పుట్టారు. తొడల్లో నుండి వైశ్యులు పుట్టారు. పాదాల్లో నుండి శూద్రులు పుట్టారు. ఈ శూద్రులు పై వర్గాల వాళ్లకి సేవలు చేయడానికే పుట్టారు అనీ.. బ్రహ్మ దేవుడి మనవడైన మనువు పేరుతో మనుస్మృతిని రాసి, దాన్ని ఆనాటి పాలనా రంగంలో రాజ్యాంగంగా అమలు చేశారు! ఆ ప్రభావం నేటికీ కొనసాగుతూనే ఉంది! అయితే ఈ మనుస్మృతిని సృష్టించిన ఆనాటి మనుధర్మ బ్రాహ్మణులు ఈ కుల వ్యవస్థ పుట్టుటకు కారణం తప్పా, దేవుడు కాదు! అంటే ఈ మనుస్మృతిని బలపరిచే ఆలోచన విధానమైన బ్రాహ్మణిజమే ఈ కులం పుట్టుకకు కారణమయ్యింది!

**మరి ఇంతకూ బ్రాహ్మణిజం అంటే ఏమిటి?**

'బ్రాహ్మణిజమంటే, బ్రాహ్మణ సామాజిక వర్గంలో ఉన్న బ్రాహ్మణులు అందరూ అని కాదు' దానర్థం. మనుషులందరూ సమానం కాదు అనీ, సామాజిక అసమానతల ను పెంచి పోషించే మనుస్మృతి భావజాలాన్ని గౌరవించి ఆచరించి ముందుకు తీసుకెళ్లే పని బ్రాహ్మణుల్లోనే ఎక్కువ శాతం చేస్తుంటారు. వీరు తాము నమ్ముకున్న కులవృత్తుల ద్వారా మనువాద భావజాలానికి జీవం పోస్తుంటారు. ఆర్‌ఎస్‌ఎస్ దాని అనుబంధ సంఘాలు పార్టీలు, దాన్ని పరిపుష్టం చేస్తూ ఉంటారు. అందుకే మనువాద భావజాల ఆలోచన ఉన్న విధానమే బ్రాహ్మణిజం లేదా 'మనువాద బ్రాహ్మణిజం' అవుతుంది. ఈ విధంగా దేవుడి పేరు చెప్పుకొని, సమాజంలో సామాజిక అసమానతలను అస్పృశ్యతను సృష్టించారు. ఇప్పటికీ ఆ అసమానతలను పెంచి పోషిస్తూనే ఉన్నారు. సమాజంలో నెలకొన్న ఈ పరిస్థితులను వాస్తవాలను, ఈ సామాజిక సత్యాలను దగాపడ్డ యువత ప్రజలు తెలుసుకుంటేనే, మీ కర్తవ్యం ఏమిటో మీకు బోధ పడుతుంది. అందుకే మీరు కళ్ళు తెరవడానికి అడ్డంకిగా ఉన్న, ఈ మత ఊబిలో నుండి బయట పడాలి!

ఈ సమస్యల పట్ల, మన విముక్తి కోసం పోరాడిన మహనీయులు ఏం చెప్పారో కూడా, ఒక్కసారి చూడండి.. 'దీర్ఘకాలికంగా శ్రమజీవుల శ్రమలను దోపిడీ చేయ డం కోసం, ప్రకృతి వనరులను దోచుకోవడం కోసం.. దేవుడి పేరుతో మతాలు, మతం పేరుతో కులాలు పుట్టించారనీ.. ఈ కుల అసమానతలపై పోరాడుతూనే.. కులం పుట్టుకకు కారణమైన సంపదను సమాజ పరం చేయాలని, శ్రమ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని' మార్క్సిజం చెప్తుంది! ఇక మతం గురించి, కార్ల్ మార్క్స్ ఏం చెప్పాడంటే.. మతం అనేది, అణచివేయబడే జీవికి ఒక నిట్టూర్పు వంటిది అని అన్నాడు. ఇక్కడ నిట్టూర్పు అంటే, దుఃఖంలో ఉన్న మనిషికి ఒక తాత్కాలికమైన మానసిక ఉపశమనం వంటిది' అని అర్థం. ఈ భ్రమాత్మక ఆనందం వున్న మతం, రద్దు చేయబడాలంటే, నిజమైన ఆనందం సాధించబడాలి! అందుకే మతం ఒక మత్తుమందు వంటిది అని కార్ల్ మార్క్స్ చెప్పాడు! ఇక తన జీవిత కాలమంతా కుల నిర్మూలన కోసం సామాజిక అసమానతలపై పోరాడిన అంబేద్కర్, దేవుడి గురించి మాట్లాడే సందర్భం వచ్చినప్పుడు ఏం చెప్పాడో ఒకసారి చూడండి. ఈ సందర్భం ఎప్పుడొచ్చిందంటే, బౌద్ధాన్ని మీరు ఎందుకు స్వీకరించారు అని అడిగినప్పు డు ఇలా చెప్పాడు.

'క్రిష్ణుడు నేనే దేవుడ్ని అన్నాడు! క్రీస్తు నేను దేవుడి పుత్రుడ్ని అన్నాడు! మహమ్మద్ నేను దేవుని ప్రవక్తను అన్నాడు! బుద్ధుడు అలాకాకుండా, అసలు దేవుడే లేడన్నాడు. ఆత్మ లేదన్నాడు! ప్రతీ వ్యక్తీ స్వయం కృషి ద్వారా మాత్రమే, అత్యున్నత స్థితిని పొందవచ్చు అన్నాడు. అందుకే, ప్రేమ, కరుణ, జ్ఞానం, సమానత్వం ఉన్న బౌద్ధంలో నేను చేరాను అని చెప్పాడు. ఇక మరో సందర్భంలో హిందూ మతం పేరుతో జరుగుతున్న నష్టాల గురించి మాట్లాడుతూ.. హిందూయిజమనేది స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలకు పెద్ద గొడ్డలిపెట్టు. ప్రజాస్వామ్యానికి, హిందూయిజానికి అస్సలు పొసగదు! అని చెప్పాడు.

కాబట్టి ఇప్పటికీ కుల అసమానతలకు, సామాజిక అసమాతలకు బలవుతున్న వాళ్లంతా, సామాజిక చైతన్యంతో ఎదగాలి! మత ఊబిలో నుండి, కులాల ఉచ్చులో నుండి బయటపడాలి! ఇక బహుజనుల్లో కుల నిర్మూలన చైతన్యం ఉండాలే తప్పా, కులతత్వం ఉండకూడదు! నిరంతరం పూలే, అంబేద్కర్ ఆలోచన విధానాలను, శ్రామిక వర్గ ప్రజల విముక్తి సిద్ధాంతమైన మార్క్సిజాన్ని అధ్యయనం చేయాలి. ఆచరించాలి. ఇది మన ముందున్న కర్తవ్యం!

ముద్దగౌని సుభాష్
9000904284

## నేడు, రేపు కరువు పరిస్థితులపై రౌండ్ టేబుల్ సమావేశాలు

- 12న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్)

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో వల్ల ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల వల్ల రాష్ట్రంలో కరువు జిల్లాలను ప్రకటించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, పంటల బీమాను అమలు చేయాలని, కౌలు రైతుల 2011 చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6,7 తేదీలలో రౌండ్ టేబుల్ సమావేశాలను, 12వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపు ఇచ్చింది. "ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంలో 17 జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదయింది. పంటలు ఇప్పటికే చాలా జిల్లాలలో ఎండిపోవడం విపరీతమైన నష్టం ఏర్పడింది. ఇంకా విపరీతంగా నష్టపోయి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రైతాంగానికి నష్టపరిహారం వరికి ఎకరాకు రూ.30 వేలు, పత్తికి, మిర్చికి రూ.50 వేలు, ఇతర మెట్ట పంటలకు కూరగాయలకు ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం ఇవ్వాలని, విద్యుత్ సరఫరాను కట్ చేయకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయాలని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి వల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల మద్దతు ధరలు అతి నామమాత్రంగా పెంచడం కేవలం కంటితుడుపు చర్యగా చేతులు దులుపుకున్న చర్యగా ఉందని, సీటు ప్లస్ 50 శాతం ఆధారంగా పంటలకు పెట్టిన పెట్టుబడికి 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధరలు నిర్ణయించాలని వారు డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియను నిలిపివేసి ఇప్పటివరకు తొలగించిన రూ.13 కోట్ల ఓటర్లలో అర్హులైన అందరి ఓటు హక్కు కాపాడాలని, మహిళ రైతుల సాధికారత చట్టాన్ని తీసుకు రావాలని, కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులను వేగవంతం చేయాలని, పెండింగ్ ప్రాజెక్టుల పనులు ప్రాధాన్యతక్రమంలో త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

## తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

- నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక భేటీ
- హైదరాబాద్–శ్రీశైలం ఎన్‌హెచ్–765పై ఎలివేటెడ్ కారిడార్‌కు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో జరుగుతున్న చింతన్ శిబిర్ 2026లో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన పలు జాతీయ రహదారులు, ఎలివేటెడ్ కారిడార్లు, రోప్‌వేలు, ఆర్‌ఆర్‌ఆర్, ఆర్‌ఓబి, ఆర్‌యుబిలు, ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రాజెక్టులపై కోమటిరెడ్డి చేసిన విజ్ఞప్తులకు గడ్కరీ సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఎలిమినేటర్ హయత్‌నగర్ వరకు సుమారు 6 కి.మీ. డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌ను 2026–27 వార్షిక ప్రణాళికలో చేర్చి వెంటనే మంజూరు చేయాలని మంత్రి కోరారు. మెట్రో రైలు విస్తరణతో సమన్వయం ఉండేలా కారిడార్‌ను నిర్మించాలని సూచించారు.

**ఎన్‌హెచ్ 65 విస్తరణకు వేగంగా ఆమోదాలు..**

హైదరాబాద్ విజయవాడ మచిలీపట్నం ఎన్‌హెచ్65ను 6+2 లేన్లుగా విస్తరించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోమటిరెడ్డి కోరారు. సంగారెడ్డి చౌటుప్పల్ వరకు 161.518 కి.మీ. మేర నిర్మించనున్న ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి త్వరగా ఆర్థిక, కేంద్ర మంత్రివర్గ ఆమోదాలు ఇవ్వాలని కోరారు. భూసేకరణ వ్యయంలో 50 శాతం రాష్ట్రం భరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. హైదరాబాద్ చుట్టూ పూర్తి రింగ్ ఏర్పాటు చేసేందుకు ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని కూడా కేంద్రం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**ఐదు రోప్‌వేలకు రూ.1,230 కోట్లు..**

పర్వతమాల పథకం కింద రూ.1,230 కోట్ల అంచనా వ్యయంతో ఐదు రోప్‌వే ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వాలని మంత్రి కోరారు. యాదగిరిగుట్ట, నల్గొండ హనుమాన్ హిల్, నాగార్జునసాగర్ నాగార్జునకొండ, మన్యంకొండ, రామగిరి కోట, నిజామాబాద్ కిల్లా రామాలయం ప్రాంతాల్లో వీటిని ప్రతిపాదించారు. 2026 27లో సిఆర్‌ఐఎఫ్ కింద 511.68 కి.మీ. మేర 33 రహదారి పనులకు రూ.1,227.75 కోట్లు మంజూరు చేయాలని కోరారు.

**ఎన్‌హెచ్–765పై ఎలివేటెడ్ కారిడార్..**

హైదరాబాద్ శ్రీశైలం ఎన్‌హెచ్ 765లో టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతం మీదుగా ఎలివేటెడ్ కారిడార్‌కు మంజూరు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే డిపిఆర్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని మంత్రి కోరారు. దీనిని తెలంగాణ డ్రైపోర్టుతో అనుసంధానించడం ద్వారా సరుకు రవాణా, పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కోమటిరెడ్డి వివరించారు. ఆయన వెంట ఆర్అండ్‌బి ప్రత్యేక సిఎస్ వికాస్‌రాజ్, చీఫ్ ఇంజినీర్లు బి.వి.రావు, ధర్మారెడ్డి, వసంత్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా అంశం మోదీ మెడకు చుట్టుకుంటుంది

- సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గతంలో విద్యామంత్రి రాజీనామాతో ప్రధాని మోదీ గండం నుండి బయటపడితే, సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా అంశం మోదీ మెడకు చుట్టుకుంటుందని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఓట్లచోరీ + జెన్ జెడ్‌లు కలిసి బిజెపి ప్రభుత్వం తెగబడిందని, ఇది కేవలం శవాలపై పేలాలు ఏరుకునే నీచబుద్ధిత్వ మరొకటి కాదని ఆయన విమర్శించారు. సర్ ఉద్యమం అకాశాన్ని అంటుతున్నదని, జ్ఞానేశ్ కుమార్ అవినీతి కేరళం నుండి ప్రారంభమై సర్ పేరుతో దేశమంతా ఆయన అవినీతి మారుమోగుతున్నదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాడవాడలలో కుమార్ పదవి నుండి రాజీనామా చేయాలనే డిమాండ్‌తో పాటు అవినీతి కూపంలో ఇరుక్కు పోయారని, కుమార్ జీవచ్ఛవమేనని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సందట్లో సడేమియా అన్నట్టు యుపిఐ ప్రవేశపెట్టి ప్రజల నుండి కోట్లాది రూపాయలు జేబు నుంచి కొట్టేస్తున్నదని ఆయన విమర్శించారు.

## సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక నిరాహార దీక్ష

- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రానున్న రెండు నెలల్లో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుంటే హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ఎదుట నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ''మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులను అన్‌ఫిట్ చేయడంతో పాటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని'' డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్, టిఆర్ఎస్ నాయకులతో కలిసి కవిత హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ఎదుట సోమవారం బైఠాయించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సింగరేణిలో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న అందరికీ అన్‌ఫిట్ చేసి, వాళ్ల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. సింగరేణి లాభాల్లో 35 శాతం కార్మికులకు బోనస్‌గా ఇవ్వాలని, అలియాస్ పేర్లతో ఉద్యోగాలు చేస్తున్న వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా విజిలెన్స్ విచారణతో ఇబ్బందికి గురిచేస్తున్నారని, ఇలా వేధింపులకు గురి చేసి అక్రమంగా ఉద్యోగాల నుంచి తొలగించిన వారిని తిగిరి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ స్వతంత్ర సంస్థగా ఉండాల్సిన సింగరేణి సంస్థ మంత్రుల చేతిలో కీలుబొమ్మగా మారిందన్నారు.

## పేదలు, కార్మికుల పక్షాన నిలిచిన మహానేత కాకా

- ఘనంగా గడ్డం వెంకటస్వామి 97వ జయంతి వేడుకలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** పేదలు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన కేంద్ర మాజీ మంత్రి, కార్మిక నాయకుడు దివంగత గడ్డం వెంకటస్వామి (కాకా) 97వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమాల్లో కుటుంబ సభ్యులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని నివాళులర్పించారు. అంతకు ముందు ట్యాంక్‌బండ్‌పై ఉన్న కాకా విగ్రహానికి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కుటుంబ సభ్యులతో కలిసి పుష్పాంజలి ఘటించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, ఎంపి గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్ తదితరులు నివాళులర్పించారు. అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నివాళులర్పించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కాకా ఎప్పుడూ పేదలకు మేలు చేయాలనే ఆలోచనతో జీవించేవారని అన్నారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, చిన్నా పెద్దా తేడా లేకుండా అందరినీ ఆప్యాయంగా పలకరించేవారని గుర్తుచేశారు. నిజాయితీ, క్రమశిక్షణ, నిరాడంబరత, సేవా దృక్పథం వంటి విలువలను ఆయన నుంచే నేర్చుకున్నామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మికుడిగా ప్రారంభమై కార్మిక సంక్షేమానికి జీవితాన్ని అంకితం చేసిన మహానాయకుడు కాకా అని అన్నారు. సింగరేణి, రామగుండం ఎరువుల కర్మాగారం తదితర సంస్థల కార్మికుల హక్కుల కోసం పోరాడారని గుర్తుచేశారు. అంబేద్కర్ ఆలోచనలతో పేదలకు విద్య అందించేందుకు విద్యాసంస్థలను స్థాపించిన దార్శనికుడు కాకా అని అన్నారు. మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ క్రికెట్ ఆడుతున్న రోజుల్లోనే కాకాతో తనకు పరిచయం ఏర్పడిందని, కష్టపడు.. కష్టపడకుండా జీవితంలో ముందుకు వెళ్లలేవు అని ఆయన ఇచ్చిన సలహా తన క్రీడా జీవితానికి స్ఫూర్తిగా నిలిచిందని గుర్తుచేశారు. ఎంపి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ కాకా ఎప్పుడూ 'ఏ కష్టం వచ్చినా ప్రజల వైపే ఉండాలి' అని చెప్పేవారని, ఆయన చూపిన మార్గంలో ప్రజల ఆశీర్వాదంతో మరిన్ని కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కె.కేశవరావు, రాజేష్ లిలోథియా, అంజన్‌కుమార్ యాదవ్, సిరిసిల్ల రాజయ్య, శ్యామ్‌మోహన్, సోమారపు సత్యనారాయణ, కార్మిక నాయకుడు వెంకట్‌రావు పాల్గొని నివాళులర్పించారు.

## అమరవీరుల దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- గోషామహల్ పోలీస్ స్టేడియాన్ని పరిశీలించిన డిజిపి సి.వి.ఆనంద్
- అక్టోబర్ 21 కార్యక్రమం కోసం వేదిక, పార్కింగ్, రాకపోకలపై సమీక్ష.. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోలీసు విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకునే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర డిజిపి సి.వి ఆనంద్ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 21న గోషామహల్ పోలీస్ స్టేడియంలో జరగనున్న కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సోమవారం ఆయన స్వయంగా పరిశీలించారు. కార్యక్రమానికి వచ్చే పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రముఖులు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గోషామహల్ పోలీస్ స్టేడియంలో ప్రతిపాదిత కార్యక్రమ వేదికను పరిశీలించిన డిజిపి.. ప్రధాన వేదిక ఏర్పాటు, ప్రముఖుల రాకపోకలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై పోలీసు అధికారులతో చర్చించారు. భారీగా హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ నిర్వహణ, సందర్శకుల కదలికలు, పోలీసు సిబ్బంది విధుల కేటాయింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమ ప్రాంగణంలో స్పష్టమైన ప్రవేశ మార్గాలు, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేసి, అన్ని విభాగాల మధ్య సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం గోషామహల్ పోలీస్ స్టేడియంలో కొనసాగుతున్న వివిధ నిర్మాణ పనులను డిజిపి పరిశీలించారు. 48 గుర్రాల కోసం ఆధునిక స్టేబుల్ కాంప్లెక్స్, డాగ్ కెన్నెల్స్, ఐదు అంతస్తుల సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ భవనం, క్రీడలు, గేమ్స్, అథ్లెటిక్స్ సౌకర్యాల నిర్మాణ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యంపై డిజిపి అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని ఇంజినీర్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల్లో మరింత జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. 2027 అక్టోబర్ నాటికి గోషామహల్ పోలీస్ స్టేడియం సమగ్రంగా అభివృద్ధి చెంది, అన్ని సౌకర్యాలతో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని డిజిపి ఆశాభావం వ్యక్తం చేశారు.

**అమరవీరుల త్యాగాలకు నివాళి..**

ప్రతి ఏడాది అక్టోబర్ 21న విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల సంస్మరణార్థం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బంది సేవలను ఈ సందర్భంగా స్మరించుకుంటారు. ఈ నేపథ్యంలో గోషామహల్ పోలీస్ స్టేడియంలో జరగనున్న కార్యక్రమాన్ని అత్యంత గౌరవప్రదంగా, సమన్వయంతో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని డిజిపి అధికారులకు సూచించారు.

## సిఎం అవినీతి విషయంలో రాష్ట్రపతి తక్షణమే జోక్యం చేసుకోవాలి

- బిఆర్ఎస్ఎల్పి విప్ కె.పి.వివేకానంద




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిఎం, ఆయన కుటుంబ సభ్యుల విచ్చలవిడి సంపాదన అధికార దుర్వినియోగం కిందకే వస్తుందని, అందుకే సిఎం అవినీతి విషయంలో రాష్ట్రపతి తక్షణమే జోక్యం చేసుకోవాలని బిఆర్ఎస్ఎల్పి విప్ కె.పి.వివేకానంద కోరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం కొరియాకు వెళ్లొచ్చిన తర్వాత ఆయన భార్య పేరు మీద ఐదు హ్యుందాయ్ కార్ల షో రూమ్‌లను పెట్టుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి అవినీతిపైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిఎం సోదరుడు తిరుపతిరెడ్డి రాజ్యాంగేతర శక్తిగా మారి కొడంగల్‌లో అధికారులను శాసిస్తున్నారని, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటున్నారని ఆరోపించారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌ను సిఎం రేవంత్ తోలు బొమ్మలా ఆడిస్తున్నారన్నారు. తమ్ముడి షెల్ కంపెనీకి రూ 200ల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని రూ.7 కోట్లకే ఎలా కేటాయిస్తారని, మరో తమ్ముడి స్వచ్ బయో కంపెనీకి రూ.వెయ్యి కోట్ల ప్రభుత్వ ధనాన్ని దోచిపెట్టారని ఆరోపించారు.

### జంతర్ మంతర్ వద్ద మహిళా జర్నలిస్టులపై

## పోలీసుల ప్రవర్తన హేయమైన చర్య : ఐజెయు

**అమరావతి :** న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తాజా నిరసనల సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసుల దురుసు ప్రవర్తనపై ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షులు బల్విందర్ సింగ్ జమ్ము, సెక్రటరీ జనరల్ డి.సోమసుందర్ సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న ముగ్గురు మహిళా జర్నలిస్టులను అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారితో సహా మరికొందరు మగ పోలీసులు వేధించిన తాజా ఘటనను అత్యంత హేయమైన చర్యగా వారు అభివర్ణించారు. జంతర్ మంతర్ వద్ద విధినిర్వహణలో ఉండగా ఒక ఏసీపీ తనపై లైంగిక వేధింపులకు పాల్పడి, అసభ్యంగా ప్రవర్తించారని ఒక మహిళా జర్నలిస్టు ఇచ్చిన ఫిర్యాదును తీవ్రంగా పరిగణిస్తున్నామని వారు పేర్కొన్నారు. పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై గంటల తరబడి ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఉద్దేశపూర్వక జాప్యాలు, పోలీసుల ఉదాసీనత ఏమాత్రం ఆమోదయోగ్యం కావని, ఇది స్పష్టంగా నిందితులైన అధికారులను కాపాడే ప్రయత్నమేనని ఐజేయు నేతలు మండిపడ్డారు. స్వతంత్ర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లకు, ప్రధాన మీడియా సంస్థలకు చెందిన మహిళా జర్నలిస్టులు మీడియా గుర్తింపు కార్డులను చూపించినప్పటికీ పోలీసులు దాడులు కొనసాగించడం, బెదిరించడం, నిరసనకారులతో పాటు అదుపులోకి తీసుకోవడం గర్హనీయమన్నారు. కారణాలు వెల్లడించకుండా మొబైల్ ఇంటర్నెట్ సేవలను ఏకపక్షంగా నిలిపివేయడాన్ని కూడా ఐజేయూ తీవ్రంగా ఆక్షేపించింది. మహిళా జర్నలిస్టు ఇచ్చిన ఫిర్యాదుపై నిందితుడైన పోలీసు అధికారిపై, ఇతర సిబ్బందిపై తక్షణమే కఠినమైన క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులైన మీడియా ప్రతినిధులకు ఐజేయూ పూర్తి సంఘీభావాన్ని ప్రకటించింది. దేశ రాజధాని నడిబొడ్డున పత్రికా స్వేచ్ఛను అణచివేయడానికి, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేయడానికి జరిగే ప్రయత్నాలను ఇకనైనా నిలిపివేయాలని, లేనిపక్షంలో అలాంటి నిరంకుశ చర్యలను దేశవ్యాప్తంగా ప్రతిఘటిస్తామని బల్విందర్ సింగ్ జమ్మూ, సోమసుందర్ హెచ్చరించారు.

## ఢిల్లీ పోలీసుల తీరును ఖండిస్తున్నాం

- ఎసిపి వివేక్ భగత్‌ను సస్పెండ్ చేయాలి

**హైదరాబాద్:** ముగ్గురు మహిళా జర్నలిస్టులను వేధించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎసిపి వివేక్ భగత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ఢిల్లీ పోలీసులు నిరాకరించడాన్ని ఫోరం ఫర్ కాన్స్టిట్యూషనల్ డెమోక్రసీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఫోరం కన్వీనర్ కె.రామచంద్ర మూర్తి, జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ జి.హరగోపాల్, ప్రొఫెసర్ శాంతా సిన్హా, ప్రొఫెసర్ రమా మెల్కోటే, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి, డా.గోపాల్ రెడ్డి గాదే, హైకోర్టు సీనియర్ న్యాయవాది జి.జ్యోతి కిరణ్‌లు, సోమవారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఒకేరోజు ఎసిపి వివేక్ భగత్‌పై మూడు ఫిర్యాదులు అందాయని, వాటిని విచారణ నిమిత్తం క్రైమ్ బ్రాంచ్‌కు పంపించామని ఢిల్లీ పోలీసులు పేర్కొంటున్నప్పటికీ, ఇప్పటివరకు క్రైమ్ బ్రాంచ్ సదరు ఎసిపిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం విచారకరమన్నారు. మహిళలను వేధించడం తన అధికారిక విధుల్లో భాగమే అన్న భావనలో ఆ అధికారి ఉన్నట్లు కనిపిస్తుందన్నారు. వివేక్ భగత్ ప్రవర్తన పోలీసు శాఖలోని ఉన్నతాధికారులకు తెలియకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. ముగ్గురు జర్నలిస్టుల్లో ఇద్దరు గతంలో కూడా సదరు ఎసిపిపై ఫిర్యాదు చేశారని, అయినప్పటికీ ఆ అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఏసీపీని సస్పెండ్ చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని వారు డిమాండ్ చేసారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్ సర్కిల్, సికింద్రాబాద్.
టెండర్ ప్రకటన నెం. 05/2026-27
1. 33/11 KV తిరుమలగిరి ఇండోర్ సబ్-స్టేషన్‌లోని లాల్ బజార్ సెక్షన్ కార్యాలయం వద్ద కొత్త స్టోర్ రూమ్, సంప్, పార్కింగ్ షెడ్ మరియు ఇతర పనుల నిర్మాణం, 2. FOC పిఆర్‌నగర్ కార్యాలయం వద్ద పార్సీగుట్ట సెక్షన్ కోసం కొత్త FOC కార్యాలయం మరియు స్టోర్ రూమ్ నిర్మాణం వంటి పనుల కోసం అనుభవజ్ఞులైన కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించడమైనవి. పూర్తి వివరాలను www.tgsouthernpower.org వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, సికింద్రాబాద్ సర్కిల్.
DIPR R.O. No. : 11207-PP/CL/ADVT/2026-27, Date: 05-10-2026

## తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా అద్వైత్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా అద్వైత్ కుమార్ సింగ్ సోమవారం పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఎసి) స్వీకరించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, కేంద్ర ప్రాయోజిత పథకాల సమన్వయ విభాగం ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న అద్వైత్ కుమార్ సింగ్‌కు రెసిడెంట్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ జిఓ ఆర్‌టి నెం.1441ను అక్టోబర్ 3న విడుదల చేసింది. రెసిడెంట్ కమిషనర్ బాధ్యతలతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన సమన్వయ బాధ్యతలను కూడా ఆయన కొనసాగించనున్నారు.

## అటవీశాఖకు రూ.1,240 కోట్ల నిధులు

- వాహనాలు, సిబ్బంది భద్రతపై చర్చ
- ఉప ముఖ్యమంత్రి భట్టితో అటవీ శాఖ చీఫ్ వినయ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అటవీశాఖ అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల సమీకరణతో పాటు క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న అటవీ సిబ్బందికి అవసరమైన వనరులు, భద్రత కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు అటవీ దళాల అధిపతి (పిసిసిఎఫ్ఎఫ్) వినయ్ కుమార్, ఐఎఫ్ఎస్ సోమవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అటవీశాఖకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. అటవీశాఖలో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, ప్రాజెక్టులకు సంబంధించి జైకా (జెఐసిఎ) ద్వారా రూ.1,240 కోట్ల నిధుల విడుదలకు అనుమతులు మంజూరు చేసే అంశాన్ని పిసిసిఎఫ్ ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అటవీ ప్రాంతాల్లో విధులు నిర్వహించే ఫ్రంట్‌లైన్ సిబ్బందికి అవసరమైన వాహనాల కొనుగోలు అంశంపైనా చర్చించారు. బీడి ఆకుల పథకానికి సంబంధించి రూ.138 కోట్ల నిధుల విడుదల అంశాన్ని కూడా పిసిసిఎఫ్ ప్రస్తావించారు. ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మృతి చెందిన నవీన్ కుటుంబానికి ప్రత్యేక నిధులు అందించే అంశాన్ని కూడా వినయ్ కుమార్ ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అటవీ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది ఆత్మరక్షణ కోసం అటవీ సిబ్బందికి ఆయుధాలు అందించే అంశాన్ని ఆయన ప్రతిపాదించారు.

## మహాలక్ష్మి కి మహిళల నీరాజనం

- 3 నెలల్లో 97.20 లక్షల అదనపు ప్రయాణాలు
- పండుగలకు ప్రత్యేక సర్వీసులు: ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి

మహాలక్ష్మి పథకం - మహిళా ప్రయాణికుల వివరాలు
MHL PASSENGERS (IN LAKHS) - COMPARISON REPORT

| క్రమ సంఖ్య (S.No) | నెల (Month) | 2026 (లక్షల్లో) | 2025 (లక్షల్లో) | పెరుగుదల / వ్యత్యాసం (VARIANCE) |
|---|---|---|---|---|
| 1 | జూలై (JULY) | 1185.10 | 1159.65 | +25.44 |
| 2 | ఆగస్టు (AUGUST) | 1223.59 | 1175.32 | +48.27 |
| 3 | సెప్టెంబర్ (SEPTEMBER) | 1156.43 | 1132.94 | +23.49 |
| | మొత్తం (TOTAL) | 3565.11 | 3467.91 | +97.20 |

* ప్రయాణికుల సంఖ్య వివరాలు లక్షల్లో పొందుపరచబడ్డాయి.

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకానికి ఆదరణ రోజురోజుకూ పెరుగుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో అదనంగా 97.20 లక్షల మంది మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నట్లు టిజిఎస్ ఆర్‌టిసి గణాంకాలు వెల్లడించాయి. రద్దీకి అనుగుణంగా ప్రధాన మార్గాల్లో అదనపు ట్రిప్పులు, ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు సంస్థ విసి, ఎండి వై.నాగిరెడ్డి తెలిపారు. 2025 జూలై సెప్టెంబర్ మధ్య 3,467. 91 లక్షల మంది మహిళలు మహాలక్ష్మి పథకం కింద ప్రయాణించగా, 2026లో ఈ సంఖ్య 3,565.11 లక్షలకు చేరింది. దీంతో గత ఏడాదితో పోలిస్తే 97.20 లక్షల అదనపు ప్రయాణాలు నమోదయ్యాయి.

**రద్దీకి అనుగుణంగా ట్రిప్పుల పెంపు..**

మహిళా ప్రయాణికుల డిమాండ్ అధికంగా ఉన్న మార్గాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అదనపు బస్సులు, ట్రిప్పులు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఖమ్మం ఇల్లందు, ఇల్లందు కొత్తగూడెం, ఖమ్మం మధిర, సూర్యాపేట ఖమ్మం మార్గాల్లో సర్వీసులు పెంచారు. కరీంనగర్ హుస్నాబాద్, కరీంనగర్ గోదావరిఖని మందమర్రి, హన్మకొండ కరీంనగర్ మార్గాల్లోనూ అదనపు ట్రిప్పులు నడుపుతున్నారు. అలాగే హన్మకొండ తొర్రూరు, నల్గొండ దేవరకొండ, నల్గొండ సూర్యాపేట, దేవరకొండ మిర్యాలగూడ, అచ్చంపేట దేవరకొండ, సిద్దిపేట జెబిఎస్, నాగర్‌కర్నూల్ హైదరాబాద్, కోస్గి హైదరాబాద్, బాన్సువాడ నిజామాబాద్, బోధన్ నిజామాబాద్, కామారెడ్డి రామాయంపేట, కల్వకుర్తి మహబూబ్‌నగర్ తదితర మార్గాల్లోనూ సర్వీసులను పెంచినట్లు ఆర్‌టిసి తెలిపింది.

**పండుగలకు ప్రత్యేక సర్వీసులు..**

మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుంచి మహిళా ప్రయాణికుల సంఖ్య నిరంతరం పెరుగుతోందని వై.నాగిరెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రయాణికుల డిమాండ్‌ను డిపో మేనేజర్లు, అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని చెప్పారు. రద్దీకి అనుగుణంగా అదనపు ట్రిప్పులు, బస్సులను అందుబాటులోకి తెస్తున్నామని, రాబోయే పండుగల సీజన్‌లో మహిళలకు ఇబ్బందులు లేకుండా మరిన్ని ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు.

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఆల్విన్ కాలనీ సర్కిల్-51
Lr No: 16/CMC/ALC-51/EE/2026-27, తేది: 05.10.2026
NIT No. 16/CMC/ALC-51/EE/2026-27, తేది: 05.10.2026, పని పేరు: బతుకమ్మ పండుగ పనులు, అంచనా విలువ: రూ. 24.70 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 06.10.2026 మ.12.00గం.ల నుండి 09.10.2026 మ.12.00గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: శ్రీమతి సి.శ్రీకాంతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, ఆల్విన్ కాలనీ సర్కిల్-51. సెల్ నెం. 7337364213. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.in/లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆల్విన్ కాలనీ సర్కిల్-51, సిఎంసి.
DIPR R.O. No. : 11222-PP/CL/ADVT/2026-27, Date: 05-10-2026

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : సికింద్రాబాద్ జోన్
NIT No. టెండర్ నోటీసు నెం. 15/EE-II/Cir-43/SBZ/GHMC/2026-27, తేది: 05.10.2026, పని పేరు: సిసి రోడ్ పని: 1 నెం. కమ్యూనిటీ హోల్, మరమ్మతు పనులు : 2 నెం.లు, అంచనా విలువ: రూ.66.50లక్షలు, బిడ్ సమర్పణకు ప్రారంభ తేది & సమయం / బిడ్ సమర్పణకు ఆఖరి తేది & సమయం : 06.10.2026 మ.2.30గం.ల నుండి 14.10.2026 మ.2.30గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక. సెల్ నెం. 9704405076. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక, ఎస్‌బిజెడ్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 11245-PP/CL/ADVT/2026-27, Date: 05-10-2026

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, గాజులరామారం సర్కిల్-57
క్రమ సంఖ్య 1 నుండి 2 కొరకు
NIT No. 26/DB/EE/Gajularamaram Circle-57/CMC/2026-27, పని పేరు: పనుల సంఖ్య: 2, అంచనా విలువ: రూ. 11.50 లక్షలు, ప్రారంభ తేది & సమయం: 06.10.2026 మ.2.00గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 13.10.2026 మ.2.30గం.ల వరకు. టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9154299633, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, సెల్ నెం. 9063836115.
క్రమ సంఖ్య 3 నుండి 4 కొరకు
NIT No. 26/DB/EE/Gajularamaram Circle-57/CMC/2026-27, పని పేరు: పనుల సంఖ్య: 2, అంచనా విలువ: రూ. 9.35 లక్షలు, ప్రారంభ తేది & సమయం: 06.10.2026 ఉ.10.30గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 09.10.2026 ఉ.10.30గం.ల వరకు. టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9154299633, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, సెల్ నెం. 9063836115.
మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.in/లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-57, సిఎంసి.
DIPR R.O. No. : 11256-PP/CL/ADVT/2026-27, Date: 05-10-2026

## గిరిజనులకు అటవీ హక్కు పట్టాలివ్వాలి

ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ప్రజాపక్షం/నేరడిగొండ:** ఉమ్మడి జిల్లాల సమీక్షా సమావేశంలో మంత్రులు జూపల్లి, పొంగులేటిని కలిసి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నియోజకవర్గ సమస్యలను విన్నవించారు. అటవీ అధికారుల వైఖరి వల్ల పోడు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, గిరిజనులకు వెం టనే పోడు పట్టాలివ్వాలని కోరారు. బోథ్‌లో డయాలసిస్ సెంటర్, రెవెన్యూ డివిజన్, ఇచ్చోడలో 30 పడకల ఆస్పత్రి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఏడుగురు అరెస్ట్



**ప్రజాపక్షం/నెన్నెల :** మండలంలోని అవడం గ్రామంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.10,110 నగదు, 52 పేకముక్కలు, 4 సెల్‌ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అవడం గ్రామంలో డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కలాట ఆడుతున్నారన్న సమాచారంతో నార్కోటిక్, టాస్క్ ఫోర్స్ ఎసిపి శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎస్ఐలు దీకొండ రమేష్, లచ్చన్న, సిబ్బంది స్థానిక పోలీసులతో కలిసి ఆదివారం రాత్రి ఆకస్మిక దాడి నిర్వహించారు. పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల కోసం నెన్నెల పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. అక్రమ పేకాట, జూదం లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం మెదక్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పర్యటన ఏర్పాట్లపై సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా మధ్యాహ్నం 2:30 గంటలకు ఐడిఓసికి చేరుకోనున్న గవర్నర్, 2:40 గంటలకు నషా ముక్త్ భారత్ ర్యాలీని ప్రారంభించి, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మహిళా శక్తి స్టాళ్లను సందర్శించి స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమవుతారు. సాయంత్రం 3.30 గంటలకు రామాయంపేటలోని అమోఘ్ హూటల్ సమీపంలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద జాతీయ రహదారి ఎన్‌హెచ్765 డిజి వెంట 35 వేల జీడి మామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. జాతీయ రహదారి వెంట ఇంత భారీ స్థాయిలో జీడి మామిడి మొక్కల పెంపకం దేశంలోనే తొలిసారని కలెక్టర్ తెలిపారు. గవర్నర్ పర్యటనకు పటిష్ట భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు ఎస్పి శ్రీనివాసరావు తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

## 7న రాష్ట్ర బిసి కమిషన్ పర్యటన

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోటు చేసుకుంటున్న సామాజిక బహిష్కరణ ఘటనలపై బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరించేందుకు రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ 7న జిల్లా పర్యటనకు విచ్చేయనుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, సురేందర్, బాలలక్ష్మిలు సాంఘిక బహిష్కరణకు గురైన బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోనున్నారన్నారు. 7న జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు బాధితులతో కమీషన్ ప్రతినిధులు ఫిర్యాదులను స్వీకరిస్తారని తెలిపారు. బాధితులు కమిషన చైర్మన్ సభ్యులను నేరుగా కలిసి విజ్ఞాపనలు ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు.

## వాతావరణ మార్పులతో వ్యాధులు ప్రబలే ముప్పు

డాక్టర్ సుధాకర్ నాయక్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ సూచించారు. మంచిర్యాల శ్రీనివాస్ టాకీస్ సమీపంలోని కన్వెన్షన్ హాల్‌లో 58వ వార్డు పరిధిలో స్థానిక ప్రజాప్రతినిధి అనిత సత్యం బొట్ల నేతృత్వంలో సోమవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభావిత ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ద్వారా ఉచిత సేవలు, అవగాహన కల్పిస్తున్నామన్నారు. శిబిరంలో 152 మందికి రక్త పరీక్షలు, బిపి, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. దిశా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద సంస్థలు, ఆర్‌బిఎస్‌కె వైద్య బృందం సేవలు అందించాయి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు బొట్ల సత్యం, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, అల్లాడి శ్రీనివాస్, నామ్‌దేవ్, పుట్ట సత్తయ్య, డాక్టర్ తబియా, ఆర్‌బిఎస్‌కె వైద్యులు డాక్టర్ రాము, డాక్టర్ రజిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాడుపడిన బావిలో ఒకరు మృతి

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండలంలోని హాసకొత్తూర్ గ్రామశివారులోని పాడుబడిన బావిలో దూకి ఒక వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం మహారాష్ట్ర నాందేడ్ జిల్లా మహోర్‌గడ్‌కు చెందిన రవిదాస్ రామ్దేవ్ పవర్ (31) వ్యవసాయ కూలీ పని నిమిత్తం తన కుటుంబంతో కలిసి హాసకొత్తూర్‌లో నివసిస్తున్నారు. గత కొన్ని రోజులుగా అతనికి భార్య రుక్మిణితో తగాదాలు జరుగుతుండటంతో ఆమె మహారాష్ట్రలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ విషయమై తీవ్ర మనస్థాపానికి గురైన రవిదాస్ పాడుబడిన బావిలో దూకి మృతి చెందాడు మృతుని తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సమాజ ప్రగతిలో గురువుల పాత్ర ఎంతో కీలకమైనందున అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని మరింతగా ఇనుమడింపజేయాలని హితవు పలికారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవరం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేయగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదతరులు పాల్గొన్నారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి గురుపూజోత్సవానికి శ్రీకారం చుట్టిన అనంతరం మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ముఖ్యఅతిథుల చేతుల మీదుగా శాలువలు, జ్ఞాపికలను అందజేసి సన్మానించి మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు ఎంతోమెరుగైన బోధనా సామర్థ్యం, నైపుణ్యాలు కలిగి ఉన్నారన్నారు. వారి సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ ప్రభుత్వ బడులలో చదివే పేద కుటుంబాల పిల్లలకు కూడా నాణ్యమైన విద్యనందించాలనే సదాశయంతో సిఎం రేవంత్‌రెడ్డి కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో అలరింపజేసిన బాలికలకు జ్ఞాపికలు బహుకరించారు. కార్యక్రమంలో తాహెర్‌బిన్ హందాన్, గంగాధర్, రాజిరెడ్డి, శేఖర్‌గౌడ్, అశోక్, రవి కుమార్, సీతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టైగర్ జోన్ పేరుతో ఇళ్ల నిర్మాణం ఆపొద్దు

కొలాంగూడ గిరిజనుల ఇళ్ల నిర్మాణాలు కొనసాగించాలి

ఫారెస్టు అధికారుల వేధింపులు ఆపాలని

సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆర్‌డిఒకు వినతి




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కడెం మండలం ఇస్లాంపూర్ గ్రామ పరిధిలోని కొలాంగూడ గిరిజనులకు మంజూరైన 31 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను టైగర్ జోన్ పేరుతో అడ్డుకోవద్దని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య కోరారు.ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో టిఎన్‌జిఒస్ ఆఫీస్ నుండి మున్సిపల్ కార్యాలయం మీదుగా ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి.ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్‌డిఒ దేవదాస్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నంది రామయ్య మాట్లాడుతూ..కొలాంగూడకు చెందిన 31 మంది గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరయ్యాయని, సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో తమ నివాస గుడిసెలను తొలగించుకుని నిర్మాణ పనులు ప్రారంభించారని తెలిపారు. కొందరు పునాదులు తవ్వగా, మరికొందరు సిమెంటు బీములు వేసుకున్న సమయంలో టైగర్ జోన్‌లో ఉందంటూ ఫారెస్టు అధికారులు నిర్మాణాలను అడ్డుకున్నారని పేర్కొన్నారు. దీంతో దాదాపు ఏడాదిగా ఎండకు ఎండుతూ, వానకు నానుతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే సమస్యను కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని, కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని నందిరామయ్య పేర్కొన్నారు. వెంటనే తగిన ఆదేశాలు జారీ చేసి ఇళ్ల నిర్మాణాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, నిర్మాణం ప్రారంభించిన 31 ఇళ్లకు బిల్లులు చెల్లించాలని కోరారు.ఫారెస్టు అధికారుల వేధింపులను ఆపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐయుకెఎస్ జిల్లా నాయకులు సిడాం సోనేరావ్, గ్రామ నాయకులు సిడాం భీమ్‌రావ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు గని భూముల్లో ఆయిల్‌పామ్ తోటలు



**ప్రజాపక్షం/మందమర్రి :** సింగరేణి చరిత్రలో తొలిసారిగా బొగ్గు గని భూముల్లో ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి మందమర్రిలో శ్రీకారం చుట్టారు. మూసివేసిన కెకె 2 గని ఆవరణలోని నర్సరీ వెనుక రెండు హెక్టార్లలో 285 మొక్కలు నాటారు. బొగ్గు తవ్వకాలు పూర్తయిన స్థలాలను హార్టికల్చర్, వ్యవసాయ ప్రయోజనాలకు వినియోగించాలనే లక్ష్యంతో సిఎండి డాక్టర్ బుధ ప్రకాశ్ జ్యోతి మార్గదర్శకంలో, డైరెక్టర్ కే. వెంకటేశ్వర్లు, ఫారెస్ట్ జిఎం సైదులు పర్యవేక్షణలో ఈ ప్రాజెక్టు చేపట్టారు. 135 ఏళ్ల చరిత్ర కలిగిన సంస్థలో ఇదో సరికొత్త ప్రయోగమని, ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా జిఎం ఎన్. రాధాకృష్ణ, జిఎం ఎస్ఒ జిఎల్ ప్రసాద్, ప్రాజెక్ట్ అధికారి రాంబాబు, ఏజెంట్లు సంతోష్, ఖాదిర్, బెల్లంపల్లి రీజియన్ డిజిఎం హరి నారాయణ, సేవా సమితి అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సైబర్ మోసగాడు అరెస్ట్



**ప్రజాపక్షం/మావల:** బ్యాంక్ అధికారుల పేరిట ఒటిపిలు సేకరించి రూ.95 లక్షల వరకు మోసాలకు పాల్పడిన మహారాష్ట్రకు చెందిన చైతన్య ప్రమోద్ కెటెను ఆదిలాబాద్ 1 టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదిలాబాద్‌కు చెందిన బాధితుడి వద్ద రూ.73,279 కాజేసిన కేసులో దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకున్నట్లు ఎస్పి అఖిల్ మహాజన్ వెల్లడించారు. నిందితుడిపై తెలంగాణ, మహారాష్ట్ర, గోవాలో 150 కేసులు ఉన్నట్లు తెలిపారు.

## రోడ్డుపై మొక్కజొన్న ఆరబోత

వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ ' మంచిర్యాల జాతీయ రహదారిపై రైతులు తమ మొక్కజొన్న పంటను ఆరబెడుతుండటంతో రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రస్తుతం మొక్కజొన్న కోతలు పూర్తికావడంతో రైతులు తమ పంటను ధాన్యం కల్లాల్లో కాకుండా జాతీయ రహదారిపైనే ఆరబోస్తున్నారు. దీనివల్ల రోడ్డులో సగం భాగం మూసుకుపోయి తీవ్రంగా ట్రాఫిక్ నిలిచిపోతోంది. ముఖ్యంగా భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సందర్భాల్లో చిన్న వాహనాలు, ద్విచక్ర వాహనాలు పక్కకు వెళ్లడానికి మార్గం లేక నిత్యం ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల కడం గ్రామానికి చెందిన ఇద్దరు పోలీసులు బైక్‌పై వెళ్తుండగా, రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న విత్తనాల వల్ల వాహనం అదుపుతప్పి పడిపోయి తీవ్రంగా గాయపడినట్లు సమాచారం.ఈ తరహా ప్రమాదాలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులు పంటను ఆరబెట్టుకోవడానికి వీలుగా ప్రత్యామ్నాయంగా మార్కెట్ యార్డుల్లో లేదా ప్రత్యేక కల్లాల్లో ఏర్పాట్లు చేయాలని, జాతీయ రహదారిపై తగిన భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## భీమ్‌గల్ పిఎస్‌లో టీ వ్యాపారి ఆత్మహత్యాయత్నం

పోలీసుల వేధింపులే కారణమంటూ బాధిత కుటుంబం, అఖిలపక్షాల ఆరోపణలు

ఆరోపణలను ఖండించిన పోలీసులు



**ప్రజాపక్షం/భీమ్‌గల్:** భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ టీ వ్యాపారి పొలాస సుధాకర్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వేధింపుల కారణంగానే సుధాకర్ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని ఆయన కుటుంబ సభ్యులు, అఖిలపక్ష నాయకులు ఆరోపించారు. మరోవైపు ఈ ఘటనకు పోలీసులకు ప్రత్యక్ష సంబంధం లేదని సిపి కార్యాలయం సోమవారం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో స్పష్టం చేసింది. భీమ్‌గల్ బస్టాండ్ సమీపంలో టీ స్టాల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న సుధాకర్‌ను రాత్రి వేళల్లో టీ విక్రయిస్తున్నాడనే కారణంతో పోలీసులు పలుమార్లు ఇబ్బందులకు గురి చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఇప్పటికే పలుమార్లు కేసులు పెట్టి జరిమానాలు విధించారని, తాజాగా మరోసారి పోలీస్‌స్టేషన్‌కు రావాలని చెప్పటంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడని తెలిపారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం సుమారు 9.45 గంటల సమయంలో పెట్రోల్‌తో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సుధాకర్ తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే అక్కడున్న పోలీసులు, ఇతరులు మంటలను ఆర్పి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### అఖిలపక్షాల ఆందోళన ..

ఘటన అనంతరం సుధాకర్ కుటుంబ సభ్యులు భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు వారికి మద్దతు తెలిపారు. బాధితునిపై ఒత్తిడి తీసుకవచ్చి స్టేట్‌మెంట్‌ను మార్చేందుకు ప్రయత్నించారని వారు ఆరోపించారు. ఘటనకు బాధ్యులైన ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని బాధితుడికి మెరుగైన వైద్యమందించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. పేద టీ వ్యాపారి సుధాకర్ పోలీసుల వేధింపులు తాళలేక పిఎస్‌లోనే ఆత్మహత్యయత్నం చేయటం బాధాకరమన్నారు. బాధితునికి ప్రభుత్వం తరపున ఉచితంగా మెరుగైన వైద్యమందించాలని డిమాండ్ చేశారు. సుధాకర్ ఆత్మహత్యాయత్నానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎస్ఐపై హత్యయత్నం కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశా రు.

### పోలీసుల వివరణ..

సిపి కార్యాలయం విడుదల చేసిన ప్రెస్‌నోట్ ప్రకారం సుధాకర్‌కు మరో వ్యక్తితో ఉన్న వివాదం, అతని టీ స్టాల్‌లో రాత్రివేళల్లో వ్యాపారం నిర్వహించటం తదితర అంశాలపై పోలీసులు పెట్టి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆ కేసులో రిమాండ్‌కు వెళ్లి బెయిల్‌పై వచ్చిన సుధాకర్ అదే విషయాన్ని మనసులో పెట్టుకుని పిఎస్‌కు వచ్చి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ ఘటనలో పోలీసు వ్యవస్థకు లేదా పోలీసు స్బిబందికి ప్రత్యక్ష సంబంధం లేదని కమిషనర్ స్పష్టం చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

## అభివృద్ధి సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే రోహిత్ రావు





**ప్రజాపక్షం/రామాయంపేట:** అభివృద్ధి సంక్షేమం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు సోమవారం రామాయంపేట మండలంలోని కోనాపూర్‌లో స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 16 రేషన్ షాపులకు మొత్తం 13,513 రేషన్ కార్డులు మంజూరు కాగా, 15 గ్రామపంచాయతీల పరిధిలోని 9,739 కార్డులను నేరుగా లబ్ధిదారులకు అందజేశారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షలతో కోనాపూర్‌లో నిర్మించిన మహిళా భవనాన్ని ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రారంభించారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని, మహిళా సంఘాల ద్వారా రుణాలు పొంది స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదుగాలని ఆయన సూచించారు. గత పదేళ్ల కాలంలో కోనాపూర్ గ్రామాన్ని బిఆర్ఎస్ నాయకులు పట్టించుకోలేదని, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఎమ్మెల్యే విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ షాజీలోద్దీన్ తాహసీల్దార్ రజనీకుమారి మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు, మండల పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సర్పంచ్ వెంకట్ రెడ్డి తో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**షాపింగ్ మాల్స్ రావడం అభివృద్ధికి నిదర్శనం**

మెదక్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైభవం షాపింగ్ మాల్ సోమవారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్, జాతి రత్నాలు ఫేం, సినీ తార ఫరియా అబ్దుల్లా చేతుల మీదుగా మాల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాల్ యాజమాన్యానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్‌లో ప్రముఖ బ్రాండ్లు, భారీ షాపింగ్ మాల్స్ ఏర్పాటు కావడం పట్టణం వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్నదానికి నిదర్శనమన్నారు. ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు, ఆధునిక షాపింగ్ సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. మాల్ యాజమాన్యం స్థానిక యువత, నిరుద్యోగులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సినీ నటి ఫరియా అబ్దుల్లా రావడంతో ఆమెను చూసేందుకు అభిమానులు భారీ ఎత్తున తరలి వచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు టౌన్ అధ్యక్షుడు గంగాధర్, టౌన్ మైనారిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఫాజిల్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్‌ను కరువు జిల్లాగా ప్రకటించాలి

రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొర్రన్న డిమాండ్



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలో సోమవారం రైతులతో కలిసి రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న మాట్లాడుతూ.. ఈ ఏడాది జూన్, జూలై ప్రారంభంలో కురిసిన వర్షాలకంటే అతి తక్కువగా కురువడం, అదే విధంగా ఎలినినో ప్రభావం మూలంగా అతి తక్కువ వర్షపాతం నమోదు కావడంతో జూన్ నుండి సెప్టెంబర్ వరకు కురువ వలసిన వర్షపాతం కంటే అతి తక్కువగా అంటే 32 శాతం వరకు లోటుగా ఉంది. తెలంగాణ రాష్ట్రం మొత్తంగా చూస్తే ఆదిలాబాద్ జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదయిందని అన్నారు.ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం కరువు ప్రభావిత మండలాల జాబితాను పరిశీలిస్తున్నట్లు,“ఆదిలాబాద్ జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.జిల్లాలోని కరువు ప్రభావిత మండలాలను గుర్తించి,రైతులకు పంట నష్టపరిహారం, పంట రుణాల రీషెడ్యూలింగ్/మాఫీ,రుణవసూళ్ల నిలిపివేత, ఇన్‌పుట్ సబ్సిడీ, పశుగ్రాసం, తాగునీటి ఏర్పాట్లు, ఉపాధి హామీ పనుల పెంపు వంటి తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రైతులు రవి,కృష్ణ, రాజు, సుభాష్,రాములు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్ అదనపు కలెక్టర్లు సంగీత ,పాండు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను స్వయంగా ఆలకించిన కలెక్టర్ సంబందిత శాఖల అధికారులకు అర్జీలను పంపించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ జానకిరెడ్డి, బిసి సంక్షేమాధికారి జగదీష్, ఆర్‌డిఒ రాజేందర్,జిల్లా వ్యవసాయ శాఖాధికారి శివప్రసాద్, గృహనిర్మాణశాఖ పిడి, ఈడి ఎస్సీ కార్పొరేషన్ రామాచారి జిల్లా సంక్షేమాదికారి లలిత కుమారి అదనపు ఆర్‌డిఒ బాలరాజ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## శిథిల విద్యుత్ స్తంభాలతో ప్రాణభయం

అధికారులకు ఝురి-బి గ్రామస్తులు మొర




**ప్రజాపక్షం/తానూర్ :** మండలంలోని ఝురిబి గ్రామంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాల సమస్యను పరిష్కరించాలని గ్రామ కమిటీ అధ్యక్షుడు దొంతుల రమేష్ అధికారులను కోరారు. సోమవారం మండల ప్రజావాణి కార్యక్రమంలో ఎంపిఒ అమిర్ ఖాన్ ను కలిసి, గ్రామంలోని పరిస్థితిని వివరిస్తూ వినతిపత్రం సమర్పించారు. దశాబ్దాల క్రితం నాటిన సిమెంట్ స్తంభాలు పగుళ్లు బారిన పడి ఇనుప రాడ్లు బయటకు వచ్చి ఎప్పుడు నేలకూలుతాయోనన్న ఆందోళన నెలకొందని తెలిపారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే పిల్లలు,రోడ్డు పక్కన నడిచే వృద్ధులకు తీవ్ర ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంపై పత్రికల్లో కథనాలు వచ్చినా విద్యుత్ శాఖ నుంచి స్పందన లేదని రమేష్ పేర్కొన్నారు. ఇక ఆలస్యం చేయకుండా సంబంధిత ఎ ఇ, డిఇలతో చర్చించి పాత స్తంభాల స్థానంలో కొ త్తవి మంజూరు చేయాలని ఎంపిఒను విజ్ఞప్తి చేశా రు.

## పాలనలో వైవిధ్యం కాంగ్రెస్ ప్రత్యేకత



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** ప్రజలకు మేలు చేయడంతోపాటు వైవిధ్యభరితమైన, సమర్థవంతమైన పాలన అందించడం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకత అని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మానకొండూర్ మండల కేంద్రంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులకు ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి మేధావులు, సమర్థులైన ప్రధానులను అందించిన ఘన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, డా.మన్మోహన్ సింగ్ లాంటి ప్రధానులు తమదైన పాలనా ముద్ర వేశారని గుర్తు చేశారు. అయోగ్యుల పాలనలో దేశం అధోగతి పాలవుతుందని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ ప్రజలకు కాంగ్రెస్ పార్టీయే శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నూతనంగా ఎన్నికైన గ్రామ శాక అధ్యక్షులు చిత్తశుద్ధితో పని చేయాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ నోటీసుల హియరింగ్ త్వరగా పూర్తి చేయండి: బాల మాయా దేవి



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న నోటీసుల హియరింగ్‌ను నిర్ణీత సమయంలోగా త్వరగా పూర్తి చేయాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయా దేవి సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నోటీసులపై తదుపరి చర్యలు ఎలాంటి జాప్యం లేకుండా చేపట్టాలని ఆదేశించారు. సోమవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, డి. శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో బాల మాయా దేవి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు.

**జిల్లా కలెక్టర్, యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు**

కరీంనగర్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పక్కా ప్రణాళికతో ముందుకు తీసుకెళ్తున్న జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, జిల్లా యంత్రాంగాన్ని బాల మాయా దేవి ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. జిల్లాలో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఆకట్టుకుంది. కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల వారీగా ప్రక్రియ పురోగతి, పెండింగ్ అంశాలను వివరించారు. మిగిలిన ప్రక్రియను కూడా త్వరగా పూర్తి చేసేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, డి. శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో షర్మిల, తహసీల్దార్లు, అసిస్టెంట్ ఈఆర్వోలు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే..మళ్లీ జెట్ స్పీడ్‌తో అభివృద్ధి: హరీష్ రావు



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా ఏర్పాటుతో సిద్దిపేట పట్టణ స్వరూపం మారిందని సిద్దిపేట జిల్లా ఏర్పడి పదేళ్లు అవుతుందని ఎన్నో దశబ్దాల కలకు దశాబ్ది అవుతుందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు..సోమవారం సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో సిద్దిపేట పట్టణ బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశం ఎమ్మెల్యే హరీష్‌రావు పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట జిల్లా ఏర్పాటు అనేది ఎన్నో దశబ్దాల కల అని.. నాడు కెసిఆర్ ఏ చేత అయితే దరఖాస్తు ఇచ్చాడో అదే చేత్తో సిద్దిపేట జిల్లా ఏర్పాటుకు సంతకం చేసాడన్నారు. 2016 అక్టోబర్ 11 జిల్లా ఆవిర్భావం జరిగిందని, 2026 అక్టోబర్ 11 కు పదేళ్లు అవుతున్న సందర్భంగా పదేళ్ల పండుగ ఘనంగా వేడుకగా జరుపుకోవాలని సిద్దిపేట జిల్లా పండుగ ఉత్సవంల చేద్దామని నిర్ణయించినట్లు చెప్పారు. సిద్దిపేట జిల్లా కు ముందు, జిల్లా తరువాత చరిత్ర భావి తరాలకు అందించెందుకే సిద్దిపేట జిల్లా పదేళ్ల పండుగ నిర్వహిస్తున్ను తెలిపారు. సిద్దిపేట ఎన్నో విద్యాలయాలు నెలకొల్పామని , సిద్దిపేట కు 300 కోట్ల తో వెటర్నరీ కళాశాల మంజూరు చేసుకున్నామని 25% పనులు అయ్యాయి. దొంగ రేవంత్ రెడ్డి ఆ కళాశాల ను కొండగల్‌కు తరలించుక పోయడాని చెప్పాడు. ఈ దొంగ రేవంత్ రెడ్డి ఎట్లా తీసుక పోయిండో... అట్లనే వెటర్నరీ కళాశాలను సిద్దిపేటకు తీసుకొస్తనని చెప్పారు. వచ్చేది బిఆర్ ఎస్ ప్రభుత్వమే బరాబర్ డబుల్ స్పీడ్‌తో సిద్దిపేట అభివృద్ధి చేసుకుందామన్నారు. పట్టణంలో 11న జరిగే బహిరంగ సభ లు భారీ ఎత్తున సభ కు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, రాష్ట్ర కార్యదర్శి రాధకిషన్‌శర్మ, నాయకులు గుండు భూపేశ్, వెంకటేశ్వర్‌రావు, సంపత్‌రెడ్డి.మచ్చవేణుగోపాల్‌రెడ్డి, మోహన్‌లాల్, బర్లమల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య..

**ప్రజాపక్షం/బెజ్జంకి:** అనారోగ్య సమస్యతో భాధపడుతూ మనస్థాపానికి గురై ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల మేరకు మల్లమారి రామచంద్రం (48) ఆటో ట్రాలీ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.గత కొన్ని సంవత్సరాలుగా కిడ్నీ స్టోన్స్,థైరాయిడ్,గ్యాస్ తదితర సమస్యలతో భాధపడుతున్నాడు.అంతేకాకుండా 15 రోజులుగా టైఫాయిడ్ జ్వరంతో ఇబ్బందిపడుతున్నాడు.చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఆటో నడపలేని పరిస్థితిలో మానసికంగా భాధపడుతూ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుడి భార్యా మల్లమారి భూలక్ష్మీ ఇచ్చిన పిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

# వేగంగా రాజన్న ఆలయ విస్తరణ పనులు

మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఐడిఒసిలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం

హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. వేములవాడ పట్టణంలో వీటీఎడిఎ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణం, బద్ది పోచమ్మ ఆలయం తదితర నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ , ఆర్ అండ్ బిసి ఈ రాజేశ్వర్ రెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో పవల్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సోమవారం వివరించగా రాష్ట్ర బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు పూర్తయిన పనులపై ఆరా తీశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు చరిత్రలో నిలిచిపోయేలా ఉండాలని సూచించారు. ప్రస్తుత భక్తుల రద్దీ భవిష్యత్‌లో రద్దీకి అనుగుణంగా ప్రణాళిక ప్రకారం అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రతి అధికారి ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఒక్కో పనికి గడువు విధిస్తూ వాటిని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని నిధులు మంజూరు చేస్తున్నారని పనుల ప్రక్రియపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని అన్నారు. త్వరలో నిర్వహించనున్న పుష్కరాలకు సంబంధించి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటక రంగంగా విస్తరించేలా ప్రజా ప్రభుత్వం పక్కా ప్రణాళిక ప్రకారం పనులు చేస్తుందన్నారు. సమ్మక్క, సారక్క ఆలయానికి భక్తులు నిరంతరం వెళ్లేలా అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేసే అవకాశం రావడం అదృష్టమని దీనిలో అధికారులు పూర్తిస్థాయిలో భాగస్వాములై పూర్తి చేయాలని సూచించారు. శ్రీ విధుశేఖర భారతి స్వామి, సీఎం రేవంత్ రెడ్డి సూచనలు మేరకు భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా



ఆలయ విస్తరణ పనులను చేయాలని ఆదేశించారు. అధికారులందరూ ఈ పనులు తమ విధిగా భావించి పూర్తి స్థాయిలో నిమగ్నమై వేగంగా పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో కార్మిక, ధార్మిక ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని వివరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు ప్రతి వారం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. వాటిపై సమీక్ష సమావేశం నిర్వహిస్తూ పనులు వేగంగా పూర్తి చేసేలా అధికారులకు సూచనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, వేములవాడ ఆర్డీవో కేవీస్‌బీ కుమారి, ఈఈ భీమ్లానాయక్, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ రమాదేవి, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ ఎం.శ్రీనివాస్, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఈ రాజేశ్, మున్సిపల్ కమీషనర్ లోకేశ్, తహసీల్దార్ జయంత్, వీటీఏడీఏ అధికారులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**ప్రజాపక్షం/జగిత్యాల:** గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టిభక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లో కాన్ఫరెన్స్ హాల్ లో గోదావరి పుష్కరాలు–2027పై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు–2027ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని వివరించారు. ధర్మపురి, కోటిలింగాల తదితర పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. జగిత్యాల జిల్లాలో గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తుల రాక భారీగా ఉండే అవకాశం ఉన్నందున రహదారులు, ఘాట్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు, పార్కింగ్, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తెలిపారు.



ధర్మపురి పుష్కర ప్రాంతంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి పలు శాఖలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, మొత్తం రూ. 226.41 కోట్ల మేర వివిధ శాఖల పనులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో ఎండోమెంట్స్, ఇరిగేషన్, పీఆర్ఈడీ, ప్రజారోగ్యం, నీటి సరఫరా–పారిశుధ్యం, టూరిజం, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖలకు సంబంధించిన పనులు వివరాలు సంబంధిత అధికారులు వివరించారు. అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాలని యో జకవర్గంలో బోర్నపెల్లి, కమ్మునూరు, చిత్రవేణి గూడెం గోదావరి పరివాహక ప్రాంతం లో కూడా గోదావరి పుష్కర స్నానాలకు వచ్చే ప్రజలకు, భక్తులకు కావలసిన వసతులు, పుష్కఘాట్లు, రోడ్లు, విధ్యుత్ పనులను వేగవంతం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు–2027ను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని పుష్కర ఘాట్లు, రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య, పోలీస్ తదితర ఏర్పాట్లను సమగ్రంగా చేపడుతున్నామని తెలిపారు. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన పుష్కర అనుభవం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమీక్ష లో జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, మెట్ పెల్లి ఆర్డీవో నరసింహా రావు,ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగ ఉన్నారు.

## విద్యార్థి జీవితానికి మార్గదర్శి ఉపాధ్యాయుడు

ఆల్ఫోర్స్ చైర్మన్ డా.నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** విద్యార్థి జీవితానికి మార్గదర్శి ఉపాధ్యాయుడని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.నరేందర్ రెడ్డి అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తపల్లి ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. సమాజానికి జ్ఞానం, నైతికత, మానవతా విలువలను అందించే శక్తివంతమైన మార్గదర్శకులు ఉపాధ్యాయులని కొనియాడారు. గురువు చూపిన మార్గంలో విద్యార్థి జీవితానికి వెలుగుబాటగా నిలుస్తుందన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం వారి ప్రాధాన్యతను గుర్తించడమేనని అన్నారు. వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆలోచింపజేశాయి. విద్యారంగం అభివృద్ధికై అహర్నిశలు కృషి చేస్తున్న నరేందర్ రెడ్డిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఇసి జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి

ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** సీఈసీ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని ఇండియా కూటమి పక్షాలు డిమాండ్ చేశాయి. అక్టోబర్ 2 నుండి 8 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ వారంలో భాగంగా సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు సోమవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల సంయుక్త సమావేశం ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, ఆమ్ ఆద్మీ పార్టీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, తెలంగాణ జన సమితి, సమాజ్‌వాదీ పార్టీ కూటమి నాయకులు పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించే నిరసన కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగేలా అన్ని పార్టీలు కృషి చేయాలన్నారు. వందలాది మందితో మంగళవారం ఉదయం 10:30 గంటలకు ఇందిరా గాంధీ చౌరస్తా నుండి కలెక్టరేట్ వరకు మన పార్టీల జండాలు ప్రదర్శిస్తూ, భారీ మార్చ్ నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు సత్యం తెలిపారు.ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తేజ్ దీప్ రెడ్డి, సీపీఐ ఎంఎల్ (మాస్ లైన్) జిల్లా కార్యదర్శి జిన్నం ప్రసాద్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, సీపీఐ నగర నాయకులు అంజన్న తదితరులు పాల్గొన్నారు.

## రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం: ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/సుల్తానాబాద్/ఎలిగేడు :** పెద్దపల్లినియోజకవర్గంలోని ఎలిగేడు మండలం రాములపల్లి వద్ద రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు సోమవారం సంబంధిత అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కుల,మత భేదాలు లేకుండా అన్ని వర్గాల విద్యార్థులు ఒకే వేదికపై నాణ్యమైన విద్యను అభ్యసించేలా ఈ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు.తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత రెండున్నర సంవత్సరాల్లో పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.70 కోట్ల నిధులు ఖర్చు చేసి పాఠశాల భవనాలు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు తదితర మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. గత పదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. రాములపల్లిలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో 2,560 మంది విద్యార్థులకు విద్య అందించేలా హాస్టల్, డైనింగ్ హాల్, ప్లేగ్రౌండ్‌తో పాటు ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రమేష్, రాజేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పండుగకు ముందే పూర్తి చేయాలి

'సర్' పెండింగ్ నోటీసులు, విచారణలు

ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాల మాయాదేవి

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** 'సర్' 2026 ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న నోటీసులు, విచారణలను పండుగకు ముందే పూర్తి చేయాలని, నిర్ణీత కాల పట్టికను ఖచ్చితంగా పాటించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాల మాయాదేవి అధికారులను ఆదేశించారు. సోమవారం పెద్దపల్లి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీతో కలిసి ఎస్ఐఆర్2026 ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న నోటీసులు, విచారణలను పండుగకు ముందే పూర్తి చేయాలని సూచించారు.పండుగ సమయంలో సిబ్బందికి విధుల నిర్వహణలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్నందున, అప్పటిలోగా పెండింగ్ పనులన్నింటినీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన అన్ని రికార్డులను తప్పనిసరిగా రీకన్సైల్ చేయాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ సూచించారు. నిర్ణీత గడువులను ఎట్టి పరిస్థితుల్లోనూ అధిగమించకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని



ఆదేశించారు. ఈ నెల చివరి వారంలో మరోసారి జిల్లా ను సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియలో పనుల పురోగతిని పరిశీలిస్తామని తెలిపారు. ఏయే పోలింగ్ కేంద్రాల్లో ఎక్కువ సంఖ్యలో ఓటర్ల తొలగింపులు, చేర్పులు నమోదయ్యాయో గుర్తించి, ఆయా పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రత్యేకంగా పరిశీలించాలని బి. బాల మాయాదేవి అధికారులను ఆదేశించారు.సంబంధిత వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చోట్ల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటి సర్వే సందర్భంగా 01/10/2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకునే అర్హులైన యువత నుంచి ఫారం6 దరఖాస్తులను సేకరిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి దశలో నిబంధనలను పాటిస్తూ, పారదర్శకంగా పనులు చేపట్టాలని, అర్హులైన ఓటర్ల వివరాలు తుది జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాల మాయాదేవి సూచించారు. సమీక్ష సమావేశంలో ఆర్డీవోలు గంగయ్య, సురేష్, ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు, బీఎల్ఓలు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన బైక్

ఇద్దరు యువకులు మృతి

మరోకరికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ని హన్మకొండ ప్రధాన రొడ్డుపై సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకుల అక్కడిక్కడే చనిపోయారు. వివరాల్లోకి పోతే హుస్నాబాద్ పట్టణంలోని హన్మకొండ రోడ్డుప్రదాన రహదారిపై మున్సిపల్ కు చెందిన ట్రాక్టర్ రోడ్డుపై నిలిపి చెత్తను సేకరిస్తుండగా 8 గంటల సమయంలో ద్విచక్రవాహనం వెనుక నుండి బలంగా ఢీ కొట్టగా తీవ్ర గాయాలతో రక్తస్రావం జరిగి ఇద్దరు యువకులు అక్కడే చనిపోయారు. మరో యువకుడు తీవ్ర గాయాలపాలుకాగా వెంటనే ఆతన్ని ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఆతని పరిస్థితి ఆందోళన కరంగా ఉన్నట్లు వైద్యధికారులు తెలిపారు. రహదారిపై చెత్తను సేకరిస్తున్న మున్సిపల్ ట్రాక్టర్ రోడ్డుపై నిలిపి ఉంచడం ఆదే సమయంలో ఒకే బైకుపై ముగ్గురు యువకులు అతి వే గంగా వచ్చి ట్రాక్టర్‌ను ఢీ కొట్టడంలో బైకు ఉన్న నద్దునూరి శ్రీకాంత్ , నర్సింహులు , చనిపోగా మరో యువకుడు శ్రీను ను ఆసుపత్రికి తరలించి వైద్యం ఆందిస్తున్నారు. సమచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదనికి గల వివరాలను పరిశీలించారు. మృతదేహలను పోస్తుమార్టన్ నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అడవి శ్రీరాంపూర్‌కు గ్రంథాలయం మంజూరు



**ప్రజాపక్షం/ముత్తారం:** హైదరాబాద్‌లోని తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబును పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామ సర్పంచ్ కొట్టె అన్నపూర్ణ ఉపేందర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులపై మంత్రి శ్రీధర్ బాబుతో చర్చించారు. గ్రామ అభివృద్ధిని కాంక్షిస్తూ సర్పంచ్ చేసిన విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించారు. అడవి శ్రీరాంపూర్ గ్రామానికి ఒక గ్రంథాలయాన్ని తక్షణమే మంజూరు చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. గ్రామ విద్యార్థులు, యువత భవిష్యత్తుకు ఉపయోగపడేలా గ్రంథాలయాన్ని తక్షణమే మంజూరు చేయడంపై, అలాగే సీసీ రోడ్ల నిధుల హామీపై సర్పంచ్ కొట్టె అన్నపూర్ణ ఉపేందర్ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## భూసమస్యల పరిష్కారానికే రీ సర్వే

భూ భారతి రీసర్వేతో ఏండ్ల నాటి అక్రమ పట్టాలు, భూవివాదాలకు విముక్తి

కలెక్టర్ కట్టా హైమావతి



**ప్రజాపక్షం/అక్కన్నపేట:** భూసమస్యలకు శాశ్వత పరిష్కారమే రీ సర్వే అని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అన్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని కేశవాపూర్ గ్రామ పరిధిలో రెవెన్యూ అధికారుల నేతృత్వంలో కొనసాగుతున్న భూ భారతిభూ సర్వేను కలెక్టర్ ఆకస్మికంగా పర్యవేక్షించారు. భూముల సర్వే చేపట్టిన తీరును రైతులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూములు రీసర్వే చేయడం వల్ల భూవివాదాలు తొలగి అనేక ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. ఏండ్ల తరబడి మోకాపై సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు ప్రభుత్వం లబ్ది చేకూర్చనుందని, అక్రమంగా పట్టాలు పొంది ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందుతున్న వారికి ఇకపైన రద్దయ్యేలా చర్యలు చేపడతామని, నిజమైన రైతులకు న్యాయం చేసేందుకే రీసర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను చూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ పట్టాలు, ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో రీసర్వేతో పాటు సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందన్నారు. ప్రభుత్వ, అటవీ, ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన పట్టా భూములను సమగ్రంగా సర్వే చేసి, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా భూముల హద్దులను గుర్తించి పారదర్శకంగా వివరాలను నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాంమూర్తి, తహశీల్దార్ మదుసూధన్, సర్వేయర్లు, రెవెన్యూ యంత్రాంగం వున్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు

విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత

అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని ఎఫ్‌సిఐ బైపాస్ రోడ్డు, దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ నుండి ఎంబి గార్డెన్స్ వరకు రూ.1.80 కోట్లతో చేపట్టనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు కళ్యాణలక్ష్మి, ముఖ్య మంత్రి సహాయ నిధి, తెల్ల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత గ్యాస్ సిలెండర్లు వంటి ప్రభుత్వ పథకాలు ఖచ్చితంగా అందాలన్నారు. ఇండ్లు కేటాయించేటప్పుడు గుడిసెలలో నివసించే నిరుపేదలకు మొదటి ప్రాధా న్యతనివ్వాలని సూచించారు. డివిజన్లలో అవసరమైన డ్రైన్లు, రోడ్లు, పార్కులు, మంచినీటి వసతి, విద్యుత్ లైన్లు వంటి మౌలిక వసతుల కల్ప నకు సంబంధించిన పనులు మంజూరు చేయించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పేదరికం నుండి శాశ్వత విముక్తి పొందెందుకు చదువు ఒక్కటే మార్గమన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో ఖమ్మంలో మోడల్ స్కూళ్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో పాటు తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.1.25 లక్షలు ఖర్చు చేస్తూ ఉచితంగా ఇంగ్లీష్ మీడియం విద్య, వసతి, పుస్తకాలు, దుస్తులు అందిస్తుందన్నారు. ఖమ్మం నగరంలో కబ్జాలు, దౌర్జన్యాలు, పోలీస్ కేసుల ఇబ్బందులు లేకుండా ప్రజలంతా సుఖ సంతోషాలతో ప్రశాంతంగా జీవిం చాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. దసరా పండుగ సందర్భంగా మహిళ లకు ముఖ్యమంత్రి కానుకగా చిలకపచ్చ చీరెల పంపిణీ చేయనున్నట్లు తెలి పారు. అభివృద్ధికి ప్రజలంతా తమ వంతు బాధ్యతగా సహకరించాల న్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, అధికారులు, రాయల నాగేశ్వరరావు, నాగండ్ల దీపక్ చౌదరి, బాలగంగాధర్ తిలక్, బానాల లక్ష్మణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## జగదీష్‌ను పరామర్శించిన మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇటీవల ప్రమాదానికి గురైన తిరుమలాయ పాలెం సబ్ ఇన్‌స్పెక్టర్ కూచిపూడి జగదీష్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం వారి నివాసంలో పరామర్శించారు. జగదీష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైచౌదరి, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి ఖాదర్‌బాబా, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, ఖమ్మం నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, తుపాకుల యలగొండ స్వామి, సాధు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



## సమయానుగుణంగా బస్సు సర్వీసులు నడపాలి

ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిఎంకు వినతి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యార్థుల కళాశాలల సమయానికి అనుగుణంగా ఆర్టీసి బస్సు సర్వీసులు నడపాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బూర మనోజ్ కోరారు. సోమవారం ఎఐఎస్ఎఫ్ ఏన్కూరు మండల సమితి ఆధ్వర్యంలో ఆర్టీసి డిప్యూటీ మేనేజర్ గౌతమికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బూర మనోజ్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలల నుంచి రాక ముందే ఆర్టీసి బస్సులు నడపడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమయానికి అనుగుణంగా బస్సు సర్వీస్ వేళలను మార్చాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రత్యేక సర్వీసులను నడపాలన్నారు. తక్షణమే ఆర్టీసి అధికారులు స్పందించి ఏన్కూరు, తిమ్మరావుపేట, ముచ్చర్ల మీదుగా ఖమ్మం వెళ్లే బస్సు సర్వీసుల సమయాలను మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శివ మనోహర్, జిల్లా సహాయ కార్యదర్శి సాయి, జిల్లా సమితి సభ్యులు కోటి, ఈశ్వర్, ఏన్కూరు మండల సమితి నాయకులు ఉదయ్, సాయిరాం, సాయికుమార్, కిరణ్, హరీష్ పాల్గొన్నారు.

## ఏరియా ఆస్పత్రికి రూ.15 లక్షల పరికరాలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** నాలుగు రాష్ట్రాల కూడలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి రూ.15ల విలువైన వైద్య పరికరాలను ఐటిడిఏ నిధుల నుండి అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ తెల్లం వెంకట్రావుతో పాటు ఐటిడిఏ పిఓ రాహుల్ మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రికి అవసరమైన ఆధునిక పరికరాలు సమకూర్చడం ద్వారా పేద మధ్య తరగతి ప్రజలకు చక్కటి వైద్య సేవలు అందుతాయన్నారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రిని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. అందించిన వైద్య పరికరాలను సద్వినియోగం చేసుకుని రోగులకు మెరుగైన సేవలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎంహెచ్ఓ డా. సైదులు, సూపరింటెండెంట్ డా. రాజశేఖర్, వైద్యులు జగదీష్, మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి



**ప్రజాపక్షం/చుంచుపల్లి :** మండలంలోని చుంచుపల్లి తండాకు చెందిన ధరావత్ హరికృష్ణ (37) ఆదివారం అర్ధ రాత్రి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. హౌసింగ్ బోర్డు నుంచి చుంచుపల్లి తండాకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గమధ్యంలో వాహనం అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో హరికృష్ణ మద్యం సేవించి ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అయితే అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా వెళ్తున్న హరికృష్ణ ప్రమాదానికి గురై మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా దాడి చేసి అనంతరం ప్రమాదంగా చిత్రీకరించి ఉండొచ్చని మృతుడి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కోణంలోనూ పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేయాలని బంధువులు కోరుతున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రమాదం జరిగిన తీరుతోపాటు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.



## విద్యార్థుల అభ్యసనకు అనుకూల వాతావరణం : కలెక్టర్ అంకిత్

**ప్రజాపక్షం/జూలూరుపాడు :** జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, పరీక్షల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, పోషకాహారం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఏ1 పరీక్షలను కలెక్టర్ పరిశీలించారు. వివిధ తరగతుల విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును గమనించి, వారు రాస్తున్న ప్రశ్నపత్రాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల అభ్యసన స్థాయి తదితర వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మొత్తం 73 మంది విద్యార్థులు ఉండగా, సోమవారం 62 మంది విద్యార్థులు హాజరైనట్లు ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. ఈ తనిఖీల సందర్భంగా కలెక్టర్ వెంట తహశీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ జుంకీ లాల్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మద్దతు ధరకు పకడ్బందిగా పత్తి కొనుగోళ్లు

జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కనీస మద్ధతు ధరకు కొనుగోళ్లు సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖాధికారులతో పత్తి కనీస మద్దతు ధర కొనుగోళ్ల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు. పత్తి సాగు విస్తీర్ణం, అంచనా దిగుబడి, కొనుగోలు కేంద్రాలు, రైతుల నమోదు, నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతం, వెయిమెంట్, చెల్లింపులు, భద్రత తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2026–27 సీజన్‌కు పత్తి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) క్వింటాకు రూ.8667గా నిర్ణయించిందన్నారు. గత సీజన్‌లో రూ.8,110 ఉండగా ప్రస్తుతం రూ.557 పెంచినట్లు తెలిపారు. మీడియం పత్తికి క్వింటాకు రూ.8267, లాంగ్ స్టేపుల్ పత్తికి క్వింటాకు రూ.8667 మద్దతు ధరగా నిర్ణయించబడిందన్నారు. ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది 235637 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పత్తి కొనుగోళ్లలో వ్యవసాయ శాఖ కీలక పాత్ర పోషించాలన్నారు. నిజమైన పత్తి రైతులను గుర్తించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. కౌలు రైతులను తాత్కాలికంగా డేటాబేస్‌లో నమోదు చేసే విధానాన్ని అమలు చేయాలన్నారు. పత్తి సాగు చేస్తున్న రైతుల వివరాలను ఎన్ఐసి ద్వారా కపాస్ కిసాన్ యాప్‌కు బదిలీ చేసే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పత్తి కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవరమైన అంతర్ జిల్లా మ్యాపింగ్ ప్రతిపాదనలను ముందుగానే ఖరారు చేసి సిసిఐ పరిశీలనకు పంపాలన్నారు. రైతులు తమ పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావడానికి ముందే తేమ శాతాన్ని పరిశీలించుకునేలా జిల్లాలో 128 రైతు వేదికల్లో మాయిశ్చర్ మీటర్లు అందుబాటులో ఉంచాలన్నారు. సిసిఐ అధికారులు పత్తి కొనుగోలు స్లాట్లను, ప్రారంభ వివరాలను కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అధికారి, మార్కెట్ కమిటీ కార్యదర్శులకు ముందుగానే అందించాలన్నారు. ఈ ఏడాది పత్తి కొనుగోళ్ల కోసం ఎనిమిది జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటీఫై చేసినట్లు తెలిపారు. ఖమ్మం, మద్దులపల్లి, వైరాప్రాంతాల్లో నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లకు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జిన్నింగ్ మిల్లుల్లో అగ్నిమాపక భద్రతా పరికరాల తనిఖీలను పూర్తి చేయాలన్నారు. వేయింగ్ బ్రిడ్జిలను తరచూ తనిఖీలు చేస్తూ ఖచ్చితమైన తూకం జరిగేలా చూడాలన్నారు. రవాణా సమయంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పోలీస్, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.

# రాజకీయాలను దిగజారుస్తున్న బజారు భాష

సమస్యల మళ్లింపుకే ఆస్తుల ఆరోపణలు

ప్రజల పాత్ర లేని దిశగా ప్రజాస్వామ్యం

ఐజెయు మీట్ ద ప్రెస్‌లో సిపిఎం నేత తమ్మినేని



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలో అధికార, విపక్ష నేతలు వాడుతున్న బజారు భాష రాష్ట్ర రాజకీయాలను దిగజారుస్తుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపి తమ్మినేని వీరభద్రం తెలిపారు. గౌరవనీయ భాష ప్రయోగించకుండా నీచ పదజాలం రాజకీయాల్లో సరైందికాదని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించుకే భూ కబ్జాలు, ఆక్రమణల వ్యవహారాన్ని తెరపైకి తెస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. సోమవారం టియుడబ్ల్యూజె(ఐజెయు) ఆధ్వర్యంలో తమ్మినేనితో మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ సమన్వయ కర్తగా వ్యవహరించగా టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని మాట్లాడుతూ నేతల భాష ఆక్షేపణీయమని ఈ భాష సరైంది కాదన్నారు. విమర్శించడానికి ఈ పద్ధతి తగదని ఆయన కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు సూచించారు. రాష్ట్రంలో రెండు పార్టీల మధ్య భూ ఆక్రమణలు, అక్రమ సంపాదనలకు సంబంధించి పరస్పర విమర్శల పర్వం సాగుతుందని కేవలం ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడానికే పథకం ప్రకారం రెండు పార్టీలు వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. పాపాలు చేయడంలో రెండు పార్టీలు సమానమేనని రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యుల భూ వ్యవహారాలకు సంబంధించి బిఆర్ఎస్ కేవలం ఆరోపణలకే పరిమితం అవుతుండగా అధికారం చేతిలో ఉన్న కాంగ్రెస్ కూడా కేవలం ఆరోపణలు మాత్రమే చేస్తుందని ఈ వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. అధికారం చేతిలో ఉన్నప్పుడు భూములు పంచేందుకు జంకెందుకని తమ్మినేని ప్రశ్నించారు. హామీలు అమలు పరచలేని కాంగ్రెస్ వల్ల కార్యాచరణ లేని బిఆర్ఎస్ వల్ల, ఈ రాష్ట్ర ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారతదేశంలో ప్రజల పాత్ర క్రమేపి తగ్గిపోతుందన్నారు. ఒకప్పుడు రిగ్గింగులు, ఓట్ల కొనుగోలు, ఇప్పుడు గెలిచిన అభ్యర్థులను కొనుగోలు చేయడం ఏకంగా ఓటింగ్ మిషన్ల ద్వారా ఓట్లను సానుకూలంగా వేయించుకునే పద్ధతికి తెరలేపారన్నారు. ఎన్నికల ఫలితాలను ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా తీసుకు వచ్చే ప్రయత్నంలో బిజెపి 2024లోనే సఫలీకృతమైనట్లు అనేక సర్వేలు చెబుతున్నాయన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం పాలన సాగడం లేదని ప్రజల విమర్శకు కనీసం సమాధానం చెప్పే స్థితిలో కేంద్ర ప్రభుత్వం లేదన్నారు.
ఎవరైనా విమర్శిస్తే దేశ ద్రోహులుగా ముద్రిస్తున్నారని తమ్మినేని ఆరోపించారు. బిఆర్ఎస్ కూడా ప్రకటనలకే పరిమితం అవుతుంది తప్ప కార్యాచరణ ప్రకటించడం లేదన్నారు. రాష్ట్రంలో మూడో ఫ్రంట్‌కు అవకాశం లేదని తమ్మినేని తెలిపారు. కమ్యూనిస్టుల సమీకరణ శక్తి తగ్గుతుందన్న ప్రశ్నకు తమ్మినేని సమాధానం ఇస్తూ సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవహారాల్లో వచ్చిన మార్పులు కొంత కారణమని, కానీ ప్రజల సమస్యలపై నిరంతర ఆందోళనలు చేస్తూనే ఉన్నామన్నారు.



## అంగన్వాడీ పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కలెక్టరేట్ ముందు ఎఐటియుసి ధర్నా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గత ఏడాది కాలంగా పెడింగ్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. రాష్ట్రపిలుపులో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటియూసి రాష్ట్రకార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అంగన్వాడీ టీచర్లు హెల్పర్లు సొంత నిధులతో కేంద్రాలను నడపలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా నెలకు రూ.18వేల వేతన పెంపును వెంటనే అమలు చేయాలన్నారు. దసరా పండుగ సెలవులు కేంద్రాలకు మంజూరు చేయడంతో పాటు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన రిటైర్మెంట్ బెన్ఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా నాయకులు వెల్పుల మల్లిఖార్జున్, భూక్యా శ్రీనివాస్, గోనె మణి, రెడ్డి అరుణ, భూక్యా లలిత, విజయ, భారతి, సంధ్య, ప్రమీల, చిన్నారి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## పాల్వంచ అభివృద్ధికి ఐక్యంగా ముందుకు సాగుదాం

అఖిలపక్ష సమావేశంలో సిపిఐ నాయకుడు వీసంశెట్టి

**ప్రజాపక్షం/పాల్వంచ:** స్థాని శాశన సభ్యులు కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో పాల్వంచలో మరో రెండు 800 మెగావట్లా సామర్థ్యం కలిగిన విద్యుత్ ప్లాంట్ల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగుదామని దీనికి సిపిఐ మండల పార్టీ సంపూర్ణ సహకారం ఉంటుందని సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు అన్నారు. స్థానిక కేటిపిఎస్ ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్‌లో పాల్వంచలో నూతనంగా 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు ప్లాంట్లను నిర్మించాలని సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. పాల్వంచ పట్టణ, మండల ప్రాంతాల అభివృద్ధిపై, అనుసరించాల్సిన, తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. పలు దఫాలుగా అసెంబ్లీలో సైతం ప్రస్తావించనట్లు పేర్కొన్నారు. పాల్వంచ అభివృద్ధికి భారత కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పోరేటర్లు, సాధన సమితి అధ్యక్షులు, కన్వీనర్ జమ్ముల సీతా రాంరెడ్డి, మంగీలాల్, అఖిలపక్ష నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి వాస్తవ లాభాలు ప్రకటించి 40శాతం కార్మికులకు ఇవ్వాలి

జెన్‌కో బకాయిలు రూ.59వేల కోట్లు వెంటనే ఇప్పించాలి

ఎఐటియుసి ఆధ్వర్యంలో పలు గనులు, కార్యాలయాల వద్ద ధర్నాలు

**ప్రజాపక్షం/ఇల్లందు :** సింగరేణి 2025–26 ఆర్థిక సంవత్సరం వాస్తవ లాభాలను ప్రకటించి 40శాతం కార్మికులకు లాభాలు వాటాగా చెల్లించాలని ఎఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం జెకెఓసిపి, కెఓసి, జిఎం కార్యాలయం, ఏరియా వర్క్‌షాప్, సివిల్, ఎస్‌అండ్‌పిసి, ఏరియా స్టోర్, ఆసుపత్రి వద్ద ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్ మాట్లాడుతూ సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా ఇవ్వడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. సంస్థ లాభాల్లో కార్మికులకు 40శాతం వాటా ప్రకటించి చెల్లించాలని కోరారు. ఉత్పత్తి, కార్మికుల భద్రతకు అవసరమైన మెటీరియల్, పరికరాల కొరత నెలకొనడం ఆందోళనకరమన్నారు. తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో నుంచి సింగరేణికి రావాల్సినట్లు పేర్కొంటున్న రూ.59వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సమితి సభ్యుడు గుగులోత్ కృష్ణ, ఫిట్ కార్యదర్శులు మాలోత్ హరిసింగ్, దాట్ల వెంకటేశ్వర్లు, కలవల సిద్ధార్థ్, జక్కుల శ్రీనివాస్, నూనావత్ లచ్చిరామ్, చాంద్‌పాషా, చెరుకు సారయ్య, చిక్కా శ్రీనివాస్, పి.యుగేందర్, విజయ్ శ్రీనివాస్, గుగ్గిల్ల శ్రీనివాస్, మంగపతిరావు, కొంటు వీరస్వామి, మేగరాజు, ముఖ్బుల్ షరీఫ్, రావూజీ, గుగులోత్ వీరన్న, రవి, బట్టు రవి, వెంకటరెడ్డి, జర్పుల నరేష్, సంతోష్‌కుమార్, సింధుప్రియ, రహమత్, రజనీ, స్వరూప, అపర్ణ, మౌనిక, సుమలత, భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## సుజాతనగర్‌కు అభివృద్ధి పనుల జోరు

రూ.5.50కోట్లతో 20, 21, 23 డివిజన్లలో పనులకు నేడు శంకుస్థాపన

**ప్రజాపక్షం/సుజాతనగర్ :** సుజాతనగర్ ప్రాంతంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్ మూడు గణేష్ తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, పారిశుధ్యం, ప్రయాణికుల సౌకర్యాలు తదితర మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సుజాతనగర్ మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో మేయర్ మూడు గణేష్ మాట్లాడారు. సుజాతనగర్ పరిధిలోని 20, 21, 23 డివిజన్లలో రూ.5.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఉదయం 10 గంటలకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్ల అభివృద్ధి, అవసరమైన చోట డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. సిపిఐ మండల కార్యదర్శి కోమరి హనుమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్య దస్రు, జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి తాళ్లూరి ధర్మారావు, లావుడియా గోపి, ఎఐటియుసి మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, సుజాతనగర్ టౌన్ సెక్రటరీ బొడ్డు కేశవరావు, సిపిఐ నాయకులు గడ్డం రాజేందర్, కోమరి కృష్ణ పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

తెలంగాణ రక్షణ సేన

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రభుత్వాస్పత్రిలో ఇన్ పేషన్ అవుట్ పేషంట్ రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు సముద్రాల క్రాంతికుమార్ అన్నారు. సోమవారం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిని టిఆర్ఎస్ ఆధ్వర్యంలో సందర్శించారు. ఆ స్పత్రిలో వైద్య సేవలు, బెడ్ల లభ్యత మౌలిక సదుపాయాలు పారిశుధ్య పరిస్థితులు తాగునీరు తదితర అంశాలపై రోగులను వారి సహాయకులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ఆస్పత్రి సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వీరన్న, కమల గాయత్రి సురేష్ జగదీష్ పాల్గొన్నారు.

## కార్మికులకు 40 శాతం లాభాల వాటా ప్రకటించాలి : ఎఐటియుసి

**ప్రజాపక్షం/చుంచుపల్లి :** కార్మికులు చెమటోడ్చి సాధించిన లాభాల్లో 40 శాతం వాటాను వెంటనే ప్రకటించి చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం సింగరేణి వ్యాప్తంగా గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద కార్మికుల సమస్యలపై యాజమాన్యానికి వినతిపత్రాలు సమర్పించారు. ఇందులో భాగంగా కొత్తగూడెం, కార్పోరేట్ ఏరియాలోనూ వినతిపత్రాలు అందజేశారు. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు 40 శాతం లాభాల వాటా చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణి అభివృద్ధికి, బొగ్గు ఉత్పత్తికి కార్మికుల శ్రమ కీలకమని, వారి కృషితో సంస్థకు లాభాలు వస్తున్నప్పుడు ఆ లాభాల్లో కార్మికులకు తగిన వాటా ఇవ్వడం యాజమాన్యం బాధ్యత అని పేర్కొన్నారు. గతంలో కొనసాగిన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గుర్తింపు పొందిన కార్మిక సంఘంతో చర్చించి లాభాల వాటాను ప్రకటించాలని కోరారు. అదేవిధంగా సింగరేణిలో ఉత్పత్తి, కార్మికుల భద్రతకు అవసరమైన మెటీరియల్, పరికరాల కొరత ఏర్పడుతున్నట్లు కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మెటీరియల్ కొనుగోలుకు నిధుల కొరత ఉందని యాజమాన్యం పేర్కొనడం ఆందోళనకరమన్నారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనతోపాటు కార్మికుల ప్రాణ రక్షణకు అవసరమైన పరికరాలు, మెటీరియల్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో కార్మికులకు చెల్లించాల్సిన పండుగ అడ్వాన్స్, లాభాల వాటా, దీపావళి బోనస్, పీఎల్ఆర్ఎస్ వంటి ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో చెల్లించాలని కోరారు. చెల్లింపుల్లో జాప్యం జరిగితే కార్మికులు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందని తెలిపారు. సింగరేణికి తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల నుంచి సుమారు రూ.59 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉందని ఏఐటీయూసీ పేర్కొంది. కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జక్కుల గట్టయ్య, ఉపాధ్యక్షులు కత్తెర్ల రాములు, క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి రాము, ఆఫీస్ బేరర్స్ గుమ్మడి వీరయ్య, హీరాలాల్, హుమాయూన్, ఎస్.నాగేశ్వరరావు, నాగయ్య, నితిన్, పిట్ కార్యదర్శులు భూక్య రమేష్, మధుకృష్ణ, కమల్, సురేందర్, మెంగన్ రవి, కోటి, నరేష్, సుధీర్, అంతలక్ష్మి , రమేష్, మల్లికార్జున్, శ్యాం కిరణ్ పాల్గొన్నారు.

# బిహార్‌లో మరోసారి ఉద్రిక్తత




**పట్నా:** బిహార్‌లో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) మెయిన్స్ పరీక్ష రద్దు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. వందలాది మంది ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి అధికారిక నివాసం వరకు సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. శారీరక సామర్థ్య పరీక్ష తేదీలను ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. గత 10 రోజులుగా గార్దని బాగ్ నిరసన ప్రదేశంలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఈ అభ్యర్థులు, తమ సమస్యలపై యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ రోడ్ల పైకి వచ్చారు. 1,799 సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల కోసం జనవరిలో ప్రిలిమినరీ పరీక్షలు, మే 28న మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించిన తర్వాత, గత నాలుగు నెలలుగా తాము కఠినమైన శారీరక శిక్షణ పొందుతున్నామని నిరసనకారులు తెలిపారు. అయితే, శారీరక సామర్థ్య పరీక్ష (పిఇటి) జరగడానికి కొద్ది రోజుల ముందు, ''అనివార్య కారణాల''ను సాకుగా చూపి అధికారులు ఆ పరీక్షను హఠాత్తుగా రద్దు చేశారు.

# ఆ మూడు డిమాండ్లపై రాజీలేదు

- సిఇసి రాజీనామా చేయాలి, సర్‌ను రద్దు చేయాలి
- ఇవిఎంలకు బదులు బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు జరపాలి : కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే



**న్యూఢిల్లీ :** ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన మూడు అంశాలపై కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని మరింత స్పష్టం చేసింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) రద్దు, ఇవిఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించడం, ఈ మూడు డిమాండ్ల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. వీటిని పార్టీ రాజీలేని డిమాండ్లుగా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఈ మూడు అంశాలపై కాంగ్రెస్ కార్యకర్తలు, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలు ఆందోళనలు చేస్తున్నాయని ఖర్గే తెలిపారు. ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాలపై పోరాడుతున్న పౌర సమాజ సభ్యులు, యువజన సంఘాలకు కూడా కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందని చెప్పారు. మరోవైపు, బిజెపి శ్రేణులు ఢిల్లీలో మహిళా జర్నలిస్టులను వేధించడం తీవ్రంగా ఖండించదగినదని ఖర్గే అన్నారు. ఆ నియంత తీవ్ర భయాందోళనలో ఉన్నారని, దృష్టి మరల్చే వారి ఎత్తుగడలలో మరో అధ్యాయానికి మనమంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఎక్స్‌లో ఖర్గే సోమవారం చేసిన పోస్టులో కాంగ్రెస్ డిమాండ్లను వరుసగా ప్రస్తావించారు. మొదటగా సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రెండోది ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరారు. మూడోది ఇకపై ఎన్నికలను బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించాలని పేర్కొన్నారు. ఆ మూడు అంశాలపై దేశవ్యాప్తంగా తమ పార్టీ, ఇండియా కూటమి భాగస్వామ్యాలు ఉద్యమిస్తున్నాయని ఖర్గే చెప్పారు. వివిధ ప్రాంతాల్లో ఇదే అంశాలపై ఆందోళనలు చేస్తున్న పౌర సమాజం, యువజన సంఘాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని వెల్లడించారు.

### ఆర్‌ఎస్‌ఎస్-బజరంగ్ దళ్

# గూండాల దాడి హేయం

ఖండించిన సిపిఐ



**న్యూఢిల్లీ:** సిపిఐ మెదినీపూర్ జిల్లా కార్యాలయంపై ఆర్‌ఎస్‌ఎస్, బజరంగ్ దళ్ గూండాలు జరిపిన కిరాతదాడిని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. 'దుండగులు బలవంతంగా సిపిఐ కార్యాలయంలోకి ప్రవేశించి, ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి, కార్యాలయానికి నిప్పు పెట్టడానికి ప్రయత్నించారు. ఇటువంటి బరితెగించిన రాజకీయ హింస ప్రజాస్వామ్యంపైనే దాడి. ఎస్ఐఆర్ ద్వారా లక్షలాది ఓటర్లను తొలగించి పశ్చిమ బెంగాల్‌లో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రం ఆందోళనకరమైన అరాచక స్థితిలోకి జారిపోయింది. రాజకీయ ప్రత్యర్థుల కార్యాలయాలు, నాయకులపై దాడులు పెరుగుతున్నాయి. ఇది పశ్చిమ బెంగాల్‌లో ప్రజాస్వామ్యానికి, రాజకీయ స్వేచ్ఛకు ఆందోళనకరమైన పరిస్థితిని సష్టిస్తోంది. ప్రజాస్వామ్యంలో ఇటువంటి హింసకు, బెదిరింపులకు, బీభత్సానికి తావు లేదు. బెదిరింపులకు, దాడులకు సిపిఐ భయపడదు. భౌతిక దాడుల ద్వారా వామపక్షాలను అణచివేసే ప్రయత్నాలు, ప్రజలతో నిలబడి వారి హక్కుల కోసం పోరాడాలనే మా సంకల్పాన్ని మరింత బలపరుస్తాయి. సిపిఐ ప్రజల సమస్యలను లేవనెత్తడం, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించడం, హింస, బెదిరింపుల ద్వారా రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రతి ప్రయత్నాన్ని ప్రతిఘటించడం కొనసాగిస్తుంది' అని పేర్కొంది.

### మహిళలపై నేరాలకు పాల్పడే గూండాల

# మనసుల్లో భయం సృష్టించాలి



ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో జరిగిన అత్యాచార ఘటనలపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** మహిళలపై నేరాలకు పాల్పడే గూండాల మనసుల్లో భయం సృష్టించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ముఖ్యంగా ఢిల్లీలోని కొన్ని సున్నితమైన ప్రాంతాల్లో మహిళలకు భద్రత లేదనే భావన ఉందని అభిప్రాయపడింది. ఢిల్లీలో అసాంఘిక శక్తులు లైంగిక నేరాలకు పాల్పడకుండా నిరోధించడానికి కఠినమైన చర్యలు, మరింత పటిష్టమైన పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించింది. ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో ఇటీవల జరిగిన అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారిస్తున్న సందర్భంగా దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. 'మనం (పోలీసులు, అధికారులు, న్యాయవ్యవస్థ) కలిసికట్టుగా పనిచేయాలి. ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లోని ప్రతి మహిళ రాత్రి 11 గంటలకు రోడ్లపై ప్రయాణిస్తున్నా, మెట్రోలో వెళ్తున్నా తాను సురక్షితమని భావించేలా మనం చూడాలి. నేరం జరగకుండా నిరోధించడమే ముఖ్యం. నేరం జరిగిన తర్వాత ఏం చేశారన్నది కాదు. మహిళలపై అత్యాచారాలు వంటి నేరాలకు పాల్పడే గూండాలు, సంఘ విద్రోహ శక్తుల మనసుల్లో పోలీసులు భయం సృష్టించాల్సిన అవసరం ఉంది' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

**ఢిల్లీలో నేరాలను అరికట్టడం అత్యవసరం : సుప్రీంకోర్టు**

మహిళలు, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తులను నిరోధించడానికి ఢిల్లీలో మరింత కఠినమైన, పటిష్టమైన పోలీస్ వ్యూహం అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. సమర్థవంతమైన పోలీసు వ్యవస్థ ద్వారా నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నవారిలో భయం కలిగించాలని పేర్కొంది. దేశ రాజధాని నగరమైన ఢిల్లీలో నేరాలను అరికట్టడం అత్యవసరమని తెలిపింది. క్షేత్రస్థాయిలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాలని ఢిల్లీ పోలీసులకు సూచించింది. నేరాలకు పాల్పడటానికి ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భావన నేరస్థుల్లో కలిగించాలని కోరింది. 'ఏదైనా నేరం చేస్తే చచ్చిపోతామని గూండాలు ఆలోచించేలా చేయాలి. అవసరమైనప్పుడు కఠిన చర్యలు తీసుకోవడానికి పోలీసులు వెనుకాడకూడదు. మరింత కఠినంగా, నిక్కచ్చిగా ఉండటానికి అస్సలు సంకోచించవద్దు. ఆర్టికల్ 21 గురించి కొందరు గొడవ చేయవచ్చు. కానీ మహిళల భద్రత గురించి అవసరమైన చర్యలు తీసుకోండి. ఢిల్లీలో అసాంఘిక శక్తులు లైంగిక నేరాలకు పాల్పడకుండా నిరోధించడానికి కఠిన చర్యలు, మరింత పటిష్టమైన పోలీసింగ్ వ్యూహాన్ని అమలు చేయాలి' అని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది.

**'ప్రజా భద్రతలో గస్తీ కీలకం'**

ప్రజా భద్రతను నిర్ధరించడంలో 'బీట్ పెట్రోలింగ్' (గస్తీ) చాలా కీలకమని సుప్రీంకోర్టు తెలిపింది. సిబ్బంది నిరంతరం చురుకుగా గస్తీ నిర్వహించేలా చూడాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. పోలీసు వ్యాన్‌లు ఒకే చోట ఎక్కువ సేపు నిలిపి ఉంచే విధానాన్ని ప్రశ్నించింది. సాధారణ గస్తీలో భాగంగా వాటిని ఎందుకు అటు ఇటు తిప్పడం లేదని అడిగింది. స్థానికులతో నేరుగా మాట్లాడి వారి ఫిర్యాదులను వినాలని పోలీసులను సూచించింది. వీధి దీపాల కొరత, తమ పరిసరాల్లో గూండాల సంచారం వంటి స్థానికుల ఆందోళనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించింది. పండగ సీజన్ సమీపిస్తున్నందున దుర్గా పూజ, దీపావళి వంటి సందర్భాల్లో దుండగుల నేర కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. కాబట్టి అప్రమత్తత, గస్తీని మరింత పెంచాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. చీకటిగా, సరిగా వెలుతురు లేని ప్రాంతాలను లైటింగ్‌ను పెంచడానికి తీసుకున్న చర్యల వివరాలను పోలీసుల నుంచి కోరింది. ముఖ్యంగా మహిళలు, బాలికల భద్రతకు ప్రమాదం కలిగించే అవకాశం ఉన్న సున్నితమైన ప్రదేశాలను గుర్తించాలని సూచించింది. దేశ రాజధాని ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో సామూహిక అత్యాచార ఘటనలు వెలుగుచూశాయి. ఈ వరుస ఘటనలతో దేశ రాజధానిలో మహిళలు, బాలికల భద్రతపై ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఈ అత్యాచార ఘటనలను సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది.

# ప్రశ్నించే ధైర్యం చేస్తే... మహిళల గొంతు నొక్కేస్తున్నారు!

- వారిని చూసి అమిత్ షా ఎందుకు భయపడుతున్నారు?
- ఢిల్లీ పోలీసుల చేతిలో హింసకు గురైన వారికి న్యాయం జరగాలి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ డిమాండ్



**న్యూఢిల్లీ :** ఢిల్లీలో మహిళలపై దాడులకు సంబంధించి బిజెపి సర్కార్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రశ్నించే మహిళలను చూసి హోంమంత్రి అమిత్ షా ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ప్రశ్నలు అడిగే ధైర్యం చేసే మహిళల గొంతు నొక్కే ధోరణి ఢిల్లీలో కనిపిస్తోందని ఆరోపించారు. ఢిల్లీ పోలీసుల చేతిలో హింస, దుష్ప్రవర్తనకు గురైన వారందరికీ న్యాయం జరగాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా సాకేత్‌లోని మాక్స్ ఆసుపత్రిలో కొత్త విభాగాన్ని ప్రారంభించే కార్యక్రమాన్ని కవర్ చేయడానికి వెళ్లిన ఇద్దరు జర్నలిస్టులు, షాహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌లపై సాకేత్ పోలీస్ స్టేషన్‌లో దాడి జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. వారితో తాను ఇటీవల జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోతో పాటు పెట్టిన ఒక పోస్ట్‌లో గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం ఢిల్లీలో ఒకే పద్ధతిని అనుసరిస్తున్నారని, ప్రశ్నలు అడగడానికి సాహసించే ఏ మహిళనైనా అణచివేయడం' అని రాహుల్‌గాంధీ ఎక్స్ ఛానెల్‌లో హిందీలో పెట్టిన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'జంతర్ మంతర్ వద్ద వందలాది మందిని నిర్బంధించారు. పురుష పోలీసు అధికారులు తమతో దురుసుగా ప్రవర్తించారని మహిళా నిరసనకారులు ఆరోపించారు. మహిళా జర్నలిస్టుల నుండి కెమెరాలను లాక్కున్నారు, వారిని ఈడ్చుకెళ్లారు. ఒక జర్నలిస్ట్ ఫిర్యాదుపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు' అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. కొన్ని వారాల క్రితం, సాకేత్ పోలీస్ స్టేషన్ లోపల తాము ఎదుర్కొన్న హింస, దురుసు ప్రవర్తన అనుభవాలను షాహీన్, నఫీసా వివరించారని ఆయన తెలిపారు. మహిళలను రక్షించే బాధ్యత అప్పగించబడిన వారే ఇప్పుడు వారికి ముప్పుగా మారుతున్నారని రాహుల్ పేర్కొన్నారు. ఢిల్లీ పోలీసులు ఎవరికి జవాబుదారీగా ఉంటారో ఈ దేశంలో అందరికీ తెలుసు అని ఆయన అన్నారు. 'సాకేత్ పోలీస్ స్టేషన్‌లోని మొత్తం సిసిటివి ఫుటేజీని బహిరంగపరచాలి. దోషులైన పోలీసు అధికారులపై తక్షణ చర్య తీసుకోవాలి. ఢిల్లీ పోలీసుల చేతిలో హింస, దుష్ప్రవర్తనకు గురైన షాహీన్, నఫీసాతో పాటు అందరికీ న్యాయం జరగాలి. అమిత్ షా గారూ మీరు, మీ పోలీసులు మహిళలకు ఎందుకంత భయపడుతున్నారు?' అని గాంధీ అన్నారు.

# ఢిల్లీ అల్లర్లు, జామియా మిలియా హింసపై పిటిషన్ల కొట్టివేత

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అల్లర్లు (2020), సిఎఎ వ్యతిరేక నిరసనల నేపథ్యంలో జామియా మిలియా ఇస్లామియాలో 2019లో చెలరేగిన హింసపై సిట్ దర్యాప్తు కోరుతూ దాఖలైన వివిధ పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు సోమవారం కొట్టివేసింది. తీర్పులో పేర్కొన్న కారణాల దష్ట్యా, అన్ని పిటిషన్లను కొట్టివేస్తున్నామని జస్టిస్ వివేక్ చౌదరి, జస్టిస్ మనోజ్ జైన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులను రెండు భాగాలుగా విభజించామని, ఒకటి ఈశాన్య ఢిల్లీ అల్లర్లకు సంబంధించినది కాగా, మరొకటి జామియా మిలియా అల్లర్లకు సంబంధించినదని తీర్పును ప్రకటిస్తూ ధర్మాసనం తెలిపింది. వివరణాత్మక తీర్పు వెలువడాల్సి ఉంది. ఈ పిటిషన్లపై జులై 24న కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈశాన్య ఢిల్లీ అల్లర్లకు సంబంధించిన వ్యవహారంలో, సిట్ , విచారణ కమిషన్ లేదా వాస్తవాలను నిర్ధారించే కమిటీని ఏర్పాటు చేయడం, వైద్య చికిత్స, పరిహారం మంజూరు, బాధ్యులైన పోలీసు అధికారులపై ఎఫ్ఐఆర్‌ల నమోదు వంటి అంశాలపై ఆదేశాలు కోరుతూ దాఖలైన పిటిషన్లపై కోర్టు విచారణ జరుపుతోంది. విద్వేషపూరిత ప్రసంగాలపై రాజకీయ నేతలపై, పోలీసు అధికారులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడానికి సిట్‌ను ఏర్పాటు చేయాలని కొన్ని పిటిషన్లలో కోరారు.

### ఎసిపిపై ఎఫ్ఐఆర్‌కు డిమాండ్

# మహిళా జర్నలిస్టు అరెస్టు





**న్యూఢిల్లీ:** ఎసిపి వివేక్ భగత్ తనను లైంగికంగా వేధించారని, అనుచితంగా ప్రవర్తించారని వెల్లడించిన మహిళా జర్నలిస్ట్‌ను సోమవారం పోలీసులు మరోసారి అదుపులోకి తీసుకున్నారు. జర్నలిస్టుతో పాటు మరో 17మందిని అదుపులోకి తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వారిపై పోలీసులు దాడిచేసి, దారుణంగా కొట్టారని సిజెపి న్యాయ వ్యవహారాల అధ్యక్షుడు రత్నసింగ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తమ వారిని కాపాడుకునేందుకు పోలీసులు బాధితురాలిపై, నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న వారిపై దాడి చేస్తున్నారని అన్నారు. ఎసిపిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ, స్వతంత్ర జర్నలిస్టులు, కార్యకర్తలు పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వెలుపల బారికేడ్ల మధ్య వారు నిరసన చేపడుతున్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తుండటంతో స్టేషన్ చుట్టూ భారీగా పోలీసు సిబ్బందిని మోహరించారు. అరెస్టు చేసిన మహిళా జర్నలిస్టును ఢిల్లీ కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్‌లో ఉంచారని సహ జర్నలిస్టులు తెలిపారు. ఎసిపి వివేక్ భగత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ ఒక మహిళా జర్నలిస్ట్ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో కొన్ని గంటల పాటు వేచి చూసిన అనంతరం ఈ నిరసన ప్రారంభమైంది. ఈ నెల 3వ తేదీ సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ జరిగిన నిరసనను తాను కవర్ చేస్తుండగా, ఆ అధికారి తనను లైంగికంగా వేధించారని మహిళా జర్నలిస్ట్ పేర్కొన్నారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహా బోరాను అదుపులోకి తీసుకోవడాన్ని తాను రికార్డ్ చేస్తుండగా ఈ సంఘటన జరిగిందని ఆ జర్నలిస్ట్ ఆరోపించారు. నిరసన సందర్భంగా పోలీసు అధికారులు లైంగిక వేధింపులకు, దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ ముగ్గురు మహిళా జర్నలిస్టులు ఫిర్యాదులు చేశారని ఢిల్లీ పోలీసులు తెలిపారు. నిరసన సమయంలో పోలీసులు శాంతిభద్రతల విధులు నిర్వర్తిస్తున్నారని, విధుల్లో భాగంగా తీసుకున్న చర్యలకు వారిపై కేసులు నమోదు చేయలేమని అన్నారు. విచారణ కోసం ఈ ఫిర్యాదులను క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశామని అన్నారు.

# అరెస్టులు ఉద్యమాన్ని అడ్డుకోలేవు: సిజెపి

- సిఇసి జ్ఞానేశ్ రాజీనామా చేయాల్సిందే
- 10న జంతర్‌మంతర్ వద్ద నిరసనకు దేశమంతా సిద్ధంగా ఉందని వెల్లడి




**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే అణచివేత చర్యలు, అరెస్టులు యువత నేతృత్వంలోని ఉద్యమాన్ని అడ్డుకోలేవని... సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకు ఉద్యమం కొనసాగుతుందని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) స్పష్టం చేసింది. ఎటువంటి పరిణామాలైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. అక్టోబర్ 10న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తలపెట్టిన నిరసనకు ముందు తమను అరెస్టు చేసే అవకాశం ఉందని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) కోకన్వీనర్ ఆశుతోశ్ రాంకా తెలిపారు. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్‌తో పాటు తనను జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) లేదా ఇతర సమాన నిబంధనల కింద అదుపులోకి తీసుకోవచ్చని తమకు సమాచారం అందిందని ఆయన పేర్కొన్నారు. 'ఎక్స్'లో రాంకా ఈ మేరకు పోస్ట్ చేశారు. జూన్ 6 నుంచే జైలుకు వెళ్లేందుకు తాము సిద్ధం గా ఉన్నామని, అరెస్టులంటే తమకు భయం లేదని అన్నారు. ''మమ్మల్ని అరెస్టు చేయొచ్చు.. కొట్టొచ్చు.. చంపేయొచ్చు. కానీ మా ఉద్యమాన్ని ఆపలేరు'' అని రాంకా పేర్కొన్నారు. ప్రభుత్వం భయపడుతోందని, అందుకే హింసకు పాల్పడుతోందని ఆరోపించారు.

**అక్టోబర్ 10న దేశమంతా కదులుతుంది: అభిజిత్ దీప్కే**

మరోవైపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మండిపడ్డారు. అక్టోబర్ 10న నిరసన తెలిపేందుకు దేశమంతా సిద్ధంగా ఉన్నప్పుడు, ఆయన ఎంత మందిని అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. 'అమిత్ షా మీరు ఎంత మందిని అరెస్టు చేస్తారు? అక్టోబర్ 10న దేశమంతా కదులుతోంది' అని 'ఎక్స్'లో దీప్కే పోస్ట్ పెట్టారు.

**ముంబయి నిరసనపై కేసు**

ఇటీవల అక్టోబర్ 2న ముంబైలోని శివాజీ పార్క్ వద్ద సిజెపికార్యకర్తలు నిరసనకు దిగారు. అనుమతి లేకుండా సభ నిర్వహించడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం, నినాదాలు చేయడం, అనుమతి లేకుండా లౌడ్‌స్పీకర్లు ఉపయోగించారన్న ఆరోపణలతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అందులో సిజెపినేతలు అభిజీత్ దీప్కే, ఆశుతోశ్ రాంకా, సౌరవ్ దాస్ తదితరుల పేర్లు ప్రస్తావించారు. సౌరవ్ దాస్ కూడా తమను అరెస్టు చేసే అవకాశం ఉందని ఆరోపిస్తూ... నేతలను అదుపులోకి తీసుకున్నా ఆందోళనలు కొనసాగించాలని మద్దతుదారులకు పిలుపునిచ్చారు. కాగా, ముంబై నిరసనకు నటుడు నసీరుద్దీన్ షా, విశాల్ దద్లానీ తదితరులు మద్దతు తెలిపారు.

# డిజిసిఎ అధికారి, విమానయాన డైరెక్టర్ అరెస్టు

విమానానికి సర్టిఫికేషన్ కోసం లంచం డిమాండ్

**చెన్నై:** విమానం ఎయిర్‌వర్తినెస్ సర్టిఫికేషన్ కోసం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ ) అధికారి లంచం డిమాండ్ చేశారు. ఒక విమానయాన సంస్థ డైరెక్టర్ నుంచి రూ.2.5 లక్షలు తీసుకున్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) దష్టికి ఇది వెళ్లింది. ఈ నేపథ్యంలో డిజిసిఎ అధికారితో పాటు విమానయాన సంస్థ డైరెక్టర్‌ను అరెస్ట్ చేసింది. చెన్నైలో ఈ సంఘటన జరిగింది. ఏక్వి ఎయిర్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌కు చెందిన ఒక ట్రైనింగ్ ఫ్లైట్‌కు ఎయిర్‌వర్తినెస్ సర్టిఫికేషన్ సంబంధించి చెన్నై డిజిసిఎ డిప్యూటీ డైరెక్టర్ (ఎయిర్‌వర్తినెస్) సుశీల్ కుమార్ గార్గ్ లంచం డిమాండ్ చేశారు. ఇది సిబిఐ దష్టికి వెళ్లింది. కాగా, ఆ విమానయాన సంస్థ డైరెక్టర్ సచిన్ కేశవ్ భానే నుంచి డీజీసీఏ అధికారి సుశీల్ కుమార్ గార్గ్ రూ.2.5 లక్షలు లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో వారిద్దరిని అరెస్ట్ చేశారు. విమానాల ఎయిర్‌వర్తినెస్ సర్టిఫికేషన్‌లో అనుచిత సహాయం అందించినందుకు ప్రతిఫలం ఆశించడం, చట్టవిరుద్ధంగా లంచం డిమాండ్ చేసి స్వీకరించడం వంటి ఆరోపణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఢిల్లీ కాల్పుల కేసులో ఇద్దరు అరెస్టు

**న్యూఢిల్లీ:** ఢిల్లీ భజన్‌పురా ప్రాంతంలో జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించి సోమవారం తెల్లవారుజామున పోలీసులు ఇద్దరు అనుమానితులను అరెస్టుచేశారు. వారు గ్యాంగ్‌స్టర్ రషీద్ అలియాస్ కేబుల్‌వాలా అనుచరులు మహమ్మద్ జెసీమ్, మహమ్మద్ కైఫ్‌గా గుర్తించారు. నిందితుల నుంచి మూడు సెమీ ఆటోమెటిక్ పిస్టల్స్, 18 లైవ్ క్యాట్రిడ్జ్‌లు, నెంబర్ ప్లేట్ లేని ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. తమ విచారణలో గ్యాంగ్‌స్టర్ కేబుల్‌వాలా ఆదేశాల మేరకు భజన్‌పురా ప్రాంతంలో ఒక వ్యక్తిపై కాల్పులు జరిపినట్లు వారు ఒప్పుకున్నారని పోలీసులు వెల్లడించారు.ఈ నెల 2న సుభాష్ విహార్ ప్రాంతంలోని ఓ గల్లీలో ఇద్దరు దుండగులు కాల్పులు జరిపినట్లు ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### విమానంలో తీవ్ర అస్వస్థత

# ప్రయాణికుడిని కాపాడిన వైద్యులు



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ నుంచి ఐజ్వాల్‌కు వెళ్తున్న విమానంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఓ ప్రయాణికుడి ఆక్సిజన్ స్థాయి అకస్మాత్తుగా 40 శాతానికి పడిపోయింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు వైద్యులు వెంటనే చికిత్స అందించారు. విమానంలోనే అత్యవసర వైద్యం ప్రారంభించి ప్రయాణికుడి ప్రాణాలు కాపాడారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ప్రయాణికుడు డయాలసిస్ వైద్య పరీక్షల కోసం విమానంలో ప్రయాణిస్తుండగా మధ్యలో అతడికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది మొదలై ఆక్సిజన్ స్థాయి దాదాపు 40 శాతానికి పడిపోయింది. దీంతో కేబిన్ సిబ్బంది వైద్య సహాయం కోసం ప్రకటన చేశారు. విమానంలో ఉన్న జనరల్ సర్జన్ డాక్టర్ విలీ లాల్‌హ్రుయిట్‌లుంగా, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఎఫ్. రేమ్‌తాంగ్‌పుయి, జీర్ణకోశ వైద్య నిపుణుడు డాక్టర్ బెంజమిన్ ఖియాంగ్టే వెంటనే స్పందించారు. ప్రయాణికుడికి మాస్క్ ద్వారా ఆక్సిజన్ అందించినప్పటికీ తొలుత ఆక్సిజన్ స్థాయి దాదాపు 60 శాతంగానే ఉంది. వైద్యులు చికిత్స కొనసాగిస్తూ స్టెరాయిడ్లు ఇవ్వడంతో ఆక్సిజన్ స్థాయి దాదాపు 90 శాతానికి చేరింది. అయితే పరిస్థితి మెరుగుపడకపోతే కోల్‌కతాలో అత్యవసరంగా విమానం దించేందుకు పైలట్ సిద్ధంగా ఉన్నారు. కొంతసేపు ప్రయాణికుడి ఆక్సిజన్ స్థాయి నిలకడగా ఉండటంతో ఐజ్వాల్ ప్రయాణాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. మళ్లీ పరిస్థితి విషమించడంతో వైద్యులు శ్వాసనాళంలో ట్యూబ్ అమర్చే ప్రక్రియపై ఆలోచించారు. విమానంలో అత్యవసర వైద్య పరికరాలు పరిమితంగా ఉండటంతో సిబ్బంది సహకారంతో లెంగ్‌పుయి విమానాశ్రయంలో అంబులెన్స్‌ను సిద్ధం చేశారు. విమానం అక్కడ దిగిన వెంటనే ప్రయాణికుడిని ఆసుపత్రికి తరలించారు.శ్వాసనాళంలో ట్యూబ్ అమర్చేందుకు అవసరమైన పరికరాలు, ట్యూబ్ అందుబాటులో ఉండటంతో వైద్యులు చికిత్స కొనసాగించారు. అనంతరం ఐజ్వాల్‌లోని ఎల్ఆర్ఎం ఆసుపత్రికి ప్రయాణికుడిని తరలించారు. సకాలంలో వైద్యం అందడంతో ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉంది.

# ప్రపంచం ముందు ఆహార సంక్షోభం

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆహార సంక్షోభం ఎదురయ్యే ప్రమాదం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హెచ్చరించారు. జర్మనీలో జరిగిన మ్యూనిచ్ లీడర్స్ సమావేశంలో మాట్లాడిన ఆమె... భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం నుంచి హోర్ముజ్ జలసంధి సమస్యల వరకు అనేక కీలక అంశాలపై స్పందించారు. ముఖ్యంగా సముద్ర మార్గాల్లో తలెత్తుతున్న ఆటంకాలు ప్రపంచ దేశాలకు ఎంత ముప్పుగా పరిణమించాయో ఆమె వివరించారు. హోర్ముజ్, బాబ్ అల్‌మండేబ్ వంటి ప్రధాన సముద్ర రవాణా మార్గాల్లో అడ్డంకులు ఏర్పడటం వల్ల ప్రపంచ దేశాల ఆహార భద్రత ప్రమాదంలో పడుతుందని నిర్మలా సీతారామన్ హెచ్చరించారు. దీనికి తోడు మలక్కా జలసంధి ప్రస్తావనను కూడా తీసుకొస్తూ ప్రస్తుతం అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవని, ఒక వేళ అక్కడ కూడా రవాణాకు ఆటంకం ఏర్పడితే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రపంచ ఆహార సంక్షోభాన్ని, సవాళ్లను తట్టుకోవడానికి భారత్ ఇప్పటికే బలమైన చర్యలు చేపట్టిందని ఆర్థిక మంత్రి చెప్పుకొచ్చారు. ఎరువులు మోసుకొచ్చే షిప్పింగ్ లైన్లపై అదనపు భారం పడకుండా, పెరుగుతున్న ఇన్సూరెన్స్ ప్రీమియంలు, పేమెంట్లు సకాలంలో చెల్లింపులకు సాయం చేసేందుకు ప్రత్యేకంగా 'షిప్పింగ్ ఎమర్జెన్సీ ఫండ్' (అత్యవసర నిధి)ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎరువుల ధరలు పెరిగిపోవడం, ఓడల లభ్యత తగ్గడం, భారీగా ఇన్సూరెన్స్ ప్రీమియంలు పెరగడం వల్ల ఎరువుల దిగుమతికి తీవ్ర విఘాతం కలుగుతోందని, అందుకే దేశీయంగా రియా, ఫాస్పేట్ ఉత్పత్తిని పెంచేందుకు భారత్ కృషి చేస్తోందని అన్నారు. అయితే స్వదేశీ ఉత్పత్తి పూర్తిస్థాయికి చేరుకోవడానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. ఇక భారత్‌అమెరికా వ్యాపార ఒప్పందం గురించి మాట్లాడుతూ రెండు దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య ఒప్పందంపై చర్చలు నిర్ణీత స్థితికి చేరుకున్నాయని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ దశలో రెండు దేశాలు అంత కుమించి ఇచ్చిపుచ్చుకోవడం లేదా వెనక్కి తగ్గడం చాలా కష్టమైన విషయమన్నారు.

## దుస్సాహసం చేస్తే అమెరికా మిత్రదేశాలపై దాడులు: ఇరాన్ హెచ్చరిక



**టెహ్రాన్:** యుద్ధ దాడులకు అమెరికా కొత్తగా ఎలాంటి దుస్సాహసం చేసినా పశ్చిమాసియాలో దాని మిత్రదేశాలపై తీవ్రస్థాయిలో దాడులు చేస్తామని ఇరాన్ సాయుధ దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ మేజర్ జనరల్ అలీ–అబ్దుల్లాహీ సోమవారం ఒక హెచ్చరిక చేశారు. పశ్చిమాసియాలో అమెరికా మిత్ర దేశాలను సంపాదించి సైనికస్థావరాలలో తిష్ఠవేసిందని, దురాక్రమణ చర్యలకు దిగితే ఈ దేశాలపై దాడులు చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో అమెరికా సైనిక బలగాల ఉనికి కొనసాగడమే అభద్రతకు,ఆర్థిక సమస్యలకు ప్రధాన కారణమని ఆయన విమర్శించారు. ఇరాన్ అణ్వాయుధాలు కోరుకుంటోందని,పూర్తిగా నాశనమై బలహీనమైన స్థితిలో ఉందని అమెరికా ప్రచారం చేస్తోందని, ఈ విధమైన ప్రచారం ద్వారా మరో యుద్ధానికి బీజాలు వేస్తోందని అన్నారు.మరో యుద్ధం చేయడానికి ఈ ప్రచారాన్ని ఒక సాకుగా అమెరికా వాడుకుంటోందని పేర్కొన్నారు. ఇటీవల యుద్ధంలో నిరూపించిన విధంగా ఎలాంటి పరిమితులూ లేకుండా అమెరికా ప్రయోజనాలను యుద్ధ దాడులతో దెబ్బతీస్తామని హెచ్చరించారు.ఇరాన్‌పై మరోసారి డోనాల్డ్ ట్రంప్ దాడులు చేస్తారని వార్తలు వెలువడుతున్న తరుణంలో ఆయన స్పందిస్తూ, కొత్త దాడులు చేస్తే ఆ అగ్ని కీలలు పశ్చిమాసియాలో అన్ని దేశాలను కబళిస్తాయన్నారు. ఇరాన్ అణు కార్యక్రమం సైనిక దశలోకి ప్రవేశించిందన్న వాదనలను ఆయన తిరస్కరించారు. భ్రమలతోనే ఈ వాదన చేస్తున్నారని,ఇరాన్‌ను ప్రపంచానికి ప్రమాదకరమైనశక్తిగా చిత్రీకరించడంకోసమే ఇలాంటి ప్రచారం చేస్తున్నారని అన్నారు.ఇరాన్ అణుకార్యక్రమం శాంతియుత ప్రయోజనాలకు మాత్రమే ఉద్దేశించినదన్నారు. వందలాది అణ్వాయుధాలు కలిగిన అమెరికా ఇలాంటి ప్రకటనలు చేస్తోందని విమర్శించారు.

# యెమెన్‌లో మళ్ళీ రాజుకున్న అంతర్యుద్ధం

**ఏడెన్:** పశ్చిమాసియాదేశం యెమెన్‌లో నాలుగు సంవత్సరాల కాల్పుల విరమణ తర్వాత అంతర్యుద్ధం మళ్ళీ రాజుకుంది. హౌతీలకు,సౌదీ అరేబియా మద్దతుగల అంతర్జాతీయ గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వ దళాలకు మధ్య భారీ పోరాటం కొనసాగుతోంది.దేశాన్ని హౌతీల నుండి రక్షించేందుకు యెమెన్ ప్రభుత్వఅత్యున్నత భద్రతామండలి ''యెమెన్ డాన్'' అనే పేరుతో భారీ సైనిక చర్యకు పిలుపు ఇచ్చింది.యెమెన్ పాలక అధ్యక్షమండలి అధిపతి రషద్ అల్–అలిమీ టెలివిజన్ ప్రసంగంలో,హౌతీలు స్వాధీనం చేసుకున్న విస్తారమైన భూభాగాలను తిరిగి గెలుచుకోవడమే ఈ భారీ సైనిక ఆపరేషన్ లక్ష్యమని ప్రకటించారు.హౌతీలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో చేరాల్సిందిగా సామాన్య ప్రజలకు,రిజర్వుసైనిక బలగాలకు పిలుపు ఇచ్చారు. హౌతీ బలగాల నుండి తప్పుకుని ప్రభుత్వ సైన్యంలో చేరే వారికి క్షమాభిక్ష ప్రసాదిస్తామని చెప్పారు. మూడునెలల క్రితం చిన్నగా ప్రారంభమైన ఈ అంతర్యుద్ధం ఇప్పుడు ఉద్ధృతరూపం దాల్చింది.తిరుగుబాటుదారుల అధీనంలో ఉన్న రాజధాని సనా సహా,రాష్ట్రాలను విముక్తి చేయడం,హౌతీ ఉగ్రవాద కుట్రలను అంతంచేయడం లక్ష్యంగా ''యెమెన్ డాన్'' భారీ సైనిక చర్య ప్రారంభించినట్లు ఎక్స్ వేదికగా రషద్ అల్–అలిమీ పేర్కొన్నారు. గడచిన వారంరోజులుగా తైజ్ నగరాన్ని స్వాధీనం చేసుకునేందుకు హౌతీలు తీవ్రదృష్టి కేంద్రీకరించి పోరాడుతున్నారు. ఈ నగరాన్ని చుట్టుముట్టారు.తమ పట్టు బిగించారు.నగరంలోకి ఎలాంటి సరఫరాలు వెళ్ళనీయకుండా అడ్డుకున్నారు. గడచిన వారం రోజుల్లో ఈ నగరం శివార్లలో హౌతీలకు,యెమెన్ ప్రభుత్వ దళాలకు మధ్య జరిగిన యుద్ధంలో 70 మంది పైగా మరణించారు.తైజ్ నగరాన్ని స్వాధీనం చేసుకోవడానికి ముందుగా తుర్బా పట్టణాన్ని హౌతీలు ఆదివారంనాడు పూర్తిగా చేజిక్కించుకున్నారు. యెమెన్ ప్రభుత్వానికి తాత్కాలిక కేంద్రంగా పనిచేస్తున్న ఓడరేవు నగరం ఏడెన్‌ను,రాష్ట్ర రాధాని నగరం తైజ్‌ను కలిపే ప్రధాన రహదారిపై ఉన్న తుర్బా పట్టణాన్ని హౌతీలు వశం చేసుకోవడంతో ప్రభుత్వం కంగుతింది.ఇంతకుముందే తైజ్‌కు వెళ్ళేమార్గంలో ఉన్న అనేక గ్రామాలను హౌతీలు స్వాధీనం చేసుకున్నారు. దీంతో తైజ్ నగరాన్ని సులభంగా స్వాధీనం చేసుకోగలమని హౌతీలు ధీమాగా ఉన్నారు.ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారుల శక్తిసామర్థ్యాలను ఈ చర్యలు రుజువు చేస్తున్నాయి. హౌతీలకు పూర్తిస్థాయిలో ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జిసి యుద్ధ నిపుణులు సలహాలు,సాంకేతిక సహాయం అందజేస్తున్నారు.

హౌతీలు ఇప్పటికే యెమెన్ తీర ప్రాంతాలను తమ అదుపులోకి తెచ్చుకున్నారు.సెప్టెంబరునెలలో హౌతీ సైన్యాలు ఎర్ర సముద్రంలో పశ్చిమతీరంవైపు వేగంగా ముందుకు వెళ్లబ్బారు.వ్యూహాత్మకమైన మోఖానగరాన్ని,ఎర్రసముద్రంలో ఉన్న అనేక దీవులను స్వాధీనం చేసుకుని అధికభాగాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. దేశాన్ని తిరిగి తమ స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి యమెన్ ప్రభుత్వ దళాలు శాయశక్తులా ప్రతిఘటిస్తున్నాయి. సౌదీ అరేబియా వాణిజ్య రాకపోకలకు కీలకమైన బాబ్ ఎల్ మందాబ్ జలసంధి ప్రాంతాన్ని కూడా తమ అధీనంలోకి తెచ్చుకుని క్షిపణులతో దాడులు చేస్తున్నారు. ఆరామ్‌కోను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు హౌతీలు ఆదివారం ప్రకటించారు. మరోవైపు యెమెన్‌లో తైజ్ నగరాన్నా స్వాధీనం చేసుకునేందుకు యెమెన్ దళాలతో పోరాడుతున్నారు. ఈ దశలో ఓడిపోకుండా తగిన వనరులు సమకూర్చడం కోసం యెమెన్ ప్రభుత్వ దళాలకు 60 బిలియన్ డాలర్ల నిధిని సౌదీఅరేబియా కేటాయించింది.హౌతీ దళాలు యెమెన్‌లో గడచిన రెండు నెలలుగా జైత్రయాత్ర సాగిస్తూ ఉండటంతో లక్షలమంది ప్రజలు గతానుభవాల రీత్యా ప్రాణభయంతో ఇళ్ళు వదలి సురక్షిత ప్రాంతాలకు పారిపోతున్నారు.ఇప్పటికే వేలాదిమంది యెమెన్‌లోమరణించారు.తమ లక్ష్యం అమెరికాను ఓడించడం కాదని, సౌదీ అరేబియాను దెబ్బతీయడమేనని హౌతీ తిరుగుబాటు సైన్యాలు ఇప్పటికే ప్రకటించాయి.




# స్పెయిన్‌లో ఇంటి అద్దెల రగడ: పార్లమెంటు రద్దు

- నవంబరు 29న పోలింగ్
- ముందే నిర్ణయించుకున్న సాంచెజ్

**మాడ్రిడ్:** స్పెయిన్‌లో పెనుభారంగా మారిన ఇంటి అద్దెల సమస్య చివరకు దేశంలో ఆకస్మిక ఎన్నికల ప్రకటనకు దారితీసింది. ఇంటి అద్దెలు భారీగా పెరిగిపోవడంతో అద్దెలు చెల్లించలేకపోయిన 87 ఏళ్ళ ఒక వృద్ధురాలిని బలవంతంగా పోలీసులు ఇల్లు ఖాళీ చేయించిన సంఘటన దేశ ప్రజలకు ఆగ్రహం రప్పించింది. ఈ ఘటన ప్రభుత్వ పనితీరుపై తీవ్ర ప్రభావం చూపించింది.ఆ వృద్ధురాలి ఇంటి అద్దె 500 యూరోల నుండి 2,650 యూరోలకు పెంచేయడంతో ఆమెకు తీవ్రభారంగా మారింది. ఈ ఘటనకు వ్యరేకంగా దేశవ్యాప్తంగా వారం రోజులుపైగా తీవ్రస్థాయిలో నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ప్రజల ఆగ్రహం తర్వాత ఈ వృద్ధురాలి ఇంటి అద్దెను 2,650 1,650యూరోలకు తగ్గించినప్పటికీ ప్రజాగ్రహం చల్లారలేదు. ఎందుకంటే ఆ వృద్ధురాలికి వచ్చే 1,350 యూరోల నెలవారీ ఫింఛను 300 యూరోలు ఇంటి అద్దె ఎక్కువగా ఉంది.ఈ పెను జీవన సంక్షోభానికి వ్యతిరేకంగా ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వంపై ఒక్కసారిగా దేశంలో వ్యతిరేకత పెరిగిపోయింది. ఈ దశలో దేశంలో గృహ వసతి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్ ఒక ప్యాకేజీని పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఈ ప్యాకేజీ కాస్తా ఆమోదం పొందకుండా సభలో వీగిపోయింది.ఇక దిక్కుతోచనిస్థితిలో పెడ్రో సాంచెజ్ సోమవారం ఆకస్మిక ఎన్నికల ప్రకటన చేశారు.2018 నుండి పెడ్రో సాంఛెజ్ అధికారంలో కొనసాగుతున్నారు. వాస్తవానికి 2027 వరకూ పార్లమెంటుకు గడువు ఉంది. మరో ఏడాది ఆయన అధికారంలో కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ మెరుపు సమస్య ఆయనను చుట్టుముట్టింది.ముందస్తు ఎన్నికలు నిర్వహించాలని ప్రధానమంత్రి నిర్ణయించుకోవడం తమకు ఎంతో సంతోషం కలిగించిందని ప్రతిపక్ష ఓక్స్‌పార్టీ నాయకుడు శాంటియాగో అబస్కల్ వ్యాఖ్యానించారు.ఎన్నికల ఫలితాలు అంత్యంత అనిశ్చితంగా ఉండవచ్చునని వ్యాఖ్యానించారు.కాగా దేశంలో వారం రోజులుగా నిరసన ప్రదర్శనలు మహోగ్రంగా కొనసాగుతున్న తరుణంలో వారం రోజులుగా ప్రధానమంత్రి సాంచెజ్ ఎన్నికల గురించి ఆలోచిస్తున్నారు. ముందస్తు ఎన్నికలకు వెళ్ళాలని ఆయన ముందుగానే నిర్ణయించుకుని ఆకస్మిక ప్రకటన చేశారన్నది విశ్వసనీయ వర్గాల సమాచారం.ఐతే వచ్చేనెలాఖరున పోలింగ్‌లో కన్జర్వేటివ్‌పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించే అవకాశాలు ఉన్నాయని సర్వేలు చెబుతున్నాయి.



స్పెయిన్ పార్లమెంటులో దిగువసభ కాంగ్రెస్ ఆఫ్ డిప్యూటీస్, ఎగువసభ సెనేట్ ఉన్నాయి. ఉభయసభల్లోనూ కలిపి మొత్తం 616 స్థానాలు ఉండగా,సెనేట్‌లో 266 మంది సెనేటర్లు, దిగువసభలో 350 మంది డిప్యూటీలు ఉన్నారు. అధికార సోషల్ వర్కర్స్ పార్టీ (సోషల్ డెమొక్రటిక్ పొలిటికల్ పార్టీ) పిఎస్‌ఓఇకి సెనేట్‌లో పిఎస్‌ఓఇ కూటమి పార్టీలకు 92 స్థానాలు ఉండగా ఇతర పార్టీలకు చెందిన మరో 23 మంది ఎంపీలు బయట నుండి మద్దతు ఇస్తున్నారు. దిగువసభలో రెండుపార్టీ కూటమికి 147 మంది సభ్యుల బలం ఉండగా, ఆరు మిత్రపక్ష పార్టీలుమరో 24 స్థానాల బలంతో వెలుపలి నుండి మద్దతు ఇస్తున్నాయి.దిగువసభలో ప్రధాన ప్రతిపక్షం పీపుల్స్‌పార్టీకి 133 స్థానాలు సహా మొత్తం ప్రతిపక్షాలకు 179 బలం ఉండగా వారంతా చెల్లాచెదురుగా ఉన్నారు.

## బ్రిటన్ స్థావరం నుండి బాంబర్లను వెనక్కు రప్పించిన ట్రంప్

### ఇరాన్‌పై యుద్ధానికి తరలించేందుకే ప్రయత్నం

**వాషింగ్టన్:** ఉగ్రవాదుల నుండి ప్రమాదం పొంచి ఉందని భయపడుతున్న బ్రిటన్‌లోని వైమానిక స్థావరం నుండి అమెరికా తన బి–52,బి–1 బాంబర్ యుద్ధ విమానాలను వెనక్కు రప్పించింది.గ్లౌసెస్టర్ వైమానిక స్థారంపై ఉగ్రవాదులు దాడిచేస్తారని సమాచారం ఉండటంతో డోనాల్డ్ ట్రంప్ ఈ విమానాలను స్వదేశానికి రప్పించారు. లండన్‌కు పశ్చిమాన 160 కి.మీ దూరంలో ఉన్న ఆర్ఎఎఫ్ ఫెయిర్ ఫోర్డ్ వైమానికస్థావరంలో సెప్టెంబరు చివరి వారంలో భద్రతాపరమైన ఉద్రిక్త పరిస్థితులు తలెత్తిన తర్వాత ఇరాన్ ప్రోత్సాహంతో ఉగ్రవాదులు ఈ యుద్ధ విమాన స్థాబువరంపై దాడి చేసే అవకాశం ఉందని ఊహించి ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు.ఆర్ఎఎఫ్ ఫెయిర్‌ఫోర్డ్ వైమానికస్థావరంలో ఉగ్రవాదులు దాడికి కుట్ర పన్నారనే ఆరోపణలపై బ్రిటన్ ప్రభుత్వం ఆరుగురిని అరెస్టు చేసింది.ఆ తర్వాత వారిని బెయిలుపై విడుదల చేసింది.వారిని బెయిలుపై విడుదల చేయడాన్ని ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారు.ఈ ఘటనతో ఇరాన్‌కు సంబంధం ఉందని బలమైన సూచనలు కనిపిస్తున్నాయని బ్రిటీష్ ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ ప్రకటించగా,దీనిని ఇరాన్ పాలకులు తీవ్రంగా ఖండించారు. పేరు చెప్పడానికి ఇష్టపడని పెంటగాన్ అధికారి ఒకరు మాట్లాడుతూ, బ్రిటన్ నుండి కీలకమైన యుద్ధ విమానాలను అమెరికాలోని స్వస్థలాలకు తరలించినట్లు చెప్పారు. ఇరాన్ యుద్ధం మొదలైనప్పటినుండీ బిర్టన్‌లోని ఆర్ఎఎఫ్ వైమానికస్థావరం నుండి డజన్ల సంఖ్యలో యుద్ధ విమానాల కార్యకలాపాలు క్రియాశీలంగా కొనసాగుతూ ఉండటాన్ని విశ్లేషకులు గమనించారు.



ఇరాన్‌తో మరోసారి యుద్ధం చేసేందుకు ట్రంప్ సన్నాహాలు చేస్తున్నారని అనధికార వార్తలు వెలువడుతున్న తరుణంలో బ్రిటన్ స్థావరం నుండి శక్తిమంతమైన యుద్ధ విమానాలను ట్రంప్ తరలించారు. ఒహియో ఎన్నికల ర్యాలీలో పాల్గొనేందుకు బయలుదేరేముందు ట్రంప్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ఇరాన్ విషయంలో తాను ఒక నిర్ణయం తీసుకుంటానని అన్నారు. ఇప్పటివరకూ జరిగిన యుద్ధంలో ఇరాన్ పూర్తిగా నాశనమైపోయినందువల్ల తాను తీసుకోబోయే తదుపరి నిర్ణయం సులభమైనదిగానో,లేక పూర్తిగా కఠినమైనదిగానో ఉండవచ్చునని చెప్పారు.

## రద్దుచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

విచారణలో ఉన్న పిటిషన్లపై తీర్పులు వెలువడే వరకూ జ్ఞానేశ్ కుమార్ ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా అడ్డుకునేందుకు తాత్కాలిక మార్గదర్శకాలు జారీ చేయడానికి మాత్రం సుప్రీం కోర్టు తిరస్కరించింది.ఈ విషయంలో దాఖలైన రెండు పిటిషన్లను జతచేసి విచారణ చేస్తున్నట్లు పిటిషనర్ల తరపు న్యాయవాదులు ఇద్దరికీ తెలియజేసింది.

''అన్ని నిర్ణయాలను మేం పరిశీలిస్తాం,ఇందులో ఏ నిర్ణయమైనా చట్టానికి అనుగుణంగా లేకపోయినా,ఏకపక్షంగా ఉన్నా,మెజారిటీ నిర్ణయాలకు విరుద్ధంగా ఉన్నాగానీ రద్దుచేస్తాం,న్యాయస్థానానికి ఉన్న అధికారశక్తి ఏమిటో మీకు తెలుసు'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.న్యాయమూర్తులకు కూడా లేనంత చట్టబద్ధమైన రక్షణ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ఉందన్న విషయాన్ని కూడా ధర్మాసనం ప్రస్తావించింది. ఐతే ఈ విధంగాచట్టబద్ధ రక్షణ ఇచ్చే చట్టంలోని క్లాజును కూడా విచారణ సందర్భంగా పరిశీలిస్తామని ధర్మాసనంలో న్యాయమూర్తులు స్పష్టం చేశారు.సిఇసికి వ్యతిరేకంగా ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన పాట్నాకు చెందిన పిటిషనర్ రాకేశ్ కుమార్ సింగ్ తరపున ధర్మాసనం ఎదుట వాదనలకు హాజరైన సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ మొదట ఒక విజ్ఞప్తి చేస్తూ,జ్ఞానేశ్ కుమార్ తదుపరి ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా మార్గదర్శకాలు జారీ చేయాలన్నారు.దేశంలో ప్రతి పౌరుడూ అభద్రతాభావంతో ఉన్నారని,ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుండి సస్పెండ్ చేయాలని కోరారు. ఒకవేళ ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను సస్పెండ్ చేస్తే ఎన్నికలు ఎవరు నిర్వహిస్తారు? అని సంబంధిత న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది.ఎన్నికల సంఘం రాజ్యాంగం ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వహించాల్సి ఉందన్నారు.ఎన్నికల సంఘంలో ఇంకా ఇద్దరు కమిషనర్లు ఉన్నారని, వారిద్దరూ ఎన్నికలను నిర్వహిస్తారని న్యాయవాది వికాస్ సింగ్ ధర్మాసనానికి చెప్పారు.ఐతే ఏదైనా ఉత్తర్వు జారీ చేసే ముందుగా సంబంధిత వ్యక్తుల వివరణ అడిగి తెలుసుకోవాల్సి ఉంటుందన్నారు.ఐతే మెజార్టీ ద్వారా లేదా ఏకగ్రీవంగా నిర్ణయాలు తీసుకోవాల్సిందిగా న్యాయస్థానం ముందుగానే ఎన్నికల సంఘానికి ఉత్తర్వులు జారీ చేయాలని వికాస్ సింగ్ కోరారు.''ఇది తప్పనిసరి చట్టం,ఏకపక్షంగా మేం ఎలాంటి ఉత్తర్వులూ జారీ చేయలేం,ఎన్నికల సంఘం చట్టాన్ని పాటిస్తుందని మేం ఆశిస్తున్నాం,లేకపోతే ఆ నిర్ణయాలురద్దుచేస్తాం'' అని ధర్మాసనం పేర్కొంది.సిఇసి ఏకపక్ష నిర్ణయాలవల్ల యావత్ ఓటర్ల జాబితా కలుషితమైందని సింగ్ పేర్కొనగా,ఎదుటిపక్షం వాదనలు వినకుండా న్యాయస్థానం నిర్ణయాలు తీసుకోగలదా? అని జస్టిస్ జోమాల్య బాగ్చీ సదరు న్యాయవాది సింగ్‌ను ప్రశ్నించారు.ఒక పత్రికలో కథనం వచ్చిన తర్వాత ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసిందని, దాన్నిబట్టి చూస్తే ఆ పత్రిక కథనంతో ఇసి అంగీకరించినట్లే కాగలదని న్యాయవాది చెప్పగా,పత్రికల కథనాల ఆధారంగా తాము నిర్ణయాలు తీసుకోలేమని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పష్టం చేశారు.

## జ్ఞానేశ్ అబద్ధాల కోరు

(మొదటి పేజీ తరువాయి)

పేరును ఉపయోగించారన్నారు. 'ఇది పూర్తిగా సిగ్గుచేటు. జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘం విశ్వసనీయత, నిష్పాక్షికతను దెబ్బతీశారు. దేశాన్ని తప్పుదోవ పట్టించారన్న ఆరోపణలు ఇప్పుడు ఆయనపై వచ్చాయి. జ్ఞానేశ్ కుమార్ ఓటు దొంగ, అబద్ధాలకోరు, ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేవారు' అంటూ రాజా దుయ్యబట్టారు. 'ఫామ్6ను ఎవరు మార్చారు? సుప్రీంకోర్టు ఆమోదించిందంటూ తప్పుడు ప్రకటనను ఎవరు అనుమతించారు? ఈసీ ప్రకటనను ఎందుకు తొలగించారు? అనే ప్రశ్నలకు జ్ఞానేశ్ కుమార్ దేశానికి సమాధానం చెప్పాలి' అని రాజా డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రజాస్వామ్యం కొనసాగాలంటే జ్ఞానేశ్ కుమార్ పదవికి రాజీనామా చేయడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు.

## చట్టవిరుద్ధం, ఏకపక్షం

(మొదటి పేజీ తరువాయి)

నిస్సందేహంగా రుజువైందని, బిజెపికి సహాయం చేయడానికి అతను తన పదవిని దుర్వినియోగం చేస్తున్నాడనడానికి ఇది మరో రుజువు మాత్రమేనన్నారు. అక్టోబర్ 1న తాను చేసిన పోస్ట్‌ను కూడా రాహుల్‌గాంధీ ట్యాగ్ చేశారు. అందులో ఆన్‌లైన్ ఫారం–6ను చట్టవిరుద్ధంగా మార్చారని పేర్కొంటూ, ఆ మార్పు చేయమని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌ను ఎన్నికల సంఘంలో ఎవరు ఆదేశించారు, ఆ కంపెనీలో ఎవరు దానిపై సంతకం చేశారు అని ఆయన ప్రశ్నించారు. 'ఇసి సొంత కమిషనర్లే నమోదు చేసినట్లుగా ఆన్‌లైన్ ఫారం–6ను చట్టవిరుద్ధంగా మార్చారు. ఇసిఐలో ఎవరు ఆ మార్పు చేయమని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌ను ఆదేశించారు?' అని ప్రశ్నించారు. టిసిఎస్‌లో ఎవరు దానికి ఆమోదం తెలిపారు? అలాగే, అలా చేయడానికి వారిపై ఒత్తిడి తెచ్చారా? అని ఆయన ఎక్స్ వేదికగా నిలదీశారు. ఇదిలా ఉండగా, 'ఎస్ఐఆర్ (సర్) తాత్కాలికంగా, చట్టవిరుద్ధంగా, అజాగ్రత్తగా జరుగుతున్న తీరుకు సంబంధించి ఇటీవల వెలుగులోకి వచ్చిన తీవ్రమైన విషయాలు, సుప్రీంకోర్టులోని సిట్టింగ్, రిటైర్డ్ న్యాయమూర్తుల విమర్శలు, సరైన విచారణ ప్రక్రియ లేకుండా విచ్చలవిడిగా తొలగింపులు జరగడం వంటి వాటి దృష్ట్యా, మన గణతంత్ర సమగ్రతకు కీలకమైన ఈ సంస్థపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి సుప్రీంకోర్టుకు ఒక గొప్ప అవకాశం లభించింది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. ప్రస్తుతానికి, సుప్రీంకోర్టు ఒక జవాబును కోరాలని నిర్ణయించుకుంది తప్ప, ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయకూడదని నిర్ణయించుకుందని రమేశ్ పేర్కొన్నారు. 'ఎన్నికలు ఎలా నిర్వహించాలనే దానికి ఒక ప్రమాణాన్ని నెలకొల్పిన తొలి సిఇసి, దివంగత సుకుమార్ సేన్‌తో మొదలైన దశాబ్దాల సముచిత, సమర్థవంతమైన ప్రవర్తన ఆధారంగానే ఆ నమ్మకం ఏర్పడిందని సుప్రీంకోర్టు గమనించాలి. ఆ సద్భావనలో ఏ ఒక్కదాన్నీ జ్ఞానేశ్ కుమార్ క్లెయిమ్ చేయలేరు' అని రమేశ్ అన్నారు. వాస్తవానికి సుప్రీంకోర్టు ఆమోదం ఉందని పరోక్షంగా సూచించిన ఈ దురుద్దేశపూరిత ఫారం –6 సవరణ, అతని నీచమైన, ఏమాత్రం సమర్థించలేని ప్రవర్తనకు ఒక ఉదాహరణ అని ఆయన అన్నారు. 'స్పష్టంగా, చాలా నిస్సందేహంగా సిఇసి అబద్ధం చెప్పారు. ప్రధాని తీవ్రంగా భయపడే జెన్ జీ ఓటర్లను తొలగించడానికి సిఇసి స్వయంగా ఉద్దేశపూర్వకంగా ఫారం–6ను సవరించారు' అని అన్నారు.

## ధరల నియంత్రణకు అడ్డుకట్ట వేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అడ్డుకట్ట వేయాలని బిఆర్ఎస్ఎల్పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు డిమాండ్ చేశారు. సామాన్యుడిపై పెను భారం పడుతుంటే పౌరసరఫరాల శాఖ మొద్దు నిద్రలో ఉన్నదని, వెంటనే ధరల పెరుగుదలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అధిక మార్జిన్లపై తక్షణమే తనిఖీలు నిర్వహించి, అందుకు బాధ్యులైన వారిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసరాల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తుంటే, నియంత్రించాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దారుణమని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యవేక్షణ వైఫల్యానికి సామాన్య ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారన్నారు.

## సిజెగా శ్యామ్ కోశి

(మొదటి పేజీ తరువాయి)

జనరల్ సుదర్శన్ రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ శ్యామ్ కోశి 1967 ఏప్రిల్ 30న జన్మించారు. 1991లో న్యాయవాదిగా నమోదు చేసుకుని మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ హైకోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. 2013లో ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2023 జూలై 27న తెలంగాణ హైకోర్టుకు బదిలీపై వచ్చారు. సీనియార్టీ ప్రకారం న్యాయమూర్తుల్లో సిజె తర్వాత స్థానంలో ఉన్నారు. ఇదిలా ఉండగా, చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. సెప్టెంబర్ 28న సుప్రీం కోర్టు కొలీజియం చేసిన సిఫారసు మేరకు రాష్ట్రపతి ఆయన నియామకానికి ఆమోద ముద్ర వేశారు. ఆయనతోపాటు గుజరాత్ హైకోర్టు సిజె జస్టిస్ సునీతా అగర్వాల్, ఢిల్లీ హైకోర్టు సిజె జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ 2012లో జార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2023లో త్రిపుర హైకోర్టు సిజెగా పదోన్నతి లభించింది. 2025 జూలై 19న తెలంగాణ హైకోర్టు సిజెగా వచ్చారు. ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానానికి న్యాయమూర్తి అయ్యారు.

## ముగ్గురికి నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

ఈ శాస్త్రవేత్తలు తేల్చారు. అయితే వీళ్లు కనుగొన్న పద్ధతుల్లోనే వివిధ దేశాల్లోనూ ల్యాబ్‌ల్లో మెదడు మిస్టరీని స్టడీ చేస్తున్నట్లు నోబెల్ కమిటీ పేర్కొన్నది. 1901 నుంచి 116 మెడిసిన్ ప్రైజ్‌లను ప్రకటించారు. 232 మంది వ్యక్తులు మెడిసిన్‌లో ప్రైజ్ అందుకున్నారు. వైద్య శాస్త్రంలో నోబెల్ అందుకున్న అతిపిన్న వయస్కుడు ఫ్రెడ్రిక్ బ్యాటింగ్. 32 ఏళ్ల వయసులో అతను ఆ అవార్డు గెలిచాడు. అవార్డు అందుకున్న వృద్ధుడిగా పేటన్ రౌస్ ఉన్నారు. ఆయన 87 ఏళ్ల వయసులో మెడిసిన్ నోబెల్ అందుకున్నారు. వైద్యంలో నోబెల్ బహుమతిని ఏ ఒక్క శాస్త్రవేత్త కూడా రెండోసారి గెలుచుకోలేదు. స్టాక్‌హోమ్‌లోని కరోలిన్‌స్కా ఇన్స్‌టిట్యూట్‌లో మెడిసిన్ నోబెల్‌ను ప్రకటిస్తారు. ఈ ఏడాది నోబెల్ బహుమతుల ప్రైజ్‌మనీ 12 మిలియన్ల స్వీడిష్ క్రొనర్లుగా నిర్ధారించారు. అమెరికాలోని హోవార్డ్ హుగ్స్ మెడికల్ ఇన్స్‌టిట్యూట్ అండ్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో కార్ల్ డీసరోత్, జర్మనీలోని హమ్‌బోల్డ్ యూనివర్సిటీ ఆఫ్ బెర్లిన్‌లో పీటర్ హెగ్‌మాన్, జర్మనీలోని యూనివర్సిటీ ఆఫ్ వుర్జ్‌బర్‌లో జార్జ్ నగేల్ ప్రొఫెసర్లుగా చేస్తున్నారు.

## లెక్చరర్‌ల తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

విధానాన్ని ప్రవేశపెట్టా రు. కళాశాల ప్రారంభమైన జూన్ నుంచి మా ర్చి విద్యా సంవత్సరం వరకు గరిష్టంగా 10 నెలల కాలానికి వారిని నియమించే వారు. 2014 మార్చి 28 నాటికి పనిచేస్తున్న వారిని మాత్రమే కొనసాగిస్తూ, కొత్తగా ఎవరినీ చేర్చుకోవద్దని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వత జిఒ నంబర్ 3ను (జూన్ 21,2014) తీసుకువచ్చారు. అయితే జిఒ ఎం ఎస్ నంబర్ 16 (26 ఫిబ్రవరి,2016) ప్రకారం సర్వీసుల క్రమబద్ధీకరణ చట్టాన్ని (యాక్ట్ 2 ఆఫ్ 1994 సవరణ) వర్తింపజేస్తూ, విద్యార్హతల నిజనిర్ధారణ షరతులతో కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించారు. కాగా ఇందులో కొందరు నకిలీ పిజి సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందినట్టుగా సర్వత్రా ఆరోపణలు వచ్చాయి. దీనిపైన విచారణ చేపట్టగా ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారం బయటపడింది. ఇప్పటి వరకు ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారుల విచారణలో దాదాపు 35 మందిని గుర్తించి, వారికి షోకాజు నోటీసులు జారీ చేశారు. షోకాజు నోటీసులకు వచ్చిన సమాధానాలను , తమ ప్రాథమిక విచారణ లో వెల్లడైన అంశాలను, సర్టిఫికెట్లనుపరిశీలించిన తర్వాత ఆ 35 మందిని జూనియర్ అధ్యాపకుల పోస్టు నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

**మరి కొందరు 'ఫేక్ అధ్యాపకులు'.?**

కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణలో పలు అవినీతి అక్రమాలు జరిగినట్టు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియామక ప్రక్రియలోనే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ నియామక నిబంధనకుల విరుద్ధంగా నియామక ప్రక్రియ జరిగిందని కొందరు కాంట్రాక్ట్ అధ్యాపకులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన నామమాత్రంగానే జరిగిందని, ఇందులో రాజకీయ జోక్యం కూడా ఉన్నదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపైన ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రాథమిక విచారణ చేపట్టగా అనేక అంశాలు వెలుగులోనికి వచ్చినట్టు సమాచారం. ప్రస్తుతం 35 మందిని తొలగించినప్పటికీ నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినవారు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియపైన ఇది వరకే అధికార యంత్రాంగం ప్రాథమిక విచారణ చేపట్టి, వారి సర్టిఫికెట్లను పరిశీలించినట్టు తెలిసింది. ఇందులో మరి కొందరి సర్టిఫికెట్లపైన అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా ఇతర రాష్ట్రాలకు చెందిన కొన్ని విశ్వవిద్యాలయాలకు చెందిన సర్టిఫికెట్ల అంశాలలో అనేక అనుమామాలను వ్యక్తం అవుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంలో సమగ్ర విచారణ చేపడితే మరిన్ని అంశాలు వెలుగులోనికి వస్తాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

## ఆమోదం లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఫారమ్–6 అని పిలుస్తారు.బీహార్‌లో ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ(సర్)ప్రక్రియకు సంబంధించి సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఫారమ్–6లో మార్పులు చేర్పులకు సుప్రీంకోర్టు ధర్మాసనం తన ఆమోదాన్ని తెలియజేసిందని కేంద్ర ఎన్నికల సంఘం సెప్టెంబరు 26వ తేదీన విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలియజేసింది. ఎన్నికల సంఘంలో నిర్ణయాలలో విభేదాలు లేవని,ఎన్నికల సంఘం నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే జరుగుతున్నాయని చెప్పడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఈ వివరణ ప్రకటన జారీ చేసింది.పిటిషనర్ త్రిపాఠీ వ్యాజ్యంపై విచారణ సందర్భంగా సోమవారం సుప్రీంకోర్టు ధర్మాసనం ఫారమ్–6లో మార్పులు,చేర్పులకు తమ ఆమోదం లేదని స్పష్టం చేయడంతో ఎన్నికలసంఘం మళ్ళీ కొత్త ఇరకాటంలో పడినట్లయింది. తన ఇద్దరు సహచర కమిషనర్ల సమ్మతి లేకుండా సాఫ్ట్‌వేర్ మార్పులు,మార్గదర్శకాల జారీ,నిర్ణయాల ప్రకటనలను సవాలుచేస్తూ త్రిపాఠి సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఐతే ఈ వ్యాజ్యంలో పేర్కొన్న అంశాలు కూడా గందరగోళంగా ఉన్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది.ఎన్నికల సంఘం సామూహికంగా నిర్ణయాలు చేయాల్సి ఉందని, కానీ చట్టబద్ధమైన సంప్రదాయాలను జ్ఞానేశ్ కుమార్ ఉల్లంఘించారని,దీనిపై విచారణ జరపాలని త్రిపాఠి తన పిటిషన్‌లో కోరారు. త్రిపాఠి తరపున సీనియర్ న్యాయవాది మనేకా గురుస్వామి సుప్రీంకోర్టులో వాదనలకు హాజరయ్యారు. న్యాయవాది చంద్ ఖురేషీ ద్వారా త్రిపాఠి ఈ వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టులో దాఖలు చేశారు.

అత్యున్నతమైన చట్టవ్యవస్థ అధికార విధుల నిర్వహణలో తప్పులకు పాల్పడినందుకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు సంబంధిత అధికారులపై క్రిమినల్ విచారణ ప్రారంభించాలని పిటిషనర్ తన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో కోరారు.అత్యున్నతమైన రాజ్యాంగబద్ధ ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవిలో ఉన్నప్పటికీ,ఒక సాధారణ పౌరుడి తరహాలోనే ఎలాంటి చట్టపరమైన రక్షణలూ లేకుండా విచారణ చేయడానికి ఆయన అర్హుడని పిటిషనర్ పేర్కొన్నారు.ఎన్నికల అధికారుల మధ్య విభేదాలు వచ్చినప్పుడు మెజార్టీ నిర్ణయానికే ఎవరైనా కట్టుబడాలని,ఇది చట్టబద్ధమైన విధానమని పేర్కొంటూ ముఖ్యంగా సెక్షన్ 18ను పిటిషనర్ ఉటంకించారు.ఎన్నికల సంఘంలో మెజార్టీ అభిప్రాయానికి భిన్నంగా ఏకపక్షంగా జ్ఞానేశ్ కుమార్ అమలు చేసిన లేదా ఆమోదించిన సాఫ్ట్‌వేర్ మార్పులు,నిర్ణయాలను చట్టవిరుద్ధమైనవిగా,అధికార పరిధికి అతీతమైనవిగా ప్రకటించాలని పిటిషనర్ తన వ్యాజ్యంలో కోరారు.దీనికి అనుగుణంగా తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి అర్హులైన వారు లిఖితపూర్వకంగా భర్తీచేసే ఫారమ్–6లో మార్పులు చేర్పుల అంశాన్ని ఆయన ప్రధానంగా పేర్కొన్నారు.వారసుల వివరాలు కావాలని ఈ దరఖాస్తులో కోరారని, మునుపటి సర్ ప్రక్రియ వివరాల అనుసంధానాన్ని కూడా సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రవేశపెట్టారని,చట్టబద్ధమైన నిబంధనలు,సవరణలు లేకుండానే ఈ పనిచేశారని పిటిషనర్ ఆరోపించారు.అదేవిధంగా గోవా,పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ఓటర్ల జాబితాల సవరణ తీరు తెన్నులపై నెలకున్న ఆందోళనలను కూడా పిటిషనర్ ప్రస్తావించారు. అర్హులైన 97 మంది ఓటర్లను తిరిగి జాబితాల్లో చేర్చాలన్న సవరణ ఆదేశాలు ఉన్నప్పటికీ ఈ ప్రక్రియ జరగలేదని,సాఫ్ట్‌వేర్‌లో పేర్ల పునరుద్ధరణకు సంబంధించిన ఫీచర్ అస్సలు అందుబాటులో లేదని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో న్యాయాధికారులు పునరుద్ధరించిన ఓటర్లకు వ్యతిరేకంగా ఎన్నికల సంఘం పేరుతో 16.10 లక్షలు పైగా విజ్ఞాపనలు దాఖలయ్యాయని,ఈ విషయం మిగతా ఇద్దరు ఎన్నికల అధికారులకు,పశ్చిమ బెంగాల్ ప్రధాన ఎన్నికల కమిషనర్ దృష్టికీ రాలేదని పిటిషనర్ త్రిపాఠి తన వ్యాజ్యంలో ఆరోపించారు.

# ఈ బౌలింగ్‌తో వరల్డ్ కప్ గెలవడం అసాధ్యం

## మాజీ క్రికెటర్ ఫైర్!



వెస్టిండీస్ జట్టుతో జరిగిన మూడో వన్డేలో టీమిండియా పరాజయంపై మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యూ చండీగఢ్‌లోని ముల్లన్పూర్లో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ నిర్దేశించిన 352 పరుగుల భారీ లక్ష్యాన్ని వెస్టిండీస్ మరో 10 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. గత మ్యాచ్లో గెలిచినప్పటికీ 400కి పైగా పరుగులు సమర్పించుకున్న భారత బౌలింగ్ విభాగం, ఈ నిర్ణయాత్మక మ్యాచ్‌లోనూ పూర్తిగా విఫలమైంది. భారత బౌలింగ్ తీరుపై తన యూట్యూబ్ ఛానెల్ 'చీకీ చీకా'లో మాట్లాడిన శ్రీకాంత్.. జట్టు యాజమాన్యం తీసుకుంటున్న సెలెక్షన్ నిర్ణయాలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. ఈ మ్యాచ్లో బౌలింగ్ నిర్వహణ, ఆటగాళ్ల ఎంపికపై క్రిస్ శ్రీకాంత్ తీవ్ర సందేహాలు వ్యక్తం చేశారు. మహ్మద్ సిరాజ్కు ఇంకా రెండు ఓవర్లు మిగిలి ఉన్నప్పటికీ.. చివరి ఓవర్ను యువ బౌలర్ అన్షుల్ కంబోజ్కు ఇవ్వడాన్ని ఆయన తప్పుపట్టారు. 'భారత బౌలింగ్ ఎంతో సాధారణంగా ఉంది. ఇలాంటి బౌలింగ్ దాడితో ప్రపంచకప్ గెలిచే అవకాశమే లేదు. గుర్నూర్ బ్రార్, అన్షుల్ కంబోజ్ వంటి ఆటగాళ్లను అకస్మాత్తుగా జట్టులోకి తెచ్చి రేసులో నిలబెట్టాలని చూడటంలో ఎలాంటి తర్కం లేదు. జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా తప్ప మిగిలిన పూర్తిస్థాయి జట్టు ఉన్నప్పటికీ వెస్టిండీస్ వంటి బలహీనమైన జట్టు చేతిలో ఓడిపోవడం దారుణం' అని క్రిస్ శ్రీకాంత్ విమర్శించారు. కాగా ఈ మ్యాచ్లో గుర్నూర్ బ్రార్, అన్షుల్ కంబోజ్ కలిసి 18.1 ఓవర్లలో ఏకంగా 146 పరుగులు సమర్పించుకుని ఒకే ఒక్క వికెట్ తీశారు. అలాగే యువ ఆల్రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి ప్రదర్శనపై కూడా క్రిస్ శ్రీకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. హార్దిక్ పాండ్యా గాయపడటంతో నితీష్ కుమార్ రెడ్డిని పేస్‌బౌలింగ్ ఆల్రౌండర్గా తీర్చిదిద్దేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోంది. అయితే ఈ మ్యాచ్లో నితీష్ కుమార్ రెడ్డి బ్యాటింగ్లో 16 బంతుల్లో 9 పరుగులు మాత్రమే చేయగా.. బౌలింగ్లో 6.5 ఓవర్లలో 50 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. కొద్దిగా బౌన్స్ ఉన్న వికెట్లపై నితీష్ బ్యాటింగ్ తీవ్రంగా తడబడుతోందని, వరుసగా పరుగులు ఇస్తున్నా బౌలింగ్ వేయించడం ఆశ్చర్యకరమని క్రిస్ శ్రీకాంత్ పేర్కొన్నారు. అతడిని ఎలాగైనా ఆల్రౌండర్గా మార్చాలని మేనేజ్మెంట్ పట్టుబట్టడం భారత క్రికెట్కు మంచి సంకేతం కాదని ఆయన హెచ్చరించారు. ఇప్పటివరకు ఆడిన 8 వన్డేల్లో నితీష్ బౌలింగ్ లో కేవలం 3 వికెట్లు మాత్రమే తీసి 91.33 సగటుతో ధారాళంగా పరుగులు ఇచ్చాడు.

# వైభవ్ సూర్యవంశీపై వేటు

## వెస్టిండీస్‌తో తొలి టి–20 ఆడే భారత తుది జట్టు ఇదే

వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్.. ఐదు టి–20ల సిరీస్ కోసం సన్నదమైంది. మంగళవారం లక్నో వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. జపాన్ వేదికగా ఆసియా గేమ్స్ 2026లో స్వర్ణ పతకం సాధించిన భారత్.. సోమవారం తెల్లవారుజామునే స్వదేశం చేరింది. ఒక రోజు వ్యవధిలోనే వెస్టిండీస్‌తో తొలి టి20లో తలపడనుంది. ఈ సిరీస్ నుంచి టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వగా.. టెస్ట్ ప్రిపరేషన్స్ కోసం చివరి నిమిషంలో వాషింగ్టన్ సుందర్‌ను జట్టు నుంచి తప్పించారు. సుందర్ స్థానంలో నమన్ ధీర్ బరిలోకి దిగాడు. ఈ క్రమంలోనే టీమ్ కాంబినేషన్లో మార్పులు జరగనున్నాయి. జపాన్ కండిషన్స్ స్పిన్‌కు అనుకూలంగా ఉండటంతో భారత్ ఏకైక పేసర్(జస్ప్రీత్ బుమ్రా)ను ఆడించి.. ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగింది. దాంతో వైభవ్ సూర్యవంశీని ఎక్స్ట్రా బ్యాటర్‌గా ఆడించింది. ఈ వ్యూహం భారత్‌కు బాగా కలిసొచ్చింది. కానీ భారత్‌తో ఏకైక పేసర్‌తో బరిలోకి దిగలేని పరిస్థితి. ఈ క్రమంలోనే వైభవ్ సూర్య వంశీ బెంచ్‌కు పరిమితం కానున్నాడు. అతని స్థానంలో అర్ష్‌దీప్‌సింగ్ జట్టులోకి రానుండగా.. అభిషేక్‌శర్మ, సంజూశాంసన్ ఓపెనర్లుగా ఇన్నింగ్స్ ప్రారంభించనున్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కూడా వైభవ్ అవకాశం కోసం కొన్నాళ్లు వేచి చూడాల్సిందేనని తెలిపాడు. వైభవ్ కోసం అభిషేక్ సంజూ కాంబినేషన్ను విడదీయలేమని చెప్పాడు. ఈ క్రమంలోనే ఆరంభ మ్యాచ్లో వైభవ్ బెంచ్కే పరిమితం కానున్నాడు. జస్ప్రీత్ బుమ్రా స్థానంలో మయాంక్ యాదవ్ లేదా ప్రిన్స్ యాదవ్లో ఒకరికి చోటు దక్కనుంది. అర్ష్‌దీప్ సింగ్ పేస్ విభాగాన్ని నడిపించనుండగా.. అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, నమన్ ధీర్ స్పిన్ బాధ్యతలు పంచుకునే అవకాశం ఉంది. పాకిస్థాన్తో ఫైనల్లో



తేలిపోయిన రవి బిష్ణోయ్పై వేటు పడనుంది. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్ మిడిలార్డర్ బాధ్యతలు పంచుకోనున్నారు.

**వెస్టిండీస్‌తో తొలి టి20 ఆడే భారత తుది జట్టు(అంచనా)...** అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, శివమ్ దూబే, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, నమన్ ధీర్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్/మయాంక్ యాదవ్

**వెస్టిండీస్‌తో టి20 సిరీస్‌కు భారత జట్టు:** శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, నమన్ ధీర్.

## యువతరంగం

# ఉపాధ్యాయులకు కొత్త సవాళ్లు

కృత్రిమ మేధస్సు (ఎఐ), వాతావరణ మార్పులు, వలసలు, నిర్వాసితులు, సమ్మిళిత విద్య వంటి పరిణామాలతో ఉపాధ్యాయ వృత్తి కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. యునెస్కో నివేదికను అనుసరించి, ప్రపంచవ్యాప్తంగా విద్య అందరికీ అందుబాటులోకి రావాలంటే 2030 నాటికి అదనంగా 5 కోట్ల మంది ఉపాధ్యాయులు అవసరమవుతారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 10.7 కోట్ల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే ఉపాధ్యాయుల కొరత, వృత్తి నుంచి వైదొలగుతున్న వారి సంఖ్య పెరగడం, వృత్తిపై ఆకర్షణ తగ్గడం విద్యా వ్యవస్థలకు ఆందోళన కలిగిస్తున్నాయి. 2030 నాటికి అవసరమయ్యే అదనపు ఉపాధ్యాయుల్లో 58 శాతం మంది వృత్తి నుంచి వైదొలగే వారిని భర్తీ చేసేందుకే అవసరం కానున్నారు. ఉపాధ్యాయులను నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణులుగా గుర్తించి, వారికి మెరుగైన పని పరిస్థితులు, వేతనాలు, వృత్తిపరమైన మద్దతు కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రపంచవ్యాప్తంగా 40 శాతం కంటే తక్కువ మంది ఉపాధ్యాయులు మాత్రమే తమ వృత్తికి సమాజంలో తగిన గౌరవం ఉందని భావిస్తున్నారని నివేదిక పేర్కొంది. ఉపాధ్యాయుల పట్ల సమాజంలో గౌరవం పెరిగితే వారిని వృత్తిలో కొనసాగించడం సులభమవుతుందని, అనుభవజ్ఞులైన



ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడంతో పాటు కొత్త ఉపాధ్యాయులకు మార్గదర్శకత్వం అందిస్తారని వివరించింది. ఉపాధ్యాయుల వార్షిక వృత్తి విరమణ రేటు ప్రీప్రైమరీలో 7.2 శాతం, ప్రైమరీలో 4.7 శాతం, సెకండరీలో 5.4 శాతంగా ఉందని యునెస్కో తెలిపింది. విశ్లేషించిన 68 దేశాల్లో 27 దేశాల్లో సమాన అర్హతలున్న ఇతర వృత్తి నిపుణులతో పోలిస్తే ఉపాధ్యాయుల వేతనాలు తక్కువగా ఉన్నాయని పేర్కొంది.

### ఎఐ రాకతో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

విద్యారంగంలో ఎఐ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులను ఎఐ భర్తీ చేయకూడదని, వారి వృత్తిపరమైన నిర్ణయాలకు సాంకేతికత సహకరించాలన్నది యునెస్కో అభిప్రాయం. ఎఐ వినియోగంపై నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో ఉపాధ్యాయులకు క్రియాశీల పాత్ర కల్పించాలని సూచించింది. విద్యా వ్యవస్థలు వేగంగా మారుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులకు కేవలం కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందించడం సరిపోదని, వారి వృత్తికి తగిన గౌరవం, శిక్షణ, వనరులు, వృత్తిపరమైన స్వేచ్ఛ కల్పించాల్సిన అవసరం ఉందని యునెస్కో స్పష్టం చేసింది. 2030 విద్యా లక్ష్యాలను చేరుకోవాలంటే ఉపాధ్యాయుల కొరతను అధిగమించడంతో పాటు, వృత్తిని ఆకర్షణీయంగా మార్చడం అత్యవసరమని పేర్కొంది.

## అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన

# యువ శాస్త్రవేత్త జాక్ ఆండ్రాకా

**యూత్ ఐకాన్స్**

*ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..*

మన వయసు చిన్నదని కలలు కూడా చిన్నవిగా ఉండాల్సిన అవసరం లేదు. ఈ విషయాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన యువ శాస్త్రవేత్తల్లో జాక్ ఆండ్రాకా ఒకరు. అమెరికాలోని మేరీల్యాండ్‌కు చెందిన జాక్ ఆండ్రాకా, తనకు ఎంతో సన్నిహితమైన కుటుంబ మిత్రుడు ప్యాంక్రియాటిక్ కేన్సర్‌తో మరణించడంతో తీవ్రంగా బాధపడ్డాడు. కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తించగలిగితే ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చనే ఆలోచన అతనిలో ఒక కొత్త ప్రయోగానికి నాంది పలికింది. కేవలం 15 ఏళ్ల వయసులోనే అతను ఓపెన్‌సోర్స్ శాస్త్రీయ వ్యాసాలను స్వయంగా అధ్యయనం చేసి, బయోకెమిస్ట్రీపై అవగాహన పెంచుకున్నాడు. తన ఆలోచనను పరీక్షించేందుకు సుమారు 200 పరిశోధనా ప్రయోగశాలలకు ప్రతిపాదనలు పంపాడు. అందుకలో 199 ప్రతిపాదనలు తిరస్కరణకు గురయ్యాయి. అయినప్పటికీ అతను వెనుకడుగు వేయలేదు. చివరకు డాక్టర్ అనిర్బన్ మైత్రా అతనికి జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయంలో ప్రయోగాలు చేసేందుకు అవకాశం కల్పించారు.



అక్కడ అతను కార్బన్ నానో ట్యూబులు, యాంటీబాడీలను ఉపయోగించిన కాగితం ఆధారిత సెన్సార్ నమూనాను అభివృద్ధి చేశాడు. 2012లో అతని పరిశోధనకు 'ఇన్‌టెల్ ఇంటర్నేషనల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఫెయిర్'లో గ్రాండ్ ప్రైజ్ లభించింది. తదుపరి అతనికి 'స్మిత్‌సోనియన్ అమెరికన్ ఇంజెన్యుటీ యూత్ అవార్డ్' వంటి అనేక పురస్కారాలు దక్కాయి. అతను తయారు చేసిన సెన్సార్‌ను సాధారణ వైద్య పరీక్షగా పరిగణించడానికి ముందు విస్తృతమైన క్లినికల్ పరీక్షలు, నమూనా పరిశోధనలు, నియంత్రణ అనుమతులు అవసరం. అయినప్పటికీ, కేన్సర్ గుర్తింపు చికిత్సలో దీనిని చారిత్రక ముందడుగుగా పేర్కోవాలి. తిరస్కరణలు మన ప్రయాణానికి ముగింపు కాదని, అవి విజయానికి దారిచూపే మెట్లు అనే గొప్ప పాఠాన్ని జాక్ కథ మనకు స్పష్టం చేస్తుంది. వయసు కాదు ఆలోచన, పట్టుదల, నేర్చుకోవాలనే తపన మన సామర్థ్యాన్ని నిర్ణయిస్తాయని గుర్తుచేస్తుంది.

# ప్రజాస్వామ్య విలువల రక్షణలో సిఇసి విఫలం

## హనుమకొండలో ఇండియా కూటమి ప్రజాస్వామ్య పరిరక్షణ శంఖారావం

## పాల్గొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సిపిఐ, సిపిఎం నాయకులు

## జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్





**ప్రజాపక్షం/హనుమకొండ :** జాతీయ స్థాయిలో ఇండియా కూటమి ఇచ్చిన పిలుపు మేరకు హనుమకొండ జిల్లాకేంద్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో భాగంగా సోమవారం అంబేద్కర్ సెంటర్ నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కెఆర్.నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి, సిపిఐఎం జిల్లా జి.ప్రభాకర్‌రెడ్డి, న్యూ డెమొక్రసీ, తెలంగాణ జన సమితి జిల్లా నాయకులు నున్నా అప్పారావు, చిల్లా రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్ ఎదుట కేంద్రఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్‌కుమార్ దిష్టిబొమ్మ దహనం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కె.ఆర్.నాగరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఎన్నికల సంఘం విఫలమైందని మండిపడ్డారు. స్వయంప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్ వ్యవస్థ ను కేంద్రంలోని అధికార పార్టీ తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, తొలగించిన అర్హులైన ప్రతి ఒక్క ఓటును వెంటనే పునరుద్ధరించాలని, వివాదాస్పదంగా మారిన ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు నేదునూరి జ్యోతి, సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, టిఎస్ మేరా కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ సంగ వెంకట్రాజం, కాంగ్రెస్, సిపిఎం నేతలు ఒడితల ప్రణవ్, దుద్దిల్ల శ్రీనుబాబు, మార్క విజయ్‌కుమార్, ఎస్.వాసుదేవరెడ్డి, గొడుగు వెంకట్, టి.ఉప్పలయ్య, చక్రపాణి, తౌటం ఝాన్సీరాణి రవీందర్, పులి ప్రియాంక, చందుపట్ల రాజీరెడ్డి, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇవి. శ్రీనివాస్ రావు, బత్తిని శ్రీనివాస్, కూచన రవళి, పుల్లా పద్మావతి, దొమ్మటి సాంబయ్య, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

**తొర్రూరు :** భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి నేతలు తొర్రూరు పట్టణ కేంద్రంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. విశ్రాంతి భవనం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, మండల కార్యదర్శి బందు మహేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోత్కూరి రవీంద్రాచారి, మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి, బిఎస్‌పి మండల అధ్యక్షులు ప్రసాద్, న్యూడెమోక్రసీ నాయకులు ఆలకుంట్ల సాయిలు, తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్‌కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని, మంగళపల్లి రాంచంద్రయ్య, సోమ రాజశేఖర్, ఓమ బిక్షపతి, గణపురం లక్ష్మణ్, పేరబోయిన కిరణ్, ఊడుగుల రాములు, జక్కుల యాకయ్య, శ్రీరాం పుల్లయ్య, ముద్దసాని సురేశ్, ప్రసాద్, బంధు వెంకన్న పాల్గొన్నారు.



## ఉపాధి కోల్పోతున్న కూలీలకు పరిహారం

# ఇవ్వడంలో అధికారుల నిర్లక్ష్యం




## వ్యవసాయ కార్మిక సంఘం వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్రాజం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కింద వ్యవసాయ భూములను సేకరిస్తున్న జిల్లా అధికారులు ఆ భూముల్లో ఉపాధి కోల్పోతున్న కూలీలకు పరిహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదునూరి వెంకట్రాజం, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలకర శ్రీనివాస్ అన్నారు. సోమవారం బాధిత కూలీలతో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో వారు మాట్లాడారు. 2013లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూసేకరణ చట్టంకు సవరణలు తీసుకువస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2017 భూసేకరణ చట్టం చేసి అందుకు అనుగుణంగా రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, కంపెనీల నిర్మాణం, రోడ్లు వంటి వాటికోసం భూములను సేకరిస్తుండగా, రైతులకు మార్కెట్ రేటుకు మూడింతలు పరిహారం ఇస్తూనే అదే భూముల్లో ఇప్పటివరకు ఉపాధి పొందిన నిరుపేద వ్యవసాయ కూలీలకు సైతం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద పరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు. భూసేకరణలో భాగంగా గ్రామసభల్లో రైతుల ఆమోదంతో పాటు అట్టి భూమి సేకరించడం వల్ల వస్తున్న సామాజిక పరిస్థితులను అంచనా వేస్తూ భూమిలేని వ్యవసాయ కూలీలు, చేతివృత్తుల వారు, పశుపోషకులను సైతం పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునగాల బిక్షపతి, కర్రే లక్ష్మణ్, విసికె పార్టీ జిల్లా అధ్యక్షులు కన్నాల రవితో పాటు సిపిఐ నాయకులు కొట్టేపాక రవి, మాదాసు యాకుబ్, బొట్టు బిక్షపతి, సునీల్, ఇలా సాగరం వీరయ్య, జేరిపోతుల ఏసోబు, జేరిపోతుల సారంగపాణి ఇలా సాగరం సమ్మయ్య, పూల విజయ, తొట్ల భాగ్య, ఈగ నరసమ్మ, మామిండ్ల లక్ష్మి పాల్గొన్నారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ వాజ్‌పాయ్‌కి అందజేశారు.

# ఆర్‌టిసి ఎన్నికల్లో ఇయు కూటమిని గెలిపించండి

## సిపిఐ, ఎఐటియుసి నేతల విజ్ఞప్తి



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్‌టిసి ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ, ఎఐటియుసి నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్, టిఎంయు (థామస్‌రెడ్డి) యూనియన్లకు చెందిన రాష్ట్ర నాయకులు ఖమ్మం డిపోలో ప్రచారం నిర్వహించారు. ఖమ్మం రీజియన్‌లో ఎంప్లాయీస్ యూనియన్, ఎన్ఎంయు, టిఎంయు కూటమికి ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం చెందిందని, కార్మికుల డిమాండ్లు నెరవేరాలంటే ఖమ్మం రీజియన్‌లో ఎన్ఎంయు కాగడ గుర్తుకు, రాష్ట్ర గుర్తింపుకు సంబంధించి బస్సు గుర్తుకు ఓటేసి గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆర్‌టిసి కార్మికులను మోసం చేసిన అశ్వద్ధామరెడ్డి మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యారని ఆ మోసాలను కార్మికులు తిప్పికొట్టాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాబు, తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు థామస్‌రెడ్డి, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఎండి.మౌలానా, ఎఐటియుసి, సిపిఐ నాయకులు ఎస్‌కె జానిమియా, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, శింగు నర్సింహారావు, గాదె లక్ష్మినారాయణ, ఏనుగు గాంధీ, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాటి అప్పారావు, పిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**మెదక్ :** ఆర్‌టిసి సంస్థ పరిరక్షణ ఆర్‌టిసి ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు పానుగంటి నందం కోరారు. సోమవారం మెదక్ ఆర్‌టిసి డిపో ఎదుట ఎన్నికల ప్రచార శిబిరంలో కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు ఈనెల 9న జరిగే ఆర్‌టిసి కార్మిక ఎన్నికల్లో బస్సు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి డి. కేశవులు, బీడీ సంఘం జిల్లా కార్యదర్శి అయ్యవారు లక్ష్మణ్, బానోత్ రాంచందర్, ఎర్రదాసు, కొండి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




**సిద్దిపేట అర్బన్ :** కార్మికుల పట్ల కార్మిక సంఘాల పట్ల కాంగ్రెస్ పార్టీకి నిజాయితీ లేదని ఎంప్లాయీస్ యూనియన్ టిఎంయు ఎన్ఎంయు సంఘాల జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న అన్నారు. సోమవారం సిద్దిపేట ఆర్‌టిసి డిపోలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ గెలుపు కోసం జెఎసి సంఘాలు కష్టపడి పని చేస్తే ప్రస్తుత కార్మికుల ఎన్నికలలో కాంగ్రెస్ అదే కార్మికులపై కుట్రలు పన్నుతోందన్నారు. పోరాడే సంఘాలని కలుపుకొని జెఎసిగా ఏర్పడ్డామని కార్మికుల కోసం నిరంతర పోరాటాలు నిర్వహిస్తామని కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలు చేస్తామన్నారు. కార్మికులు పోరాడే సంఘాలని ఎన్నికలలో గెలిపించుకోవాలని సూచించారు. సంబంధం లేని వారు ఆర్‌టిసి ఎన్నికలలో పోటీ చేస్తున్నారని, కార్మికులు వారి కుట్రను పసిగట్టి, కార్మికుల కష్టాలు తెలిసిన వాళ్లు ఆర్‌టిసితో అనుబంధం ఉన్న వారిని గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శేషు, రీజనల్ ప్రెసిడెంట్ లోహిత్‌రావు, నాయకులు రవీందర్, మల్లేశం, బిఎస్‌గౌడ్, డివై రెడ్డి, రాములు, బాలు, ఎల్లయ్య పాల్గొన్నారు.





## కామ్రేడ్ బందగి కుటుంబానికి సిపిఐ అండ

సంస్మరణ సభలో నివాళులర్పించిన సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యం, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ

**ప్రజాపక్షం/డిండి :** కామ్రేడ్ బంధగి మృతి కుటుంబానికి తీరని లోటు అని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా డిండి మండలంలోని కందుకూరు గ్రామంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దీన్ కుమారుడు అమరజీవి కామ్రేడ్ బందగి సంస్మరణ సభలో పాల్గొని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంలు కామ్రేడ్ బంధగి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ బందగి మృతి కుటుంబానికి పార్టీకి తీరని లోటు అని మైనోద్దీన్ కుటుంబానికి సిపిఐ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈ సంస్మరణ సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరిరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, వారితో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకటరమణ, ఏఐవైఎఫ్ నల్గొండ జిల్లా అధ్యక్షులు నవీన్, దేవరకొండ మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, మండల సహాయ కార్యదర్శులు శైలేష్, విజేందర్‌రెడ్డి, రవీందర్‌శర్మ, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్రామశాఖ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

## కాటం రామకృష్ణ మృతి బాధాకరం



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ కాటం అంజమ్మ కుమారుడు కాటం రామకృష్ణ ఆదివారం ప్రమాదంలో మరణించారు. ఈ వార్త తెలుసుకున్న సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పడమటిపల్లి గ్రామంలో రామకృష్ణ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రామకృష్ణ కుటుంబం మొదటి నుండి కమ్యూనిస్టు పార్టీలో సభ్యులుగా ఉన్నారని, వారి అమ్మ గ్రామ ఉప సర్పంచ్‌గా గ్రామ ప్రజలకు పార్టీకి అనేక సేవలు అందించారని కొనియాడారు.రామకృష్ణ మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. కుటుంబానికి సిపిఐ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, ఎంఎల్‌సి, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యనాయక్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

## సర్వోత్తమ్‌రెడ్డి విజయం కోసం శ్రమించాలి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డితో కలిసి ప్రత్యేక సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మిర్యాలగూడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా చేపట్టాల్సిన ప్రచార వ్యూహాలు, పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియ, ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డు పరిధిలో ఉన్న పట్టభద్రుడిని నేరుగా సంప్రదించి, ఓటు హక్కుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకునేలా నాయకులు బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారం

**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 131 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 73, సర్వే ల్యాండ్స్ 12, మున్సిపాలిటీ 10, వ్యవసాయ 6, జిల్లా పరిషత్ 5, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 4, విద్య శాఖ 3, గ్రామీణ అభివృద్ధి 2, పంచాయతీరాజ్ 2, ఉపాధి కల్పన 2, అటవీ 2, పంచాయతీ 2, మైన్స్, వైద్య ఆరోగ్య, పౌరసరఫరాల, ఇరిగేషన్, లేబర్, సమాచార శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, బీసీ వెల్ఫేర్, శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు కృతిక, సాత్విక్, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల పాల్గొన్నారు.



# రైతులకు 16 గంటలూ నాణ్యమైన విద్యుత్

### సిపిఐ ఆధ్వర్యంలో ర్యాలీ, ఎస్సీ కార్యాలయం ముందు ధర్నా



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** రైతులకు పంటల సాగుకు అవసరమైన 16 గంటల నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) యాదాద్రి భువనగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో రైతులకు 16 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని విద్యుత్ శాఖ ఎస్సీ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. ముందుగా గంజ్ లోని సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయం నుండి ర్యాలీ ప్రారంభమై అంబేద్కర్ చౌరస్తా మీదుగా ఎస్సీ కార్యాలయం వరకు కొనసాగింది అనంతరం ఎస్సీ కార్యాలయంలోని ప్రధాన ద్వారం ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ఇప్పటికే పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంటున్న నేపథ్యంలో, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా మరింత కీలకంగా మారిందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాగునీటి కోసం ఆధారపడుతున్న బోర్లు, వ్యవసాయ మోటార్లకు నిరంతర విద్యుత్ అవసరమని తెలిపారు. రైతులు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్న సమయంలో విద్యుత్ సరఫరాలో కోతలు, అంతరాయాలు ఏర్పడితే పంటలపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. ఎస్సీ కందాల సురేష్ ధర్నా వద్దకు వచ్చి సంబంధిత డీఈ మరియు ఏఈలతో మాట్లాడి ఎక్కడైతే సమస్య ఉందో అక్కడ సమస్యను పరిష్కరించి పై అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలపడం జరిగింది అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు గోద శ్రీరాములు ఎండి ఇమ్రాన్, కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, పెరబోయిన మహేందర్, ఏశాల అశోక్ జిల్లా సమితి సభ్యులు కల్లేపల్లి మహేందర్, గాదెగానీ మాణిక్యం, అన్నెపు వెంకట్, అన్నెమైన వెంకటేష్, ఉట్కూరి నరసింహ, మారుపాక వెంకటేష్, అనంతుల రాంచంద్రం, గోదల్ల భూషణ్, దాసరి లక్ష్మయ్య, పల్లె మల్లరెడ్డి, సోమన సబిత, బుషపాక నర్సింహ, జక్క దయాకర్ రెడ్డి, కందుల మధు, ఆలేటి బాలరాజు, పల్లె శ్రీను, పేరబోయిన బంగారి, వడ్లకొండ భారతమ్మ, పెరబోయిన పెంటయ్య, బస్వయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# డిపిఆర్ పాఠశాలలో అవినీతి ఆరోపణలపై విద్యార్థి సంఘాల ధర్నా

### ఫీజుల వసూళ్లు,హాస్టల్ నిర్వహణపై సమగ్ర విచారణ జరపాలి

### విద్యార్థుల భద్రత,మౌలిక వసతులపై అధికారులు దృష్టి సారించాలి



**ప్రజాపక్షం/చందంపేట:** దేవరకొండ పట్టణంలోని డిపిఆర్ పాఠశాలలో ఫీజుల వసూళ్లు, హాస్టల్ నిర్వహణ, విద్యార్థుల భద్రత, మౌలిక వసతులకు సంబంధించి పలు ఆరోపణలు వెలువడుతున్న నేపథ్యంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. పాఠశాలలో జరుగుతున్న అక్రమాలు,అవకతవకలపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. చందంపేట మండలం చిత్రియాల గ్రామానికి చెందిన తల్లిదండ్రులు బందెల వెంకటయ్య,సుగూరి సత్తయ్య తదితరులు సోమవారం పాఠశాలకు వెళ్లి ఫీజుల వసూళ్లపై యాజమాన్యాన్ని ప్రశ్నించారు.తమకు ఎదురైన ఇబ్బందులపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరారు.ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జాతీయ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పానుగంటి శ్రీకాంత్ మాట్లాడుతూ.. పాఠశాలలో ఫీజుల వసూళ్లపై వస్తున్న ఆరోపణలపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గతంలో పాఠశాలకు సంబంధించి ఫిర్యాదులు వచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు.విచారణపై స్పష్టమైన నివేదిక ఇవ్వకపోతే ఎంఈఓ,డీఈఓ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి కుంభం నరేష్ మాట్లాడుతూ యూకేజీ విద్యార్థుల నుంచి పుస్తకాల పేరుతో రూ.3,800 వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు విచారణ జరపాలని కోరారు. పాఠశాలలో మూడు నెలలు చదివిన అనంతరం గురుకుల పాఠశాలలో సీటు రావడంతో టీసీ కోసం వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పూర్తి సంవత్సరానికి సంబంధించిన ఫీజు వసూలు చేయడం సమంజసం కాదన్నారు.ఈ విషయంపై యాజమాన్యం నుంచి పూర్తి వివరాలు సేకరించి అధికారులు వాస్తవాలను వెల్లడించాలని కోరారు.ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శివ మాట్లాడుతూ పాఠశాల హాస్టల్ నిర్వహణకు సంబంధించిన అనుమతులపై అధికారులు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, భద్రతా ప్రమాణాలను పరిశీలించి, నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనేది నిర్ధారించాలన్నారు.ఏఐవైఎఫ్ చందంపేట మండల కార్యదర్శి జూలూరి మహేష్ మాట్లాడుతూ.. పాఠశాల పక్కనే లోతైన నీటి బావి ఉండటం, టాయిలెట్లకు సమీపంలో విద్యార్థులు భోజనం చేస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఈశ్వర్ మాట్లాడుతూ విఫీజుల వసూళ్లు, హాస్టల్ నిర్వహణ, విద్యార్థుల భద్రత, పారిశుద్ధం, మౌలిక వసతులు తదితర అంశాలపై విద్యాశాఖ అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి నివేదికను బహిర్గతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**ప్రిన్సిపాల్ వివరణ :** పాఠశాల ప్రిన్సిపాల్ నిదీష్ మాట్లాడుతూ ఫీజుల వసూళ్లకు సంబంధించిన పూర్తి వివరాలు పాఠశాల యాజమాన్యాన్ని అడగాలని తెలిపారు. ఫీజుల అంశం యాజమాన్యానికి సంబంధించినదని,తనకు పూర్తి సమాచారం లేదన్నట్లుగా ఆయన వివరణ ఇచ్చారు.



## జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేసి న్యాయ విచారణ జరపాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట :** దేశవ్యాప్తంగా ఓట్ల చోరీకి కారణమైన కేంద్ర ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేసి న్యాయ విచారణ జరుపాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, టిజెఎస్ జిల్లా నాయకులు కుంట్ల ధర్మార్జున్, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తూ జ్ఞానేష్ కుమార్‌ను అడ్డం పెట్టుకొని దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్ల చోరీకు పాల్పడిందని విమర్శించారు. కేంద్ర ఎన్నికల కమిటిలోని సభ్యులు జ్ఞానేష్ కుమార్ నిర్ణయాలను వ్యతిరేకించినప్పటికి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొని ఓట్ల చోరీకి పాల్పడ్డాడని ఆరోపించారు. వెంటనే కేంద్ర ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్‌ను అరెస్టు చేసి విచారణ జరుపాలని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఓట్ల చోరీపే దశలవారీగా జరిగే ఉద్యమ కార్యాచరణలో ప్రతి ఒక్కరు భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు చకిలం రాజేశ్వర్ రావు, అనంతుల మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, మండారి డేవిడ్ కుమార్, కొత్తపల్లి శివకుమార్, వెలుగు వెంకన్న, కెక్కిరేణి శ్రీనివాస్, కుమ్మరి కుంట్ల వేణుగోపాల్‌తోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## కామన్ డైట్‌ను పూర్తిస్థాయిలో ఇంప్లిమెంట్ చేయాలి: ఏఐఎస్ఎఫ్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఎస్సీ, ఎస్టీ ,బీసీ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లలో గురుకుల పాఠశాలలో, మైనారిటీ పాఠశాలలలో కామన్ డైట్ ను పూర్తిస్థాయిలో ఇంప్లిమెంట్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న ఎస్సీ ఎస్టీ బిసి ప్రభుత్వ సంక్షేమ పాఠశాలల్లో గురుకుల పాఠశాలల్లో కామన్ డైట్ లో పూర్తిస్థాయిలో అమలు చేయాలని అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ ప్రభుత్వ పాఠశాలల్లో గురుకుల పాఠశాలల్లో కామన్ డైట్ అమలు చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ మధ్యకాలంలో సంక్షేమ హాస్టల్లో సందర్శనలో భాగంగా విద్యార్థులు తెలియజేశారని ఆయన చెప్పారు. జిల్లాలో రెగ్యులర్ వార్డెన్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వార్డెన్ లో ఇన్చార్జిల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేకమైన శ్రద్ధ చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కందుల మధు, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి చేడే చంద్రయ్య ,జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఉప్పల ముత్యాలు, చెక్క వెంకటేష్, సిపిఐ నాయకులు కల్లెపల్లి మహేందర్ పేరబోయిన పెంటయ్య , బంగారి ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు జాను, లోకేష్ సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పెండెన్సీ తగ్గించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ :** అన్ని స్థాయిల్లో ప్రజావాణి ఫిర్యాదుల పెండెన్సీని తగ్గించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మండల,డివిజన్ స్థాయి ప్రజావాణిలో స్థానిక సంస్థలు,రెవెన్యూ అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల పెండెన్సీ ఎక్కువగా ఉందని,వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్,స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డిలను ఆదేశించారు.జిల్లా అధికారులందరూ హాస్టళ్ల తనిఖీ నిర్వహించి తప్పనిసరిగా నివేదిక సమర్పించాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 11 అంశాల్లో సాధించిన లక్ష్యాలపై ఈ నెల6 లోగా నివేదిక ఇవ్వాలని,త్వరలో నిర్వహించనున్న "దిశ" సమావేశానికి నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, సీఎం కార్యాలయం, వీఐపీలు, చీఫ్ సెక్రటరీ, ప్రజావాణి, సీపీఆర్వో ద్వారా వచ్చిన రిఫరెన్సులకు తీసుకున్న చర్యలపై రాతపూర్వక సమాధానం ఇవ్వాలని, సెప్టెంబర్ నెల పర్యటన వివరాలను సమర్పించాలని, పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలకు వెంటనే స్పందించి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలాల వినియోగం పెరిగే అవకాశం ఉందని, నీటిని పొదుపుగా వాడుకోవాలని, తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని,ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, ఈ నెల 8 లోగా చేయూత పింఛన్ల దరఖాస్తులను పరిశీలించి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, డీఆర్‌ఓ శేఖర్ రెడ్డి,డీఆర్‌ఓ దశరథ్ పాల్గొన్నారు.

## సహకార రంగంతోనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం

### నూతన భవనాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ నూతన భవనాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య సోమవారం ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి బ్యాంక్ ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.సహకార రంగాన్ని బలోపేతం చేయడం ద్వారానే రైతులు, వ్యవసాయదారులు, గ్రామీణ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఆధునిక వసతులతో అందుబాటులోకి వచ్చిన ఈ నూతన భవనం ద్వారా ఖాతాదారులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణంలో సేవలు లభిస్తాయని తెలిపారు. రైతులకు సమయానికి అవసరమైన పంట రుణాలు, ఇతర ఆర్థిక సహాయం అందించే దిశగా బ్యాంకింగ్ ప్రక్రియలను మరింత సులభతరం చేయాలని ఆయన అధికారులను కోరారు. యాదగిరిగుట్ట పట్టణం నేడు ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక క్షేత్రంగా రూపాంతరం చెందుతోందని, పెరిగిన ప్రజల అవసరాలు మరియు భక్తుల తాకిడికి అనుగుణంగా పట్టణంలో బ్యాంకింగ్ మౌలిక వసతులను వేగంగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. సహకార బ్యాంకింగ్ వ్యవస్థ ఎల్లప్పుడూ రైతులకు అండగా నిలుస్తూ, గ్రామీణ ఆర్థిక ప్రగతికి చోదక శక్తిగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాని భరత్ గౌడ్, కౌన్సిలర్లు బూడిద మధు, కో ఆప్షన్ సభ్యురాలు, బండి జంగమ్మ,కాంగ్రెస్ పార్టీ,మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, పిఎసిఎస్ చైర్మన్ చీర శ్రీశైలం, కానీ బాలరాజ్, కాటపర్తిని ఆంజనేయులు,బ్యాంక్ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రైతులు మరియు బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

### రూ.20లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

### 8 చోరీ కేసులు ఛేదించిన పోలీసులు...

### ఐదుగురు నిందితులు అరెస్ట్ : ఎస్పి కె. నరసింహ వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** జల్సాలకు అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గత సంవత్సర కాలంగా వివిధ ప్రాంతాల్లో ఇళ్ళను, వ్యవసాయ బావుల వద్ద ఉన్న మోటార్లను, వైన్స్ షాపులను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను ఆత్మకూర్(ఎస్) పోలీసులు అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పి కె. నరసింహ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. గత ఆగష్టు 30వ తేదీ రాత్రి ఆత్మకూర్(ఎస్) మండలం పాత సూర్యాపేట గ్రామానికి చెందిన బొక్క వెంకట్ రెడ్డి ఇంట్లో దొంగతనం జరిగింది. ఈ ఘటనలో వ్యవసాయ మోటర్, కేబుల్ వైర్, సిసి కెమెరా హార్డ్ డిస్క్, ఇన్వర్టర్, బ్యాటరీ, బంగారు ఆభరణాలు, నగదు తదితర వస్తువులు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆత్మకూర్(ఎస్) పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం తెల్లవారుజామున పాత సూర్యాపేట ఎక్స్ రోడ్డు వద్ద సూర్యాపేట దంతాలపల్లి రహదారిపై ఆత్మకూర్(ఎస్) ఎస్ఐ ఎం. ఐలయ్య తన సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహించారు. మూడు మోటర్ సైకిళ్లపై ఐదుగురు వ్యక్తులు ఒక వ్యవసాయ మోటార్‌ను తీసుకుని అనుమానాస్పదంగా వెళ్తుండటాన్ని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా పాత సూర్యాపేటకు చెందిన సురకంటి నరేష్ అలియాస్ నరేష్ రెడ్డి, మేరెడ్డి మహిపాల్ రెడ్డి అలియాస్ ప్రీతం రెడ్డి, పన్నాల గిరిధర్ రెడ్డి, శివరాత్రి అరవింద్ అలియాస్ అరుణ్, కాసాల ఉదయ్ కిరణ్ రెడ్డి అలియాస్ కిరణ్ రెడ్డిగా గుర్తించారు. పోలీసుల విచారణలో నింధితులు గత సంవత్సర కాలంగా గ్రూపుగా ఏర్పడి సూర్యాపేట జిల్లాలోని వివిధ పోలీసే స్టేషన్ల పరిధిలో, అలాగే నల్లగొండ జిల్లా నకిరేకల్ పరిధిలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు తెలిపారు. నింధితుల విచారణలో ఇప్పటి వరకు ఆత్మకూర్(ఎస్) పోలీస్ స్టేషన్ పరిధిలో 2, చివ్వెంల పరిధిలో 2, సూర్యాపేట రూరల్ 3, నల్లగొండ జిల్లా నకిరేకల్ 1 కేసులు మొత్తం 08 చోరీ కేసులను ఈ ముఠా పాల్పడినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. 8 కేసులకు సంబంధించి రూ.1,20,000 నగదు, సుమారు 7.5 తులాల బంగారు ఆభరణాలు, సుమారు 20.5 తులాల వెండి వస్తువులు వీటి విలువ సుమారు రూ.20లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటితోపాటు ఎలక్ట్రానిక్ వస్తువులు వన్‌ప్లస్ 55 ఇంచుల స్మార్ట్ టివి 1, సామ్‌సంగ్ 43 ఇంచుల స్మార్ట్ టివి 1, టిపిఎల్ 43 ఇంచుల స్మార్ట్ టివి 1, బోట్ సౌండ్ బార్ 1, ఎల్‌జి మైక్రో ఓవెన్ 1, ఇన్వర్టర్ 1, బ్యాటరీ 1. వ్యవసాయ పరికరాలు 5 హెచ్‌పి సబ్‌మర్సిబుల్ మోటార్లు 2, కరెంట్ వైరు సుమారు 30 మీటర్లు, వివిధ బ్రాండ్లకు చెందిన 740కి పైగా మద్యం సీసాలు/క్వార్టర్లు, 3 మోటార్ సైకిళ్లు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అంతర్ జిల్లా దొంగల ముఠాను పట్టుకోవడంలో కృషి చేసిన ఆత్మకూర్(ఎస్) సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. ఐలయ్య, పోలీసు సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో డిఎస్‌పి వి. ప్రసన్న కుమార్, ఆత్మకూర్(ఎస్) ఎస్ఐ ఐలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల అదృశ్యంపై పాఠశాల నిర్లక్ష్యం

### తల్లిదండ్రుల ఆరోపణ

**ప్రజాపక్షం/భూనాథపురం:** మండల కేంద్రంలోని మంగళవారిపేట ప్రభుత్వ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ఇద్దరు గిరిజన బాలికలు వారం రోజుల క్రితం పాఠశాల నుండి వెళ్ళిపోయినా యాజమాన్యం పట్టించుకోలేదని వారి తల్లిదండ్రులు ఆరోపించారు. దీనితో బాలికలు కిడ్నాప్‌కు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కిడ్నాప్ చేసిన వ్యక్తులు భయభ్రాంతులకు గురిచేయడంతో తీవ్ర మనోవేదనకులోనైన బాలికలు క్రిమిసంహారక మందు తాగినట్లు తెలిపారు. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. విద్యార్థినులు పాఠశాలలో లేకపోయినా తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడం, భద్రతా చర్యలు తీసుకోకపోవడం పాఠశాల యాజమాన్యం, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌తో పాటు బాధ్యులందరిపై, బాలికలను కిడ్నాప్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు. బాధిత బాలికలకుమెరుగైనవైద్యంఅందించిప్రభుత్వంఅండగానిలవాలని విజ్ఞప్తి చేశారు.

## జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలి



**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని వెంకటాపూర్ జర్నలిస్టులు ములుగు కలెక్టర్ హేమంత్ బొర్కడే వాసుదేవరావును కోరారు. ఈ మేరకు వెంకటాపూర్ జర్నలిస్టులు సోమవారం ములుగు కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని కలెక్టర్ ను ప్రత్యేకంగా కలిశారు.తాము 4 సంవత్సరాలుగా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామ శివారులోని రెవిన్యూ భూమిలో గుడిసెలు వేసుకొని మోకా మీద ఉన్నామని ఆయనకి తెలిపారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశంపై పూర్తి నివేదిక అందించాలని కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జీ కి సిఫారస్ చేసినట్లు జర్నలిస్టులు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వెంకటాపూర్ జర్నలిస్టులు బేతి సతీష్ యాదవ్, ఒద్దుల మురళీ, పిల్లలమర్రి శివ, గునిగంటి హరీష్, మామిడిశెట్టి ధర్మ తేజ, తదితరులు ఉన్నారు.

## స్కావెంజర్ల ఐదు నెలల వేతనాలు విడుదల చేయాలి: ఎఐటియుసి

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** పెండింగ్‌లో ఉన్న స్కావెంజర్ల ఐదు నెలల వే




తనాలను వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, కార్యదర్శి గన్నారపు రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో గొర్రె విజయ అధ్యక్షతన నిర్వహించిన స్కావెంజర్ల జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. స్కావెంజర్ల పేర్లను ప్రభుత్వ రిజిస్టర్‌లో నమోదు చేసి గుర్తింపు కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరారు. నెలకు రెండు ప్రభుత సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి గుండె బద్రి, దామెర కృష్ణ, స్కావెంజర్ల జిల్లా కార్యదర్శి రాయరాకుల కోమల, జెర్రిపోతుల విజయ, మేరీ, ఎం డి యాకూబీ, నిర్మల, రామారావు, సదిరం అరుణ, సునీత, సదిరం రజిత, బేబీ, సవిత, మొగులాభి, కొత్తగట్టు రజిత, గ్యార మంగమ్మ, గంగమ్మ , అరుణ, మమత, శిరీష, జెర్రిపోతుల రాధ, తదితరులు పాల్గొన్నారు.

## ఓవర్‌లోడ్ విద్యుత్ సమస్యపై అధికారుల స్పందన




**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలంలోని చింతలతండ గ్రామరైతులు ఎదుర్కొంటున్న ఓవర్‌లోడ్ విద్యుత్ సమస్యపై ప్రజాపక్షం దినపత్రికలో వచ్చిన వార్తా కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు.ఎస్ఇ సామ్య నాయక్,డిఇ మల్లికార్జున్,ఎడిఇ రాజేశ్వర్‌రావు,ఎఇ కుమారస్వామి త దితరలు సోమవారం గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను పరిశీలించి ట్రాన్స్ ఫార్మర్‌పై అధికలోడు కారణంగా విద్యుత్ మోటర్లు కాలిపోతున్నాయని రైతులు అధికారుల దృష్టికి తీసుకెల్లారు.ఈసంధర్భంగా స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ త్వరలోనే విద్యుత్ సమస్యను పరిష్కరించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అదికారులు రైతులకు హామీ ఇచ్చారు.కార్యక్రమంలో గ్రామఉపసర్పంచ్ మా లోతు భాస్కర్ మాలోతు పూజారి,గ్రామరైతులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : జిసిడిఓ గాయత్రి

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మహబూబాబాద్ జి ఈ సి ఓ వై గాయత్రి విద్యార్థినులకు సూచించారు.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ లో సోమవారం హాస్టల్లో ఉండే బాలికలకు పెట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా పయనించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉపేందర్, కేర్ అనూష, విద్యార్థినులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణంకై రోడ్డుపై వంట వార్పు

**ప్రజాపక్షం/కమలాపూర్:** గత ఆరు సంవత్సరాల నుంచి కమలాపూర్ నుంచి పంగిడిపల్లికి వెళ్ళే రహదారి గుంతల మయంగా కావడంతో గ్రామస్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులకు, హెచ్‌పిసిఎల్ నిర్వాహకులకు, కలెక్టర్ కు విన్నవించినప్పటికి ఫలితం లేకపోవడంతో పంగిడిపల్లి గ్రామస్థులు రహదారిపై బైఠాయించి వంటవార్పు కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలిపా రు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు రావాలి.. రా వాలి.. కలెక్టర్ రావాలి.. వేయాలి... వేయాలి... రోడ్డు నిర్మాణం చేయాలి అంటూ వివిధ రకాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కమలాపూర్ తహశీల్ధార్ సురేష్ కుమార్, కమలాపూర్ ఎస్ఐ మధు, పోలీస్ సిబ్బంది ని రసన కార్యక్రమానికి వచ్చి ఆందోళన విరమించాలని గ్రామస్థులకు తెలిసినప్పటికి ఆందోళన విరమించలేదు. విషయం తెలుసుకున్న ఆర్ అండ్ బి డి ఇ ఎం లోరినా, ఎఇ జయశ్రీ నిరసన స్థలానికి చేరుకోని దసరా పండగ త ర్వాత రోడ్డు పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆ ఒందోళన విరమించారు. ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు నిర్మాణం జరగకపో తే ఆఒందోళన కార్యక్రమాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు

### జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



**ప్రజాపక్షం/జనగామ :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని, కలెక్టరేట్‌లో వెంటనే హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. 2026–27 ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై సోమవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, డిఆర్‌డిఏ, తూనికల కొలతలు, రవాణా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో 202 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. రైతులకు అందించాల్సిన సేవలు, ధాన్యం నాణ్యత ప్రమాణాలపై పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. రైతులకు ఏమైనా సమస్యలు, సందేహాలుంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 18004256605 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ధాన్యం రవాణాలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని, కొనుగోలు కేంద్రాల్లో ట్రక్ షీట్ నిర్వాహణ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. సరిపడా టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, తగినన్ని గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు ముందస్తుగా టోకెన్లు జారీ చేయాలన్నారు.ఈ సమావేశంలో డిఆర్‌డిఓభాస్కర్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి సురేష్‌రెడ్డి, డిఎం సివిల్ సప్లయ్ హతీరామ్, డిసిఓ కరుణ, ఎల్‌డిఎం ప్రతిభ, తూనికల కొలతల అధికారి ఝాన్సీ, రవాణా, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

జిల్లాలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, ఇండ్ల పురోగతిపై అదనపు కలెక్టర్ బెన్షాలోంతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు పడకల గదుల ఇళ్ల కేటాయింపుకు సంబంధించి లబ్ధిదారుల ధృవపత్రాల పరిశీలనలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. ధరఖాస్తుల పరిశీలనలో రేషన్‌కార్డు, ఆదాయ ధృవీకరణ ప త్రం కీలకంగా పరిగణించాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శఖాఖ పిడి బలరామరావు, మున్సిపల్ కమీషనర్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపిడిఒలు మహేష్ నాయక్, లావణ్యతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు



పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

**ప్రజాపక్షం/తొర్రూరు :** అర్హులైన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అందిస్తున్నామని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరు మండలం, పెద్దవంగర మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ అర్హులైన నిరుపేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాల ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రజలందరికి అందాల్సిన సంక్షేమ పథకాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో 'కాసం' షాపింగ్ మాల్ ప్రారంభం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి పట్టణంలో కాసం షాపింగ్ మాల్‌ను ప్రారంభించడం అభినందనీయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డు లో నూతనంగా 30వ షాపింగ్ మాల్ గా ఏర్పాటుచేసిన కాసం వస్త్రాలయంను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి షాపింగ్ మాల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సంస్థ ముందుకు రావడం హర్షణీయమన్నారు. కాసం షాపింగ్ మాల్ తో పాటు మాంగల్య షాపింగ్ మాల్ ఇప్పటికే నాలుగు రాష్ట్రాల్లో 145 వస్త్రాలయాలను నిర్వహిస్తూ వినియోగదారుల ఆదరణ పొందుతోందని తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం, నియోజకవర్గంలోని స్థానిక నిరుద్యోగులకు సుమారు 155 మందికి కాసం షాపింగ్ మాల్ లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. కాసం షాపింగ్ మాల్ నిర్వహిస్తున్న యాజమాన్యానికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, స్థానిక కౌన్సిలర్ వేముల జ్యోతి శ్రీకాంత్, కాసం పుల్లయ్య షాపింగ్ మాల్ నిర్వాహకుడు ఓం నమశివాయ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్, నాయకులు చల్లూరి మధు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం తగదు

### కలెక్టర్ హేమంత్ బోర్ఖడే



**ప్రజాపక్షం/ములుగు:** ప్రజావాణిలో అందిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఏ దశలోనూ నిర్లక్ష్యం వహించొద్దని, తీసుకున్న చర్యలు, ప్రస్తుత పరిష్కార స్థితిని ఉన్నతాధికారులతో పాటు ఫిర్యాదుదారులకు సకాలంలో తెలియజేయాలని సూచించారు. సోమవారం నూతన సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్, సంపత్‌రావుతో కలిసి కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ముఖ్యమంత్రి కార్యాలయ ప్రజావాణి, ప్రజాదర్బార్, గిరిజన దర్బార్‌తో పాటు వివిధ స్థాయిల్లో అందిన దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఫిర్యాదులోని సమస్య, దాని కారణాలు, రిష్కారానికి చేపట్టాల్సిన చర్యలను స్పష్టంగా పరిశీలించాలని సూచించారు. సమస్య పరిష్కారం సాధ్యం కాకపోతే అందుకు గల కారణాలను కూడా ఫిర్యాదుదారులకు తెలియజేయాలన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. నూతన సమీకృత కలెక్టరేట్‌లో ఆయా శాఖలకు కేటాయించిన కార్యాలయాలను వెంటనే ప్రారంభించి, పరిపాలనా కార్యకలాపాలను కొనసాగించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో మొత్తం 24 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వేగంగా పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియ

### ఎమ్మెల్యే దొంతి మాదవరెడ్డి



**ప్రజాపక్షం/నర్సంపేట :** నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియ ను వేగవంతం చేయాలని నర్సంపేట ఎమ్మె ల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో యూత్ కాంగ్రెస్ నాయకులతో సమావే నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. నల్గొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్‌రెడ్డి స ర్వోత్తమ్‌రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు నమోదు ప్రక్రియపై వి స్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు నమోదు చేసుకోవడానికి అర్హత ఉన్న పట్టభద్రులకు అవసరమైన సమాచారా న్ని అందించి, నమోదు ప్రక్రియ సక్రమంగా పూర్తయ్యేలా యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో ప నిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కా ర్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ యూ త్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపెల్లి సందీప్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ మోడెం ఎల్లగౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ రూపిక శ్రావణ్, మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి హరీష్ ,సింగం ప్రశాంత్, పురుషోత్తం సురేష్, బొంత రంజిత్, ఎనగందుల రాజు, కొత్తకొండ రవి వర్మ గారు, ములుకల మనీష్ పాల్గొన్నారు.

## యథావిధిగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హోదాలు, వేతనాలు

### కార్మిక సంఘాల డిమాండ్



**ప్రజాపక్షం/ వరంగల్:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని వివిధ శాఖల్లో గత 25 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రస్తుత హోదాలు, వేతనాలను యథావిధిగా కొనసాగించాలని, జిఒ, ఆర్ఐఎన్ఒ 1181 ద్వారా ఏర్పడే వేతన కోతను వెంటనే నిలిపివేయాలని జెఎసి గౌరవాధ్యక్షుడుఏల్పుల ధర్మరాజు, ఎఐటియుసి అధ్యక్షుడువేల్పుల సారంగపాణి యాదవ్, ఐఎన్‌టియూసి గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడుపాశం రవి యాదవ్‌లు డిమాండ్ చే శారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం కమిషనర్ వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి మున్సిపల్ కార్పొరేషన్‌లో సేవలందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వేతన కోత విధించడం అన్యాయమన్నారు. తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటూ విధులు నిర్వహిస్తున్న కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసే నిర్ణయాలను ప్రభుత్వం, అధికారులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ప్రస్తుత హోదాలు, వేతనాలను యథావిధిగా కొనసాగిస్తూ వారికి న్యాయం చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వేతన కోతను నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొక్క ఏలియా, సిఐటియు సంఘం ప్రధాన కార్యదర్శి జన్ను ప్రకాష్, బరుపట్ల మహేష్, మియాపురం శ్రీకాంత్, నరేష్, బహుజన సమాజ్ అధ్యక్షుడు వక్కల రణసాగర్, ఒఎస్‌సి జెఎసిఅధ్యక్షుడు కొత్తకొండ శ్రీనివాస్, డ్రైవర్ల సంఘం అధ్యక్షులు మేకల దేవేందర్ యాదవ్, నాగుల శ్రీకాంత్, పడాల రామ్మూర్తి, వక్కల సుమన్, జోగు రమేష్, భైరవైన గట్టయ్య, డిఆర్‌ఎఫ్ సంఘాల కిషన్, సాయి, సిల్వర్ శేఖర్, రవితేజ, రాజ్‌కుమార్, అశోక్, కిరణ్‌కుమార్ రెడ్డి తదితర కార్మికులు పాల్గొన్నారు.

## మోకాలి మార్పిడిలో రోబోటిక్ టెక్నాలజీ

### యశోద ఆసుపత్రి వైద్యులు




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** మోకాలి మార్పిడిలో రోబోటిక్ టెక్నాలజీతో కొత్త ముందడుగు పడిందని యశోద ఆసుపత్రి వైద్యులు తెలిపారు.యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్, సోమాజిగూడకు చెందిన ప్రముఖ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స, ఆర్థ్రోస్కోపీ, ట్రామా నిపుణులు డాక్టర్ అభిషేక్ బర్లీ మాట్లాడుతూ, రోబోటిక్ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల్లో 15 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగి ఉన్నట్లు తెలిపారు. మోకాళ్ల నొప్పి ఇక వృద్ధాప్యానికి మాత్రమే పరిమితమైన సమస్య కాదని, తీవ్రమైన మోకాలి ఆర్థరైటిస్ కారణంగా అనేక మంది నడవడం, మెట్లు ఎక్కడం, పని చేయడం, వ్యాయామం చేయడం కష్టతరమని యశోద వైద్యులు తెలిపారు. రోబోటిక్ అసిస్టెడ్ టోటల్ నీ రీప్లేస్‌మె ఆధునిక జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తోందని,సర్జన్ యొక్క అనుభవం, క్లినికల్ జడ్జ్‌మెంట్‌తో పాటు కంప్యూటర్ ఆధారిత ప్లానింగ్ , రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా ప్రతీ రోగి మోకాలికి అనుగుణంగా శస్త్రచికిత్సను మరింత వ్యక్తీకరించవచ్చునని తెలిపారు.రోబోట్ సర్జన్‌ను భర్తీ చేయదు.రోబోటిక్ మోకాలి మార్పిడి గురించి రోగులు తెలుసుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే రోబోట్ స్వతంత్రంగా ఆపరేషన్ చేయదని, రోబోటిక్ వ్యవస్థ ఒక ఆధునిక శస్త్రచికిత్స సాధనంగా పనిచేస్తూ, రోబోటిక్ టెక్నాలజీ సర్జన్‌ను భర్తీ చేయడానికి కాదని,సర్జన్‌కు మరింత మెరుగైన సమాచారం, ఖచ్చితత్వం అందించడానికి ఉపయోగపడుతుందని,ప్రతి రోగి మోకాలు భిన్నంగా ఉంటుందన్నారు.రోబోటిక్ అసిస్టెడ్ టికేర్ లో రోగి వ్యక్తిగత శరీర నిర్మాణాన్ని పరిగణనలోకి తీసుకుని శస్త్రచికిత్సను ప్లాన్ చేయవచ్చునని తెలిపారు. వరంగల్, పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో, ఇకపై ప్రతి నెల మొదటి ఆదివారం డాక్టర్ అభిషేక్ బర్లీ అందుబాటులో ఉంటారని తెలిపారు.కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న రోగులు తదుపరి కన్సల్టేషన్ కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా, వరంగల్‌లోనే నిపుణుల వైద్య సలహాలు, ఫాలోఅప్ సేవలు పొందవచ్చని డాక్టర్ అభిషేక్ బర్లీ తెలిపారు.వరంగల్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అభిషేక్ బర్లీతో పాటు అసిస్టెంట్ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నం



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమం వద్ద ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. దుగ్గొండి మండలం పొనకల్లు గ్రామానికి చెందిన గట్ల సురేందర్ తన సోదరుడు గట్ల రాజు, డ్యాగల కొమురయ్య తన సంతకాన్ని ఫోర్జరీ చేసి 2003లో తన భూమిని కబ్జా చేశారని ఆరోపిస్తూ ఈ చర్యకు పాల్పడ్డారు. తన భూమి సమస్యపై అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని సురేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీవెన్స్ కార్యక్రమం జరుగుతున్న సమయంలో కలెక్టరేట్ ఆవరణలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో అధికారులు వెంటనే స్పందించి ఆయనను అడ్డుకున్నారు. అనంతరం సురేందర్ తన సమస్యను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. తన భూమికి సంబంధించిన సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని అధికారులను కోరారు. కాగా అధికారుల నిర్లక్ష్యము వల్లే సురేందర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## మెరుగైన విద్యుత్ సరఫరాకు సత్వర చర్యలు

### 18 సర్కిళ్ల అధికారులతో టిజిఎన్‌పిడిసిఎల్ సిఎండి సమీక్ష




**ప్రజాపక్షం/హనుమకొండ :** రాబోయే రోజుల్లో విద్యుత్ డిమాండ్ ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉన్నందున, భవిష్యత్ లోడ్‌ను ముందుగానే అంచనా వేసి విద్యుత్ మౌలిక వసతులను ఇప్పటి నుంచే బలోపేతం చేయాలని టిజిఎన్‌పిడిసిఎల్ సిఎండి కర్ణాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. హనమకొండ, నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ ప్రధాన కార్యాలయం నుంచి టిజిఎన్‌పిడిసిఎల్ పరిధిలోని 18 సర్కిళ్ల ఎస్ఇలు, డిఇలతో సిఎండి కర్ణాటి వరుణ్‌రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రబీ, వేసవి కాలంలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేయాలని 18 సర్కిళ్ల ఎస్ఈ లను ఆదేశించారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని ముందుగానే అంచనా వేసి అవసరమైన చోట సామర్థ్య పెంపు చేపట్టాలని, మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను ఆలస్యం లేకుండా రిపేర్ చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రతి సర్కిల్‌లో అధికారులు తమ హెడ్‌క్వార్టర్లలో అందుబాటులో ఉంటూ, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించి విద్యుత్ మౌలిక వసతుల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని సిఎండిస్పష్టం చేశారు.రోజువారీగా విఫలమైన ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలనిసూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లను తరలించే సమయంలో తప్పనిసరిగా డిపార్ట్‌మెంట్ వాహానాలను వినియోగించాలని అధికారులను ఆదేశించారు .డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్‌ను నిరంతరం పర్యవేక్షించాలని, 60 శాతానికి పైగా లోడ్ ఉన్న డిటిఆర్‌లను ముందుగానే గుర్తించి, అవసరమైన ప్రాంతాల్లో సామర్థ్య పెంపు లేదా అదనపు డిటిఆర్‌ల ఏర్పాటు చేపట్టాలని ఆదేశించారు. టాంగ్ టెస్టర్ రీడింగ్‌లను క్రమం తప్పకుండా తీసుకుని లోడ్ బ్యాలెన్సింగ్ చర్యలు చేపట్టాలని సూచించారు.అలాగే 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్లలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి కెపాసిటర్ బ్యాంకులు, కెపాసిటర్ సెల్స్ ఏర్పాటు చేసి పవర్ ఫ్యాక్టర్‌ను మెరుగుపరచాలని తెలిపారు.వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సిఎండి కర్ణాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ టి. మధుసూదన్, చీఫ్ ఇంజనీర్లు తిరుమల్ రావు, అశోక్, గౌతమ్ రెడ్డి, సురేందర్, జిఎంలు వాసుదేవ్, ప్రభావతి , శ్రీనివాస్, విజేందర్ రెడ్డి, బాబు రావు, తదితరులు పాల్గొన్నారు.

12 ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
మంగళవారం
06-10-2026
www.prajapaksham.in

నరేష్ వికె, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు

# రీల్





# 'డ్యూ డేట్' రెగ్యులర్ షూటింగ్ షురూ

లోమేష్ పుడిపెద్ది హీరోగా, జయశ్రీ హీరోయిన్‌గా, ప్రణీత పట్నాయక్, విజ్ఞానిలు ముఖ్యపాత్రల్లో రూపొందుతున్న చిత్రం 'డ్యూ డేట్' ఎలూరు శ్రీను నిర్మాతలుగా ఆనంద్.కె. దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఇటీవల ఘనంగా పూజా కార్యక్రమాలు జరుపుకున్న సంగతి తెలిసిందే. కాగా ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ రోజు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హీరో, హీరోయిన్ ఇతర ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ప్రజెంట్ బర్నింగ్ ఇష్యూ ఆధారంగా అల్లుకున్న ఈ కమర్షియల్ కోర్ట్ రూమ్ డ్రామా ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా ఉత్కంఠభరితంగా ఉంటుంది. ప్రతి మనిషి, ప్రతి నెలా గుర్తుపెట్టుకునే డ్యూ డేట్ చుట్టు పూర్తి వాణిజ్య అంశాలతో అల్లుకున్న కథ ఇది. టైటిల్ దగ్గర నుంచి సినిమాలోని ప్రతి అంశం ప్రేక్షకులకు కొత్తదనంతో పాటు పూర్తి సంతృప్తిని కలిగించే కథ, కథనాలు ఈ చిత్రంలో ఉంటాయి. ఈ రోజు నుంచి 15 రోజుల పాటు ఏకధాటిగా జరిగే షెడ్యూల్‌తో తొలి షెడ్యూల్ పూర్తవుతుంది. హృదయాలకు హత్తుకుంటుంది' అన్నారు. కృష్ణ భగవాన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్: జవ్వాడి నాయుడు, మాటలు: హరీష్ మీనన్, ఎడిటర్: సత్య గిడుటూరి, డిఒపి: చెంచు జింక, నిర్మాతలు పవన్ తరిగోపుల, ఏలూరు శ్రీను, దర్శకత్వం: ఆనంద్.కె.

# తెలుగు సినిమా పాన్ వరల్డ్‌కు వెళ్లాలి



నిర్మాత బన్నీవాస్

తెలుగు సినిమా పాన్ ఇండియా కాదు పాన్ వరల్డ్‌కు రీచ్ కావాలని, నిర్మాతగా తాను అదే కోరుకుంటానని అన్నారు ప్రొడ్యూసర్ బన్నీ వాస్ అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఏకం బిజినెస్ కాన్‌క్లేవ్‌లో అతిథిగా పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన దాదాపు 300 మంది వ్యాపారవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ బన్నీ వాస్ మాట్లాడుతూ మన జీవితంలో కష్టం సుఖం ఎలా ఉంటాయో సినిమా బిజినెస్ లోనూ లాభాలు, నష్టాలు సహజం. నేను పోగొట్టుకుంటే రేపు సంపాదిస్తాననే నమ్మకంతో ముందుకు వెళ్తుంటాం. మిగతా వ్యాపారాలు కొన్నేళ్లకు బోర్ కొడుతుంటాయి. కానీ సినిమాకు వర్క్ చేస్తున్నప్పుడు ఏ రోజూ విసుగురాదు. ప్రతి రోజూ ఒక కొత్త ఛాలెంజ్ గా తీసుకుని పనిచేస్తాం. నేను ఆర్య సినిమా డిస్ట్రిబ్యూషన్‌లో సక్సెస్ అయ్యాక ఇక మనం ఇక్కడ రాణించగలం అనే ఆత్మవిశ్వాసం కలిగింది. సినిమా వ్యాపారం ఎలా చేస్తే రీజనబుల్ అనేది నాకు తెలుసు. అందుకే ఇన్నేళ్లు పరిశ్రమలో కొనసాగుతున్నాను. ప్రతి ఫ్రైడే ఇక్కడ తలరాతలు మారిపోతుంటాయి. డబ్బుతో పాటు పేరు కూడా పోతుంది. ఎందుకంటే సినిమా అనేది పబ్లిక్ ప్లాట్ ఫామ్. సినిమా బాగుంటే ప్రశంసించే వాళ్లే. బాగా లేకుంటే విమర్శిస్తారు. దర్శకుడు స్క్రీన్ నుంచి ఆడియెన్స్ కు సినిమాను ఊహిస్తాడు. కానీ ప్రొడ్యూసర్ ఆడియెన్స్ నుంచి స్క్రీన్ కు సినిమాను ఊహించుకోవాలి. ప్రొడ్యూసర్ కావాలంటే ఈ క్వాలిటీ తప్పకుండా ఉండాలి. సినిమా క్రియేటివ్ గా ఉంటూనే కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఉండాలి. అప్పుడే ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. తెలుగు సినిమా పాన్ ఇండియా కాదు పాన్ వరల్డ్ వెళ్లాలి. అదే ప్రొడ్యూసర్స్ గా మేము కోరుకునేది అన్నారు.

# 30న 'క్రేజీ కల్యాణం'

నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. ఈ నెల 30న 'క్రేజీ కల్యాణం' సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్రంలోని 'అల సెంద్రవంక' సాంగ్‌ను హైదరాబాద్ వోక్సెన్ యూనివర్సిటీ విద్యార్థుల సందడి మధ్య లాంచ్ చేశారు. ఈ ఈవెంట్‌లో హీరో అఖిల్ ఉడ్డెమారి పాల్గొని తన డ్యాన్సులతో, మాటలతో భారీ సంఖ్యలో వచ్చిన విద్యార్థుల్లో జోష్ నింపారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ పాటకు స్టెప్స్ వేశారు. 'క్రేజీ కల్యాణం' సినిమా యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటుందని ఈ సందర్భంగా హీరో అఖిల్ చెప్పారు. 'అల సెంద్రవంక' పాటను సురేష్ బొబ్బిలి బ్యూటిఫుల్ మెలోడీ ఆకట్టుకునే లిరిక్స్ అందించారు. అనురాగ్ కులకర్ణి అందంగా పాడారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ సాయి కదిర, ప్రొడక్షన్ డిజైనర్ శ్రీపాల్ మాచర్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అఖిల్ సాయి శ్రీమూర్తి, కొరియోగ్రాఫర్ ఈశ్వర్ పెంటి, యాక్షన్ డ్రాగన్ ప్రకాష్, పాటలు గోరటి వెంకన్న, చైతన్య ప్రసాద్, కాసర్ల శ్యామ్, ఎడిటర్ శ్రావణ్ కటికనేని, డిఒపి శ్యామ్ దూపాటి.

# నర్తకిగా 'పూజిత పొన్నాడ'



'ఎస్ఆర్ కళ్యాణమండపం' చిత్రంతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించి దర్శకుడిగా ప్రతిభ చాటుకున్న డైరెక్టర్ శ్రీధర్ గాదె మరో కొత్త చిత్రాన్ని రూపొందిస్తున్నారు. శ్రీ ఐశ్వర్య లక్ష్మి మూవీస్ బ్యానర్‌పై ఆది సాయి కుమార్‌తో చుట్టాలబ్బాయ్ వంటి ఫ్యామిలీ మూవీ, ఆనంద్ దేవరకొండతో 'హైవే' వంటి యూనిక్ థ్రిల్లర్ మూవీని నిర్మించిన ప్రొడ్యూసర్ వెంకట్ తలారి తమ ప్రొడక్షన్ నెం.3గా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో 'కమిటీ కుర్రోళ్లు' మూవీ ఫేమ్ ఈశ్వర్ రాచి రాజు హీరోగా నటిస్తుండగా, నందు, లిఖిత హీరోయిన్స్ గా నటిస్తున్నారు. పూజిత పొన్నాడ, సింధు కాసారం ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ చిత్రంలో నర్తకి క్యారెక్టర్‌లో టాలెంటెడ్ యాక్ట్రెస్ పూజిత పొన్నాడ నటిస్తున్నారు. జు పూజిత పొన్నాడ బర్త్ డే సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ నర్తకి క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. రాజభవనంలో నర్తకిమణిగా ముస్తాభైన పూజిత పొన్నాడ లుక్ ఆకట్టుకుంటోంది. నటిగా ఆమెకు ఈ సినిమా మంచి గుర్తింపు తీసుకొస్తుందనే అంచనాలు ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ తో ఏర్పడుతున్నాయి.విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే హారర్ చిత్రమిది. ఈ సినిమాను సరికొత్త కథా కథనాలతో ప్రేక్షకులను ఆకట్టుకునేలా దర్శకుడు శ్రీధర్ గాదె తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు. ఈశ్వర్ రాచి రాజు, నందు, లిఖిత, పూజిత పొన్నాడ, సింధు కాసారం, సురేష్ గురు, రాయల్ శ్రీ, మట్టా శివకుమార్, విహా దీకొండ, సునీత మనోహర్, అమ్మ రామచంద్రయ్య, తదితరులు నటిస్తున్నారు.

# అమ్మ చెప్పిన ప్రేమ కథ

'చకోర' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో డైరెక్టర్ మంగా శ్రీనివాస్



హోయ్ జాయ్ కమర్షియల్స్ బ్యానర్ పై డా. చింతాడ హేమారావు నిర్మాతగా, వింటేజ్ ఐకానిక్ సంస్థ నిర్మాణ సారథ్యంలో మంగా శ్రీనివాస్ రచన దర్శకత్వంలో రూపొందిన మాస్ పోయెట్రీ మ్యూజికల్ లవ్ స్టోరీ 'చకోర'. శ్రవణ్, మలైకా టి. వాసుపల్‌ను సరికొత్త ప్రేమ జంటగా పరిచయం చేస్తూ తెరకెక్కిన ఈ ప్రేమ కథ చిత్రం శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా ఈ నెల 9న వరల్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను స్టార్ డైరెక్టర్ శివ నిర్వాణ అతిథిగా విశాఖలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 'చకోర' ఇదొక అమ్మ చెప్పిన ప్రేమ కథ. ఒక అబ్బాయి ప్రేమ కథ. ఒక అందమైన ప్రేమ కథ. చకోర ఒక విశిష్టమైన పక్షి. దాహం వేస్తే ఎక్కడ పడితే అక్కడ నీళ్లు తాగకుండా వర్షపు నీళ్లతోనే దాహం తీర్చుకుంటుంది. మనం కూడా జీవితంలో స్వచ్ఛమైన ప్రేమ కోసమే వేచి చూడాలనేది మా సినిమాలో చెబుతున్నాం. చకోర పక్షికి జాబిల్లిని చేరాలని కోరిక. దాన్ని చేరేందుకు అలుపెరుగకుండా ప్రయత్నిస్తుంటుంది. ఆ ప్రయత్నంలో మరణిస్తుంది గానీ ప్రయత్నం ఆపదు. మనం కూడా చకోర పక్షిలా మన లక్ష్యాన్ని చేరుకునేందుకు అవిశ్రాంతంగా ప్రయత్నించాలి. ఇదే చకోర పక్షి మనకు నేర్పించే పాఠం.

మా సినిమాకు ప్రివ్యూస్ వేశాం. చూసిన వాళ్లు జెన్ జీ ప్రేమ కథ అని, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని చెబుతున్నారు. మరికొందరు క్లాసికల్ కమర్షియల్ సినిమా అంటున్నారు. మా సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బ్యూటిఫుల్ ఫస్టాఫ్, వండర్ ఫుల్ సెకండాఫ్ అంటున్నారు. థియేటర్స్ లో ఈ నెల 9న ప్రేక్షకులు అందించే విజయం కోసం ఎదురుచూస్తున్నాం అన్నారు.ప్రొడ్యూసర్ డా. చింతాడ హేమారావు మాట్లాడుతూ ఈరోజు మా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కు అతిథిగా వచ్చిన స్టార్ డైరెక్టర్ శివ నిర్వాణ గారికి థ్యాంక్స్. 'చకోర' మూవీ మా టీమ్ అందరి కల. సినిమా అద్భుతంగా వచ్చింది. ఇదొక భిన్నమైన ప్రేమ కథ. ఈ సినిమా చూసి మీరు అందించే ప్రశంసలు, కొట్టే చప్పట్లే మాకు కోట్లాది రూపాయల ఆస్తిగా భావిస్తాం. జీవితంలో చకోర పక్షిని ఆదర్శంగా తీసుకోండి. మీరు అనుకున్నవి పట్టుదలగా సాధించండి. ఈ నెల 9న రిలీజ్ అవుతున్న మా చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరుకుంటున్నా అన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ మలైకా టి.వాసుపల్ , డిఒపి రుప్ప గోపీకృష్ణ ,హీరోయిన్ అనుష్క లూహార్ , నటుడు సుమన్ , హీరో శ్రవణ్ , డైరెక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని నియోజకవర్గాల్లో దశలవారీగా
# 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల'ను దశలవారీగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. డిసెంబర్, 2027 నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయాలని, జూన్ 2028 నాటికి ఈ సంఖ్యను 87కు పెంచేలా పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం, విద్యా మౌలిక వసతుల అభివృద్ధి, ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యల'పైన హైదరాబాద్‌లోని సచివాలయంలో సంజయ్‌జాజు సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత గడువుల్లో నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ విద్యా కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.లండన్ యూనివర్సిటీ వంటి ప్రముఖ అంతర్జాతీయ విద్యా సంస్థలను తెలంగాణకు ఆకర్షించేలా సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు లండన్ విశ్వవిద్యాలయం, బర్మింగ్హామ్ విశ్వవిద్యాలయంతో పాటు మరో 4 అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు ఫ్యూచర్ సిటీలో తమ బ్రాంచీలు ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశాయన్నారు. విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాల విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రతిపాదిత అంతర్జాతీయ విద్యా సంస్థల ఏర్పాటుకు సంబంధించి ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాలతో సంప్రదింపులు జరిపి, గ్లోబల్ సమ్మిట్ సమయానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను సంజయ్ జాజు ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా, రాహుల్ బొజ్జ, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పాల్గొన్నారు.

# పెట్టుబడుల సమ్మిట్‌కు అంతర్జాతీయ అగ్రనేతలే లక్ష్యం..

ఈ నెలలో విదేశాల్లో రోడ్‌షోలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా తీర్చిదిద్దే లక్ష్యంతో డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను ప్రభుత్వం వేగవంతం చేసింది. సమ్మిట్‌కు ప్రపంచ స్థాయి కంపెనీల అగ్రనాయకత్వాన్ని పెద్ద ఎత్తున ఆకర్షించడంతో పాటు, రాష్ట్రంలో ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థల భాగస్వామ్యాన్ని విస్తృతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం ఉన్నతాధికారులతో సమావేశమైన ప్రధాన కార్యదర్శి.. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శాఖలవారీగా సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన ఏర్పాట్ల పురోగతిని అడిగి తెలుసుకుని, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణలో ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ కంపెనీలను సమ్మిట్‌లో భాగస్వాములను చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంజయ్ జాజు సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రముఖ కంపెనీలకు సమ్మిట్ అడ్వైజరీ బోర్డు లేదా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో తగిన ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అంతర్జాతీయ స్థాయిలో పేరున్న బహుళజాతి సంస్థల గ్లోబల్ హెడ్‌లను సమ్మిట్‌కు ఆహ్వానించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రపంచస్థాయి కంపెనీల అగ్రనాయకత్వంతో అనుసంధానం పెంచుకుని, ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, వ్యాపార అనుకూల వాతావరణం, వివిధ రంగాల్లో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను అంతర్జాతీయ పెట్టుబడిదారులకు వివరించేందుకు ఈ నెలలో విదేశాల్లో రోడ్‌షోలు నిర్వహించాలని సిఎస్ ఆదేశించారు. కార్పొరేట్ సంస్థల ప్రముఖులను కూడా ఈ కార్యక్రమాల ద్వారా ఆకర్షించాలని సూచించారు. ఈ నెలాఖరులో న్యూఢిల్లీలోనూ ప్రత్యేక రోడ్‌షో నిర్వహించాలని ఆదేశించారు. సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి అన్ని రంగాల టెండరింగ్ ప్రక్రియ నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తయినట్లు అధికారులు సీఎస్‌కు వివరించారు. అరేనా, ఎగ్జిబిషన్ ఏర్పాట్లతో పాటు మీడియా, ఆతిథ్యం, లాజిస్టిక్స్, ప్రోటోకాల్, ఆహారం, సాంస్కృతిక కార్యక్రమాలు, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లు కూడా షెడ్యూల్ ప్రకారం కొనసాగుతున్నాయని తెలిపారు. సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ సలహాదారు, ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, సీఈఓ సెర్ప్ దివ్య, స్పెషల్ సీఐపీఆర్ ముకుంద రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

## తుది ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

డసిల్వా విశ్వాసం వ్య క్తం చేశారు. కాగా,బ్రెజిల్‌లోని 26 రాష్ట్రాల లో గవర్నర్లు, వైస్–గవర్నర్లు, ఫెడరల్ జిల్లాలలో కూడా ఇదే పద్ధతిలో రెండు విడతలుగా ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది.బ్రెజిల్‌లో 16 ఏళ్ళ వయసు దాటిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉంది. 18–70 మధ్య వయసుగల అక్షరాస్యులు తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనాలి.ప్రస్తుతం గృహనిర్బంధంలో ఉండి శిక్ష అనుభవిస్తున్న మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సెనారో కుమారుడు ఫ్లావియా బోల్సెనారోతోపాటు మొత్తం 11 మంది అభ్యర్థులు లులా డసిల్వాకు వ్యతిరేకంగా ఎన్నికల బరిలో పోరాటం చేస్తున్నారు.ప్రధానంగా మితవాద సోషల్ లిబరల్‌పార్టీ నాయకుడు ఫ్లావియా బోల్సెనారో తన తండ్రి వారసత్వ అధికారాన్ని తిరిగి సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నారు. తడబడిన ట్రంప్ బ్రెజిల్‌కూ,భారత్‌కూ మధ్య తేడా ఏమిటో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు తెలియదా?ఆయన ఎంత పెద్ద తప్పు చేశారంటే బ్రెజిల్‌లో ఆదివారం అధ్యక్ష ఎన్నికలు జరిగితే ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా పోస్టింగ్ పెడుతూ,భారతదేశంలో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు.బ్రెజిల్–భారత్ రెండూ భూగోళానికి సరిగ్గా వ్యతిరేక దిశలో ఉంటాయి. కానీ ట్రంప్ భారతదేశంలో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయని సోషల్‌మీడియా పోస్టింగ్‌లో పేర్కొన్నారు.భారత్‌లో అధ్యక్షుణ్ణి రాష్ట్రపతి అని పిలుస్తారు. పైగా రాష్ట్రపతిని ప్రజలు నేరుగా ఎన్నుకునే రాజ్యాంగ విధానమే అమలులో లేదు. ట్రంప్ తన సోషల్ మీడియాద్వారా పచ్చి వ్యాకరణ దోషాలతో కూడిన తప్పుల తడక పోస్టింగ్ చేశారు. ఈ పోస్టింగ్ ట్రంప్ నేరుగా చేయకపోయినా ఆ సోషల్ మీడియా వేదిక ఆయనదే. ఎక్కడో అమెరికా ఖండంలో ఉన్న బ్రెజిల్‌కు,ఆసియాఖండంలో ఉన్న భారత్‌కు ఎంత తేడా ఉంది. కానీ ట్రంప్ ఇటీవల ఇలాంటి తప్పులు చేస్తున్నారు. తనకుముందు అధ్యక్షుడైన జో బైడెన్ మతిమరపును,ఆయన అనారోగ్యాన్ని తీవ్రస్థాయిలో ట్రంప్ విమర్శించారు. కానీ ట్రంప్ చేస్తున్న వ్యాకరణ దోషాలతో కూడిన తప్పులు అనారోగ్యంతో ముడిపడి ఉన్నాయా?లేక పొరపాటున చేస్తున్నారా? అనే విషయం తెలియడంలేదు. బ్రెజిల్‌లో ఆదివారం జరిగిన మొదటి విడత ఎన్నికల్లో 125.27 మిలియన్ల చెల్లుబాటయ్యే ఓట్లు నమోదయ్యాయి. కానీ ''భారతదేశంలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో 125 మిలియన్ల మంది ఓటర్లు పాల్గొన్నారు,కానీ ఎంతో త్వరగా ఫలితాలు వెలువడ్డాయో'' అని ఆయన తన పోస్టింగ్‌లో ఆశ్చర్యం వ్యక్తం చేశారు.బ్రెజిల్ అధ్యక్ష పదవికి మొదటిదశ పోలింగ్‌లో 12 మంది అభ్యర్థులు పోటీ పడితే ఎవ్వరికీ మెజారిటీ రాలేదు. దీంతో అక్టోబరు 25న రెండో విడత ఎన్నికల తేదీని ప్రకటించారు.ఆ తర్వాత ట్రంప్ తన పోస్టింగ్‌లో అలవాటు ప్రకారం అమెరికా ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోటుపాట్లను విమర్శించారు. అమెరికా ఎన్నికల వ్యవస్థ అవినీతిమయంతో కూడుకుందని విమర్శించారు. భారతదేశంలో ఓటరు కార్డులు ఉన్నాయని,ఓటరు గుర్తింపు కార్డులు లేకుండా ఎలా ఎన్నికలు నిర్వహిస్తారని గతంలో కూడా భారతదేశాన్ని ట్రంప్ ప్రశంసించారు. ఇప్పుడు కూడా తన పోస్టింగ్‌లో భారత్‌ను ప్రశంసించారు.

## చర్యలు తీసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

గోషామహల్ నియోజకవర్గంలోని ప్రింటెడ్ దరఖాస్తులకు సంబంధించిన వీడియోలో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిన నేపథ్యంలో ఓ వర్గం ఓట్లు లక్ష్యంగా ఫారం–7 దాఖలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ అంశంపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పందించింది. ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియలో తప్పుడు సమాచారంతో నకిలీ దరఖాస్తులు సమర్పించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఇఒ సుదర్శన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## ముప్పు లేదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుపై పూర్తి స్థాయి శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాతే తదుపరి చర్యలు చేపడతామని పేర్కొంది. వెంకటాపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు విషయంలో అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు సింగరేణి తెలిపింది. ముఖ్యంగా రామప్ప దేవాలయంపై ప్రాజెక్టు ప్రభావం ఏమైనా ఉంటుందా అనే అంశాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయనున్నట్లు పేర్కొంది. భారత పురావస్తు శాఖతో పాటు ఇతర ప్రతిష్టాత్మక సంస్థలు శాస్త్రీయంగా అధ్యయనం చేసి అందించే నివేదికల ఆధారంగానే మైనింగ్‌కు సంబంధించి తదుపరి చర్యలు తీసుకుంటామని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. రామప్ప దేవాలయం, దాని చారిత్రక ప్రాధాన్యత, వారసత్వ విలువలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థగా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్న సింగరేణి.. తెలంగాణకు చెందిన ప్రపంచ వారసత్వ సంపద రామప్పకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం కలిగించబోదని స్పష్టం చేసింది. వారసత్వ సంపద పరిరక్షణకు సంస్థ కట్టుబడి ఉందని పేర్కొంది. పర్యావరణహితమైన, చట్టబద్ధమైన మైనింగ్ కార్యకలాపాలకే సింగరేణి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని యాజమాన్యం పునరుద్ఘాటించింది. శాస్త్రీయ అధ్యయనాలు, సంబంధిత సంస్థల నివేదికలు అందిన తర్వాతే వెంకటాపూర్ ప్రాజెక్టుపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది.

## ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. అటవీ సంబంధిత సమస్యల కారణంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోకుండా, పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని సూచించారు. అవసరమైతే ఈ అంశంపై రాష్ట్రస్థాయిలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి తెలిపారు.గతంలో సుమారు 125 ఏళ్ల క్రితం భూముల సర్వే జరిగిందని, ప్రస్తుతం వచ్చే ఏడాది దిన్నరలో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో భూ సర్వే పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో రెవెన్యూ, అటవీ శాఖలకు సంబంధించిన సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో భూ సర్వేను దశలవారీగా నిర్వహించి, ప్రతి భూ కమతానికి ల్యాండ్ పార్సెల్ మ్యాపింగ్ (ఎల్‌పీఎం) నంబర్ కేటాయించే ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. భూములకు సంబంధించిన సమగ్ర వివరాలను నమోదు చేసి,భూ హక్కులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా పరిపాలన ఉండాలని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి బలమైన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్,రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఐటిడిఏ పిఒ మంద మకరందు,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు,సబ్ కలెక్టర్లు,రెవెన్యూ, గృహ నిర్మాణ,అటవీ శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com